# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 25-7-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 262 పేజీలు 8 వెల: రూ.1/-


## జగిత్యాలలో కూతుళ్లతో కలసి బావిలో దూకిన తల్లి

జగిత్యాల, జులై 24:జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం సర్వాపూర్‌లో విషాదం నెలకొంది. ఇద్దరు కుమార్తెలతో కలిసి ఓ తల్లి బావిలో దూకింది. దీంతో తల్లి, ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. మృతులను స్వప్న, అహల్యశ్రీ(3), విన్ను(నాలుగు నెలలు)గా పోలీసులు గుర్తించారు. స్వప్న భర్త నరేష్.. మల్యాలలో లేడీస్ ఎంపోరియం నిర్వహిస్తున్నాడు. లేడీస్ ఎంపోరియానికి వెళ్తున్నామని చెప్పి తన ఇద్దరు పిల్లలను తీసుకుని స్వప్న మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. షాపు వద్దకు వెళ్లకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా స్థానికంగా ఉన్న ఓ బావిలో స్వప్న, అహల్యశ్రీ, విన్నుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి నివాసంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనకు కారణాలు ఏంటని ఆరా తీస్తున్నారు. కుటుంబ కలహాలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలునాటిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**సాదాసీదాగా జరుపుకున్న కార్యకర్తలు**

**మొక్కలు నాటి అభిమానం చాటుకున్న నటుడు నితిన్**

**తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న మంత్రి తలసాని**

**శుభాకాంక్షలు అందచేసిన ఎమ్మెల్యే హరీష్ రావు**

హైదరాబాద్,జులై24(ఆర్‌ఎన్‌ఎ): టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్జన్మదినోత్సవాన్నిపురస్కరించుకుని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేక్‌లు కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ప్రధానంగా మొక్కలునాటి హరితస్ఫూర్తిని చాటారు. పెద్దఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆ పార్టీ శ్రేణులు నిర్ణయించాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలస్థాయిలో రక్తదాన శిబిరాలు, పేదలు, వృద్ధులు, అనాథలకు పండ్లు, ఆహారం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. తన పుట్టినరోజున హంగుఆర్భాటాలు, అనవసర ఖర్చులు వద్దని, అవసరంలో ఉన్నవారికి సాయంచేయాలని పార్టీశ్రేణులు, అభిమానులకు కేటీఆర్ ఇప్పటికే పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు, అభిమానులు విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు, వయో వృద్ధులకు తమవంతు సాయం చేస్తున్నారు. కేటీఆర్ జన్మదినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని రాజకీయ నాయకులు, సినీ నటులు, ఇతర రంగాల ప్రముఖులు కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలం ఆరోగ్యంతో సంపన్నంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణభవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజకీయాల్లో చిన్న వయస్సులోనే కేటీఆర్ ఎంతో పేరు తెచ్చుకున్నారని ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. యువతకు కేటీఆర్ మార్గదర్శిగా నిలిచారని చెప్పారు. బుధవారం నగరంలోని తెలంగాణ భవన్ లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా తెలంగాణ భవన్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రక్తాదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడారు. ఐటీ మినిస్టర్ గా హైదరాబాద్ ఇమేజ్ ను పెంచిన వ్యక్తి కేటీఆర్ అని చెప్పారు. రాజకీయాల్లో యువతకు అవకాశం కల్పిస్తున్న వ్యక్తి కేటీఆర్ అని టీఆర్‌ఎస్‌వీ ప్రెసిడెంట్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బాల్క సుమన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నితిన్

కేటీఆర్ పుట్టినరోజుసందర్భంగా ఎంపీ సంతోష్ గిఫ్ట్ ఏ స్మైల్ అనే ఛాలెంజ్‌ని స్ఫూర్తిగా తీసుకొని ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి, మాజీ ఎంపీ కవిత, విజయ్ దేవరకొండ, నితిన్‌లకు విసిరారు. ఈ క్రమంలో ఛాలెంజ్‌ని స్వీకరించిన హీరో నితిన్ తన పెరట్లో ఓ మొక్కని నాటాడు. గిఫ్ట్ ఏ స్మైల్ ఛాలెంజ్ అనే కార్యక్రమం మంచి ప్రయత్నం. ఇలాంటి సామాజిక బాధ్యతలో నన్ను భాగం చేసినందుకు సంతోష్ కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన ప్రపంచాన్ని అందంగా మార్చడంలో మా బాధ్యతలు గుర్తుచేసే ఏ సవాలునైనా స్వీకరించడానికి ఎల్లప్పుడూ సిద్ధమే. నా పని పూర్తి చేశాను. ఇప్పుడు మీ సమయం ఆసన్నమైంది. హ్యాపీ బర్త్ డే కేటీఆర్‌అని నితిన్ తన ట్వీట్‌లో పేర్కొన్నాడు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కే.పి. వివేకానంద ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి మొక్కలు నాటారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా ముఖ్రా కె గ్రామ వైకుంఠదామంలో గ్రామస్తులు 500 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గా÷-గడె మీనాక్షి, ఎంపీటీసీ గా÷-గడె సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహ్రాయిన్‌లో ఘనంగా వేడుకలు

కేటీఆర్ జన్మదిన వేడుకలను బహ్రెయిన్‌లో ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా బహ్రెయిన్ ఎన్నారై టీఆర్ఎస్ సెల్ ఆధ్వర్యంలో గుదైబియా అండాల్స్ గా÷-డ్గ÷న్‌లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్నారై టీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ.. కేటీఆర్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారని, బంగారు తెలంగాణ నిర్మాణానికి కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు ఐటీ కంపెనీలు తెచ్చేందుకు కేటీఆర్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కేటీఆర్ జన్మదిన వేడుకల్లో ఉపాధ్యక్షులు వెంకటేశ్ బొలిశెట్టి, ప్రధాన కార్యదర్శులు పుప్పాల బద్రి, మగ్గిడి రాజేందర్, సెక్రటరీలు సంగేపు దేవన్న, నరేశ్ ఎల్లుల, ఉత్కమ్ కిరణ్ కుమార్, సోనా గంగాధర్, సంతోష్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో విషాదం

**కారులో ఊపిరాడక ఇద్దరు చిన్నారుల మృతి**

నిజామాబాద్,జులై24 (ఆంఎన్‌ఎ): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ముజాహిద్‌నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు కారులో ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మంగళవారం రాత్రి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముజాహిద్‌నగర్‌కు చెందిన సయ్యద్ రియాజ్ (10), మహ్మద్ బద్రుద్దీన్(5) అనే ఇద్దరు చిన్నారులు మంగళవారం మధ్యాహ్నం ఆటాడుకుంటామని చెప్పి బయటకు వెళ్లారు.

అయితే సాయంత్రం అయినా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అర్ధరాత్రి సమయంలో మృతుల ఇళ్లకు సమీపంలో కారు వెనకసీటులో పిల్లలు విగత జీవులుగా కనిపించారు. కారు ఓనర్ అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో కారు డోర్ తీయగా పిల్లలు చనిపోయి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతి చెందిన పిల్లలిద్దరూ అక్కాచెల్లెళ్ల కుమారులు.

ఈ ఘటనపై కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కారు డోరు తసీఇ ఉండడంతో అందులోకి వెళ్లి డోర్ వేసుకోగా ఇలా జరిగి ఉంటుందన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## చరిత్రలో నేటినిజం



కం॥ జింకలపై లంఘించెడు
వేంకటల మదమణచి వేయు ఘోరాటవిలో
పొంకము గ "కార్బెంట్" చేయుచు
"జింకార్బెటు" వేటలో విశిష్టత దెలిపెన్!!

( జులై 25 ప్రఖ్యాతుడైన వేటగాడు జిమ్‌కార్బెట్ జననం) -రాధశ్రీ

సెల్: 9494481210

# గంజాయి కేసులపై లోతుగా దర్యాప్తు

హైదరాబాద్,జూలై24 (ఆంఎన్‌ఎ): హైదరాబాద్‌లో మళ్లీ గంజాయి, డ్రగ్స్ వ్యవహారాలు చాటుమాటుగా సాగుతున్నాయి. ఉత్తరాంధ్రనుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా పెరిగింది. ఇటీవల వరుసగా పట్టుబడుతున్న కేసులు చూస్తుంటే చాపకింద నీరులా కొందరు తమ వ్యాపారాన్ని మూడుపు వ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తున్నారు. పోలీసులు నిరంతరంగా శ్రమిస్తూ ఎక్కడిక్కడ దొంగలను పట్టుకుంటున్నారు. గతంలో డ్రగ్స్ కేసు బయట పడ్డప్పటి నుండి మొదట కార్పోరేట్ స్కూల్స్, కాలేజీల్లో డ్రగ్స్ వినియోగంపై చర్చ జరిగింది. ఆ తర్వాత టాలీవుడ్‌లో సెలబ్రిటీలను కేసులోకి లాగేసింది. గంజాయి పెద్ద మొత్తంలోఒ ఇటీవల సిద్దిపేట వద్ద పట్టుబడింది. నిత్యం ఎక్కడో ఓ చోట పట్టుబుతూనే ఉంది. ఈ దశలో కాలేజీలు, స్కూళు అప్రమత్తంగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే వారిని ఉచ్చులోకి దించే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# బీహార్, అసోంలలో కొనసాగుతున్న సహాయకచర్యలు

**పలు జిల్లాల్లో పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు**

న్యూఢిల్లీ,జులై24(ఆర్‌ఎన్‌ఎ): గత పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలతో అసోం, బీహార్ రాష్ట్రలను వరదుల ముంచెత్తాయి. దీంతో అక్కడ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. వరదల వల్ల ఇప్పటికే 174 మంది మరణించారు. 1.09 కోట్ల మంది ప్రజలను వరద ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బీహార్ రాష్ట్రంలో వరద విపత్తు వల్ల 106 మంది మరణించారు. అసోం రాష్ట్రంలో 68 మంది మృత్యువాత పడ్డారు. అసోంలోని కజిరంగ జాతీయ పార్కులో ఉన్న వన్యప్రాణుల్లో 204 ప్రాణులు వరదల్లో మరణించాయి. బీహార్ రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 80.5 లక్షల మందిని సహాయపునరావాస శిబిరాల కు తరలించారు. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమాయక చర్యల నుముమ్మరం చేసింది. ఇకపోతే దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీవర్షాలు కురుస్తాయని ఢిల్లీలోని భారత వాతావరణ శాఖ బుధవారం హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తరప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో బుధవారం భారీవర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు. సబ్ హిమాలయన్ రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, సిక్కిం, బిహార్‌లతో పాటు కోస్తా కర్ణాటక, కొంకణ్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. తూర్పు రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, మధ్య మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఒడిశా, జార్ఖండ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర ప్రాంతాల్లో ఓ వారం రోజుల నుంచి భారీవర్షాలు కురవవచ్చని భారత వాతావరణశాఖ బుధవారం జారీ చేసిన బులెటిన్ లో పేర్కొంది. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్ ఘడ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో పిడుగులు పడే ప్రమాదముంది. అరేబియా సముద్రంలో కొన్నాళ్లపాటు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశించారు.

# నిమ్మికల్‌లో మంత్రి జగదీష్ రెడ్డి ఆసరా పింఛన్ల పంపిణీ



సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూరు(ఎస్) మండలం నిమ్మికల్ గ్రామంలో ఆసరా పింఛన్లను పంపిణీ చేసిన మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట, జులై 24: జిల్లాలోని ఆత్మకూరు(ఎస్) మండలం నిమ్మికల్ గ్రామంలో మంత్రి జగదీష్ రెడ్డి ఆసరా పింఛన్లను పంపిణీ చేశారు. పెరిగిన పింఛన్ ప్రొసిడింగ్ ప్రతాలను మంత్రి లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దీపిక, వైస్ చైర్మన్ వెంకట నారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై..

# ప్రధాని వివరణ ఇవ్వాల్సిందే

**- లోక్‌సభలో పట్టుపట్టిన కాంగ్రెస్ సభ్యులు**

**- కశ్మీర్ సమస్యపై ఎవరి మధ్యవర్తిత్వం ఉండదు**

**- స్పష్టం చేసిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

**- సభనుంచి వాకౌట్ చేసిన కాంగ్రెస్**

హైదరాబాద్, జులై24(ఆంఎన్‌ఎ) : కశ్మీర్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో లోక్‌సభ మరోసారి దద్దరిల్లింది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తింది. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేసింది. ఇతర విపక్ష పార్టీల నేతలు కూడా కాంగ్రెస్‌కు మద్దతిస్తూ ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఈ విషయంలో మోదీ మౌనంగా ఉండటం సరికాదని విమర్శించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ దీనిపై సమాధానం చెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్షాలు వినిపించుకోలేదు. మోదీనే నేరుగా మాట్లాడాలని పట్టుబట్టాయి. అనంతరం కేంద్రం తీరును నిరసిస్తూ ప్రతిపక్ష నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కశ్మీర్ వివాదంపై స్పందించారు. కశ్మీర్ అంశంలో మధ్యవర్తిత్వం ప్రశ్నే లేదని, మోదీ-ట్రంప్ భేటీలో ఆ విషయం చర్చకు రాలేదని ఆయన స్పష్టం చేశారు. 'భారత ఆత్మగౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. కశ్మీర్ విషయంలో విదేశాంగమంత్రి జయ్‌శంకర్ చెప్పింది అక్షరాలా నిజం. ఎందుకంటే ఒసాకాలో మోదీ-ట్రంప్ భేటీ జరిగినప్పుడు ఆయన కూడా ఉన్నారు. కశ్మీర్ విషయంలో ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని వేం అంగీకరించబోం. ఇది మన గౌరవానికి సంబంధించిన విషయం. అంతేగాక మధ్యవర్తిత్వం అనేది శిమ్లా ఒప్పందానికి విరుద్ధమని రాజ్‌నాథ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న పాక్ ప్రధాని ఇమ్రాన్‌తో ట్రంప్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం చేయాలని మోదీ తనను కోరినట్లు ట్రంప్ చెప్పారు. దీంతో గత రెండు రోజులుగా పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతున్నది. ట్రంప్, మోదీ మధ్య ఏం చర్చ జరిగిందో అన్న అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, పార్లమెంట్‌కు మోదీ వచ్చి వివరణ ఇవ్వాలని అధిర్ రంజన్ డిమాండ్ చేశారు.

# పాక్‌లో ఉగ్రవాదులున్నారు

**- 30వేల నుంచి 40వేల మంది ఉంటారు**

**- ఉగ్రసంస్థల నిర్వీర్యం కోసం చర్యలు తీసుకుంటున్నాం**

**- తాలిబన్లతో చర్చల విషయంలో అమెరికాకు సహకరిస్తాం**

**- పుల్వామా దాడిలో పాక్ ప్రమేయం లేదు**

**- పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్**

వాషింగ్టన్, జులై24(ఆర్‌ఎన్‌ఎ) : పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఉన్నారని, 30వేల నుంచి 40వేల మంది వరకు ఉగ్రవాదాలు ఉంటారని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటన లో ఉన్న ఆయన యునైటెడ్ స్టేట్స్ పీస్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాలు బయటపెట్టారు. తమ దేశంలో ఇంకా 30వేల నుంచి 40వేల మంది ఉగ్రవాదులు ఉన్నారని బహిరంగంగా ప్రకటించారు. గత ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం వల్లే వాటి కార్యకలాపాలు హెచ్చు మీరాయన్నారు. ముష్కరులంతా అఫ్ఘనిస్థాన్, కశ్మీర్ ప్రాంతాల్లో శిక్షణ పొంది దాడులకు పాల్పడుతున్నా రన్నారు. 2014లో తాలిబన్లు చేసిన దాడిలో దాదాపు 150 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయి నప్పుడే..దేశంలో ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలను ఏమాత్రం అనుమతించొద్దని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు అన్ని పార్టీలు కలిసి కార్యాచరణ రూపొందించాయన్నారు. కానీ చిత్తశుద్ధి లోపించిన గత ప్రభుత్వాలు దాన్ని అమలు చేయలేకపోయాయని తెలిపారు. తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉగ్రసంస్థల నిర్వీర్యం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. అంతకు ముందు జరిగిన మరో కార్యక్రమంలో దేశంలో దాదాపు 40 ఉగ్రవాద సంస్థలు ఉండేవని ఇమ్రాన్ వెల్లడించారు. వాటి విషయంలో పాక్ ప్రభుత్వం ఎప్పుడూ వాస్తవాలను బహిర్గతం చేయలేదని.. అమెరికాకు అబద్ధాలు చెబుతూ వచ్చిందని అంగీకరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వేం అమెరికాతో కలిసి యుద్ధం చేశామని, కానీ, పాక్ ప్రభుత్వం అమెరికాకి వాస్తవాలు చెప్పలేదన్నారు. ఎందుకంటే పాక్ గత ప్రభుత్వాలు తమ నియంత్రణలో ఉండేవి కావని, అప్పట్లో దాదాపు 40 ఉగ్రవాద సంస్థలు పాక్ కేంద్రంగా పనిచేస్తున్నాయని, అసలు దేశం ఎలా మనుగడ సాగిస్తుందనే చర్చ జరిగిందని ఇమ్రాన్ అన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలని అమెరికా కోరింది. కానీ, మేం మాత్రం మా ఉనికి కోసం పోరాడామని అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు షీలా జాక్సన్ ఏర్పాటు చేసిన సభలో ఇమ్రాన్ తెలిపారు. గత కొన్నేళ్లుగా అమెరికా-పాక్ మధ్య సంబంధాలు ఆశించిన స్థాయిలో లేవని.. ఇకపై వాటి పునరుద్ధరణకు కృషి చేస్తామని ఇమ్రాన్ చెప్పుకొచ్చారు. తాలిబన్లతో చర్చల విషయంలో అమెరికాకు సహకరిసామని తెలిపారు.

### పుల్వామా దాడిలో పాక్ ప్రమేయం లేదు..

ఐదునెలల క్రితం పుల్వామాలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది భారతీయ జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఈ ఘటనపై స్పందించారు.

పుల్వావా ఘటనతో తమకెలాంటి ప్రమేయం లేదని, తమను నిందించరాదంటూ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌కి చెందిన ఓ యువకుడే ఇందుకు మూలమన్నారు. తమంది భారతీయ రక్షక దళ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడానికి అతడే కారణమని, కానీ హఠాత్తుగా ఈ విషయంలో పాకిస్థాన్ వెలుగులోకి వచ్చిందని ఇమ్రాన్ పేర్కొన్నారు.

# బిల్లులో ఆ నియమం ఉండాల్సిందే : అమిత్ షా

హైదరాబాద్, జులై 24: చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ బిల్లుపై ఇవాళ లోక్‌సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాటాడారు. ఓ వ్యక్తిని ఉగ్రవాదిగా ప్రకటించే నియమం బిల్లులో ఉండాలని షా తెలిపారు. అలాంటి పద్ధతి అమెరికాలో, పాకిస్థాన్‌లో, చైనాలో, ఇజ్రాయిలలో, యురోప్ దేశాల్లో ఉన్నట్లు మంత్రి చెప్పారు. కఠినతరమైన చట్టాలను ఎవరు రూపొందించారు, వాటికి సవరణలు ఎవరు చేశారన్న విషయం మీకు తెలియదా అని షా సభలో ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కఠిన చట్టాలు వచ్చాయని, మీరు అప్పుడు చేసింది కరెక్ట్, ఇప్పుడు నేను చేసేది కూడా సరైందే అని షా అన్నారు. ఉగ్రవాదులపై కఠినాతికఠినమైన చట్టాలను రూపొందించాలన్నారు. ఉగ్రవాదులు తుపాకులతో పుట్టరని, ఉన్మాదాన్ని ప్రచారం చేసే వారి వల్ల ఉగ్రవాదులు పుడుతుంటారని షా అన్నారు. ఉగ్రవాదులకు ఫైనాన్స్ చేసేవారిని, వారికి సహకరించే వారిని కూడా ఉగ్రవాదులుగా పిలువాలన్నారు.




# యుగ కర్తగా డా॥కత్తి పద్మారావు





- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
- సెల్: 8331966987

భారతదేశంలో అంబేద్కర్ తరువాత అంత శక్తివంతమైన తాత్వికుల్లో కత్తి పద్మారావు గారు ఒకరు. అంబేద్కర్ భారత సమాజాన్ని పునర్నిర్మించే సూత్రాలందించారు. అవి ఆయన బుద్ధుణ్ణించి తీసుకుని సమకాలీన సమన్వయంతో మనకందించారు. ఒక వెయ్యేండ్ల స్థబ్ధీకృత సమాజం అంబేద్కర్ రాకతో ఒక కుదుపుకు గురయ్యింది. పరిణామం తీవ్రమయ్యింది. ఇందుకు హిందూవాద రచయితలు అంబేద్కర్‌ని కించపరచాలని ప్రయత్నిస్తున్నారు. అంబేద్కర్ తాత్విక అధ్యయనం నుండి పద్మారావు గారు వారికి సమాధానం చెప్పి మన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే క్రమాన్ని మనకు బోధిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ద్వారా సామాజిక ఉద్యమంతోపాటు, భావజాల ఉద్యమాన్ని ముందుకు నడిపి రెండు దశాబ్దాల భారతీయ సమాజ చరిత్రకు దిశానిర్దేశం చేసిన వారు డా.కత్తి పద్మారావు గారు. వీరు బలమైన దార్శనికులు కొత్త పదాలను సృష్టిస్తారు. కొత్త భావాలను, శాస్త్రాలను సృష్టిస్తారు. పాత పదాలకు, పాత సమాజాలకు కొత్త అర్థాలు నిర్వచిస్తారు. తమ స్థలకాలదేశ నిర్దిష్టతల్నించి సార్వత్రీకరిస్తారు. డా. కత్తి పద్మారావు గారు తన చుట్టూ తాను కోరుకునే సమాజాన్ని నిర్మించారు. తాను ఆశించిన సమాజ పునర్నిర్మాణం కోసం సామాజిక న్యాయం, సామాజిక మార్పు, సమసమాజ నిర్మాణం, కుల నిర్మూలన, స్వేచ్ఛా మానత్వం, ఆత్మగౌరవం ప్రాతిపతికంగా ఆయన బాల్యం, విద్యార్థి జీవితం, నాస్తిక హేతువాద ఉద్యమకారుడిగా, యువకుడిగా చుట్టూ గల సమాజంలో తనను తాను వెత్తుక్కున్నారు. తనను తాను పోల్చుకున్నారు. తనను తాను మలచుకున్నారు. తనను తాను ఎదిగే క్రమాన్ని తీసుకున్నారు. అలా డా.కత్తి పద్మారావు సమాజం నుండి శ్వాస, నిశ్వాసలను నేర్చుకున్నారు. సమాజమే శ్వాసగా, సమాజం కోసం ఎదగాలనే ఆశతో మొదలైన ప్రయాణం డా.కత్తి పద్మారావు గారిని అది సత్యమేనని మూఢ విశ్వాసాల నుండి దైవ భక్తి నుండి విడివడి, వాటిని వదిలి వేసి స్వతంత్ర్యంగా ఆలోచించే శక్తి సామర్థ్యాలను పొందే ధైర్యాన్ని, నైతిక స్థైర్యాన్ని పొందుతారు. అందుకే డా.కత్తి పద్మారావు గారి ప్రసంగాలు వందల వేల క్యాసెట్లుగా ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తుంటాయి. డా.కత్తి పద్మారావు గారికి వేలు, లక్షల మంది అభిమానులుగా, సహచరులుగా, శిష్యులుగా సమాజమంతటా విస్తరించారు. అది ఆయన టీవీ చర్చలను చూసే రూపంలో, ఆయన పుస్తకాలు వెంట వెంట పునర్ముద్రణలు వచ్చే రూపంలో చూడవచ్చు. దళిత ఉద్యమంలో డా.కత్తి పద్మారావు గారి ప్రసంగాలు, భావాలు విషయానికొస్తే అరివీర భయంకరుడు, శత్రువు అయినా సరే ఆయన వాదనముందు తల వంచాల్సిందే. తన తప్పు తెలుసుకోవాల్సిందే. న్యాయాన్ని గుర్తించాల్సిందే. సామాజిక న్యాయం చేయాల్సిందే. అంతగా హృదయ పరివర్తనను సాధించే ఔచిత్యం, శిల్పం కత్తి పద్మారావు అరివీర భయంకర ప్రసంగాల్లో అంతర్లీనంగా కొనసాగుతూనే ఉంటుంది. అందుకే ఆయన ప్రసంగాలు సహచరులకు, అనుచరులకు మహోన్నత స్ఫూర్తి దాయకాలు. శత్రువులకు గుండెల మీద సుత్తెలతో బాదే విస్ఫోటనాలు. కారంచేడు, చుండూరు దళిత మహాసభ ఉద్యమాలు దేశ వ్యాప్తంగా వేసిన ప్రభావం ఎంతో గొప్పది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భూములను వారసత్వ హక్కుగా అనుభవిస్తున్న వారందరినీ భూమి నుండి, భూమి యజమాని నుండి తొలగించాలని, ప్రభుత్వం తీసుకొని వారికి డిబెంచర్‌లు ఇవ్వాలని కోరారు. అంతదాక భూమి గురించి కాకుండా, అందరికీ ఎదిగే అవకాశాలు ఉన్నాయి. విద్యకు ప్రాధాన్యతను ఇచ్చారు. విద్య ద్వారానే అన్ని రంగాల్లో ఎదగవచ్చు. రాజకీయ అధికారం ద్వారా అన్ని రంగాలను మార్చవచ్చు అని అంబేద్కర్ చేసిన బోధనలు. అంబేద్కర్ మార్గాన్ని తెలుపుతాయి. ఈ మార్గంలో డా. కత్తి పద్మారావు ముందుకు సాగారు. బోధకుడిగా డా.కత్తి బుద్ధుడి మార్గంలో అంబేద్కర్ వారసుడిగా లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్దేశించింది. హేతువాద ఉద్యమం ఒక భావజాల ఉద్యమం. కత్తి పద్మారావు అందులో విశేషంగా కృషి చేశారు. కారంచేడు సంఘటనతో ఉద్యోగాన్ని వదిలి కత్తి పద్మారావు పూర్తి స్థాయి ఉద్యమ కారుడిగా పరిణామం చెందారు. డా. కత్తి పద్మారావు గారి జీవితం వడ్డించిన ఇస్తరి కాదు. విమానాశ్రమంలోని రన్‌వేపై రయ్యిన ఎగిరే విమానం వంటిది కాదు. రాళ్ళు, రప్పలు, ముల్లు, క్రూర జంతువులు, పాములు, తేళ్ళు ఉండే కంటక మార్గంలో సాగిన ప్రయాణం డా. కత్తి పద్మారావు గారిది. ఏటికి ఎదురీదడం ఆయన స్వభావం. బ్రాహ్మణ వాద, కుల వివక్ష పూరిత కుల వ్యవస్థను సమూలంగా మార్చాలని మనిషిని మనిషిగా గౌరవించాలని, అందరూ సమానమేనని ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే. మనుషులందరూ సమానమే. అని నమ్మి హేతువాదాన్ని, దళిత వాదాన్ని ఒక ఉద్యమంగా ముందుకు నడిపినవాడు కత్తి పద్మారావు గారు. కత్తి పద్మారావు గారు సంస్కృత కాలేజి విద్యాభ్యాసంలో సృష్టించిన రికార్డులు ఎన్నో. ఒక దళితుడు చదువుకోవడమే కష్టం. అందులోనూ సంస్కృతం చదువుకునేటప్పుడు దళితులకు ఎదురయ్యే సమస్యలు ఎన్నో. వాటన్నింటిని ఎదిరించే సాహసం డా.కత్తి పద్మారావుగారికి జీవితమే నేర్పింది. ఆ జీవితమే తిరుగుబాటుదారిగా, హేతువాదిగా, ఉద్యమకారుడిగా, నాయకుడిగా, కవిగా, దార్శనికుడిగా తీర్చిదిద్దింది. హేతువాద ఉద్యమంలో డా.కత్తి పద్మారావు ఒక కంచు కంఠం. మూఢ విశ్వాసాలను ఖండించడంలో దేవుడు లేడని వాదించి ఒప్పించడంలో ఆయన ప్రతిభా సామర్థ్యాలు వినేవారని ఆకట్టుకుంటాయి.

పద్మారావు గారు విశేష అనుభవాన్ని గడిరచారు. మహోపాధ్యాయుడిగా ఎదిగారు. కార్యకర్తలకు, ప్రజలకు శిక్షణా తరగతుల, అధ్యయన తరగతుల ఆవశ్యకతను బాగా గుర్తించారు. వర్తమాన కర్తవ్యాలను, సామాజిక అవగాహనను బోధించే శిక్షణా తరగతులు లేకుండా, ఏ ఉద్యమమూ ఎంతో కాలం ముందుకు సాగదు. ముందుకు సాగినా, అరాచకత్వం తప్ప ఒక సుశిక్షితులైన కార్యకర్తలతో, నిర్మాణంతో ముందుకు సాగడం నూతన సంస్కృతిని రూపొందించడం సాధ్యం కాదు. ఇది గమనించిన డా.కత్తి పద్మారావు గారు కొన్ని వందల శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆయా బహిరంగ సభల్లో చేసే ప్రసంగాలు కూడా శిక్షణా తరగతుల్లా అనేక విషయాలను ఆదేశాన్ని, ఉత్తేజాన్ని జోడించి ప్రజలను చైతన్య పరిచేవే. అలా డా.కత్తి పద్మారావు నిత్య బోధకుడిగా, దశాబ్దాలుగా సామాజిక చైతన్యాన్ని అందిస్తూ, సమస్యలు కరుడు కట్టి పోకుండా, మంచు వాటంతటవే కరిగిపోయే విధంగా చైతన్యాన్ని, విద్యను, సామాజిక వర్గాల బల ప్రదర్శనను, నినాదాలను, ఆయుధాలుగా ప్రయోగించారు. విజయం సాధించారు. అందువల్లే కారంచేడు, చుండూరు వంటి సంఘటనలు పోరాట చరిత్రను గుర్తుగా మిగిల్చాయి. పరస్పరం గౌరవించుకునే సమానంగా చూసే దృష్టి పెరిగింది. తెలుగు నాట అంబేద్కరిజం ఆచరణలో, బోధనలో దళిత మహాసభకు తర్వాత మౌలికమైన తేడా వుంది. దళిత మహాసభలకు ముందు అంబేద్కర్ ఆలోచనా విధానం, మిషన్ ఓరియంటెడ్‌గా, బోధనలతో సాగింది. దళిత మహాసభ మిలిటెంట్ చైతన్యాన్ని పెంచి, సంఘటిత శక్తిని, బలాన్ని ప్రదర్శించింది. అంబేద్కర్ జయంతి, వర్థంతుల సభలు కూడా, దళితుల సంఘటిత శక్తిని, బలాన్ని ప్రదర్శించడానికి సంబంధించినవే. అందుకే గ్రామ గ్రామాన అండేద్కర్ విగ్రహాలను స్థాపించడం, జయంతి వర్థంతులను ఘనంగా జరపడం జరుగుతున్నవి. పుస్తకం చేతబూనిన అంబేద్కర్ విగ్రహం దళితులకు, సమాజానికి విద్య యొక్క ప్రాధాన్యతను చెప్పకనే చెబుతుంది. కోటు, బూటు, సూటు వేషధారణ దళితులు ఎగాల్సిన తీరును చెప్పకే చెబుతుంది. డా.కత్తి పద్మారావు గారు వందలాది అంబేద్కర్ విగ్రహాలను రాష్ట్రమంతటా ఉద్యమంలా ప్రతిష్ఠాపన చేయడానికి కృషి చేశారు. అంబేద్కర్ విగ్రహాలను తయారు చేయించి, విగ్రహ ఆవిష్కరణ సభ జరిపేదాక అన్ని దశలను పట్టించుకొని ఈ కృషి సాగించారు. ఇలా ఆయా గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత దళితుడేనని ప్రపంచంలో బాగా చదువుకున్న ఉన్నత విద్యావేత్త అని నిరంతరం అంబేద్కర్ విగ్రహం గుర్తు చేస్తుంది. అలా భారతదేశంలో స్త్రీల చైతన్యం కోసం, స్త్రీ విద్య కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతీరావు పూలే భారతదేశంలోనే తొలి భారతీయ ఉపాధ్యాయురాలు అయిన సావిత్రి భాయి పూలే విగ్రహాలను, మహాకవి గుఱ్ఱం జాషువా విగ్రహాలను స్థాపించడంలో కత్తి పద్మారావు కృషి ఘనీయమైంది. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుపుతున్నామని, మీరు రావాలని పిలిచినప్పుడు ఎంత దూరమైనా లెక్క చేయకుండా రాష్ట్రమంతటా విగ్రహ ఆవిష్కరణ జరిపి తన ప్రసంగాలతో గొప్ప స్ఫూర్తిని నింపారు. కత్తి పద్మారావు తన బాల్యంలో వేసిన ప్రభావాలు వ్యక్తిత్వాన్ని మలిచిన తీరును తమ ఊరు ఉన్న తీరును ఇలా పేర్కొన్నారు. "మా ఊరు ఈతేరు గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని పల్లెటూరు. ఎక్కడ ఊరు పెద్దగా వాడ చిన్నగా ఉంటుంది. కానీ మా ఊళ్ళో మాది 300 మాల పల్లె. 40 కుటుంబాలు కమ్మవారు, రెండు, మూడు కుటుంబాల వడ్డెరలు. బ్రాహ్మణులు ఓ ఐదు కుటుంబాలు ఉండేవి. నేను 1953 జులై 27న పుట్టాను. మా అమ్మ మాణిక్యమ్మ, మా నాన్న సుబ్బయ్య, ఇద్దరూ వ్యవసాయ కార్మికులే. నేను పుట్టే నాటికి వారికి సొంతంగా భూమి అంటూ ఏమి లేదు. మా నాన్న కమ్మలు, బ్రాహ్మల దగ్గర జీతానికి ఉండేవాడు. విచిత్రమైన విషయం ఏమంటే మేం ఈతేరులో ఉండేది ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే. ఆదీ వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండే జులై నుండి డిసెంబరు వరకూ. మిగిలిన ఆర్నెల్లూ నా తల్లిదండ్రులు చీరాలలోని ఇండియన్ లీఫ్ టొబాకో డిపో (ఐఎల్‌టీడీ)లో కార్మికులుగా పనిచేసేవారు. అందువల్లే నా బాల్యమంతా ఇక్కడ అర్నెల్లు" అక్కడ అర్నెల్లుగా గడిచింది. కత్తి పద్మారావు గారి జీవిత కథలోనే ఆయన ఉద్యమం దాగుంది. డా.కత్తి పద్మారావు గారు చిన్న తనం నుండి సున్నిత హృదయుడు. సమాజంలో వున్న దుఃఖాన్ని నివారించడానికి ఆయన త్యాగపూరితంగా కృషి చేస్తారు. ఆయన అజాత శత్రువు. ఆయనకు అనంతమైన స్నేహ ప్రపంచం వుంది. మిత్రులకు అన్నం వడ్డించి ఆయన సంతోషిస్తారు. ఆయన సహచరిణి స్వర్ణకుమారి సావిత్రిబాయి పూలే వారసురాలు. కొన్ని వేల మందికి అన్నం వడ్డించిన చేయి ఆమెది. ఆమె దగ్గర ఎందరో కార్యకర్తలు సెల్టర్ తీసుకొన్నారు. కె.జి.సత్యమూర్తి గారు, నేను ఇంకా మాష్టార్జీ, గద్దర్, వంగపండు ప్రసాదరావు, అంగళకుర్తి విద్యాసాగర్ ఎందరో కవులు, కళాకారులు, ఉద్యమ కారులు ఆమె ఆతిథ్యం పొందారు. ఆయన పింగళి దశరధరామ్ హత్యకు గురైనపుడు కుటుంబాన్ని దగ్గరకు తీసుకొని వారి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించారు. అలా ఎందరికో సహకారం అందిస్తూ వుంటారు. కారంచేడు, చుండూరు, పిప్పర, కొత్తపేట, బండ్లపల్లి ఇలా ఎన్నో చోట్ల పోరాడి భూములు ఇప్పించి కాలనీలు కట్టించినా ఆయనకు లుంబినీ వనంలో ఇల్లు తప్ప ఎక్కడా ఒక్క సెంటు భూమి గాని లేదు. ఆయన తన పుస్తకాల మీద వచ్చేడబ్బుతో జీవి స్తారు. ఆయన తన సొంత లైబ్రరీలో యాభై వేల పుస్తకాలు సంపాదిం చుకోగలిగారు. తమ్ముళ్ళు, మరదళ్ళు, పిల్లలు అందరూ ఉద్యమంలో భాగంగానే జీవిస్తారు. వారిది ఉద్యమ కుటుంబంగా జీవిస్తున్నారు. వారి లుంబినీవనంలో అంబేద్కర్, పూలే, పెరియార్, సావిత్రిబాయి, జాషువా విగ్రహాలు ప్రతిష్టించారు. ఉద్యమ జీవితాన్ని నిరంతరం కొనసాగించడం చాలా కష్టమైన పని. దళితులే కాదు, బహుజనులు, మైనార్టీలు, అగ్రవర్ణ లౌకిక వాదులందరూ లుంబినీకి వచ్చిపోతుంటారు. ఈ మధ్య ఆయన వ్రాస్తున్న వ్యక్తిత్వ నిర్మాణ గ్రంథాలు, చరిత్ర, తత్వశాస్త్ర, రాజకీయ గ్రంథాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయి. తెలంగాణా ఉద్యమాన్ని, ప్రతేకాంధ్ర ఉద్యమాన్ని నిక్కచ్చిగా ఆయన సమర్థించడమే గాకుండా, అమరావతిని ముఖ్యపట్టణంగా చేయాలని శ్రీ కృష్ణ కమిటీ రిపోర్టు వ్రాసింది కూడా కత్తి పద్మారావు గారే. నిస్వార్థంగా జీవించడం, నిజాయితీగా నిక్కచ్చిగా మాట్లాడం ఆయన ప్రవర్తన. ఈ యుగకర్తృత్వానికి బహుముఖ ప్రజ్ఞాశాలిగా సజీవ శక్తులను అందిస్తున్న కత్తి పద్మారావు గారి 67వ జన్మదినోత్సవం ఒక చారిత్రక గుర్తు.

> ఆయన ప్రసంగాలు సహచరులకు, అనుచరులకు మహోన్నత స్ఫూర్తి దాయకాలు. శత్రువులకు గుండెల మీద సుత్తెలతో బాదే విస్ఫోటనాలు.

# కవులలో ఆలోచింపజేస్తున్న నానీలు

## 'నానీ నేత్రాలు' ఆవిష్కరణ సభలో డా॥ఎన్.గోపి



ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణంలో డా॥ కూరెళ్ల విఠలాచార్య 'నానీ నేత్రాలు' సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ ఎన్.గోపి

ఆధునిక తెలుగు కవిత్వంలో రెండు దశాబ్దాల కిందట వేళ్లూనుకున్న నానీల ప్రక్రియ నేడు విస్తృతమై వందలమంది కవులను ఆకర్షించిందని నానీల సృష్టికర్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత డా॥ఎన్.గోపి పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ఆదివారం జరిగిన మధుర కవి, అభినవ పోతన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య నానీల సంపుటి 'నానీ నేత్రాలు' ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నానీల ప్రక్రియ ప్రత్యేకతను సంతరించుకున్నదని చెప్పారు. డాక్టర్ విఠలాచార్యకు మహాకవి, దాశరథి పురస్కారం రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం జిల్లా రచయితల సంఘం విఠలాచార్యను సత్కరించింది.

# రామకోటేశ్వరరావుకు సన్మానం



ఘంటసాల గానసభ, ప్రసాద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సి. రామకోటేశ్వర రావు (బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్)ను గానసభ ప్రధాన హాల్లో సోమవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ప్రధాన గాయని అఖిలతో పాటు ఎం.దుర్గాప్రసాద్, అభిజ్ఞ- మనోజ్ఞ, పి. ఇందిరాదేవిలు పాటలను పాడారు. నిర్వాహకులు ప్రభాకర్-అఖిల, డా॥ కేవీరావు- డా॥ శారదలతో పాటు గానసభ అధ్యక్షుడుకళావీఎస్ జనార్థనమూర్తి, బండి శ్రీనివాస్‌లు అతిథులుగా పాల్గొని గాయని గాయకులను, పి. రామకోటేశ్వరరావును అభినందించారు.




గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

# చరిత్రను శిల్పాలుగా చెక్కుతారు కవులు

## "అమరావతి సాహితీమిత్రులు" సభలో ప్రముఖ కవి డా. రావి రంగారావు

చరిత్రను శిల్పాలుగా చెక్కుతారు కవులని ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు డా. రావి రంగారావు తెలిపారు. "అమరావతి సాహితీ మిత్రులు" నిర్వహణలో ఆదివారం ఉదయం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో కలవకొలను సూర్యనారాయణ రచించిన చారిత్రక పద్య కావ్యం "పృద్వీరాజీయం" గ్రంధాన్ని అయన ఆవిష్కరించి ప్రసంగించారు. వాల్మీకి రామాయణం రాయటం వల్ల రాముడు పురుషోత్తముడని ప్రపంచానికి తెలిసిందని, వ్యాసుడు భారతం వ్రాయటం వల్ల శ్రీకృష్ణుడు మహోత్తమ రాజకీయ నాయకుడు, దేవుడుగా గణుతి కెక్కాడని, ఇంకా అనేక ఉదాహరణలిచ్చారు. చరిత్రలో ప్రసిద్ధి కెక్కిన పౌరుష సాంస్కృతిక మూర్తి పృద్వీరాజు కథను ఉత్తమ కావ్యంగా రచించి తెలుగు జాతికి మనోహర సాహిత్య సంపద అందించారని కలవకొలను సూర్యనారాయణను అభినందించారు. "పురుషోత్తమ పుత్ర భార్గవ" పి.ఎస్.ఆర్. ఆంజనేయ ప్రసాద్ అధ్యక్షత వహించిన సభలో పంచాయత్ డివిజనల్ అధికారి గోరంట్ల వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని సాహిత్యేతర రంగంలో పని చేసినా అద్భుత సాహిత్య కృషి చేసినందుకు కవిని అభినందించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డా. రామడుగు వేంకటేశ్వరశర్మ ప్రసంగిస్తూ కావ్యం నిర్మాణం, ఎత్తుగడ, పాత్ర పోషణ గొప్పగా నిర్వహించారని వివరించారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు నారాయణం శేషుబాబు కావ్యాన్ని సమీక్షిస్తూ భారత దేశ గౌరవం, సంస్కృతి, సదాచారాలు నిలబడాలనే ఆశయంతో కవి ఈ కావ్యం రాశారని చెప్పారు. విదేశీయుల దాడుల్ని అడ్డుకొన్న గొప్ప సాహస మూర్తి పృద్వీరాజు అనమాన వ్యక్తిత్వాన్ని అద్భుతంగా చిత్రించారన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి డా. బీరం సుందరరావు మాట్లాడుతూ వీర శృంగారాల సమన్వయ మూర్తిగా పృద్వీరాజును మనోహరంగా వర్ణించారన్నారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో డా. మైలవరపు లలితకుమారి, అన్నాప్రగడ వెంకట నరసింహారావు, కనగాల జయకువార్, ఇ. చంద్రయ్య, గోలి హనుమచ్ఛాస్త్రి, చిటిప్రోలు వెంకట రత్నం, పి. కృష్ణమోహన్, కొంతం నాగేశ్వరరావు, సిరిగిరి సాంబశివరావు, వై. లక్ష్మి, గింజుపల్లి బాపయ్య, షేక్ బాబ్జీ, ఆర్చి, కొర్నేపాటి విద్యాసాగర్, కృష్ణ కిషోర్, మల్లిక్, మంగాదేవి, ప్రణతి మొదలైన కవులు పాల్గొన్నారు. ఎ.వి.కె. సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించిన సభలో కవి కలవకొలను సూర్యనారాయణను డా. సూర్యదేవర సూర్య రవికుమార్, ధనేకుల వెంకటేశ్వరరావు, ప్రముఖ పైగంబర కవి ఎం.కె. సుగంబాబు, కళా ప్రియులు వేదయ్య, తుర్లపాటి రాధాకృష్ణ మూర్తి, వారణాసి వెంకటరావు మొదలైన సాహితీవేత్తలు అభినందించి సత్కరించారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ - కిరణం
జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా
'గాంధీజీ సిద్ధాంతాలు-ఆశయాలు' ఇతివృత్తంగా వచనకవితల పోటీ



భారత జాతిపిత మహాత్మాగాంధీ150వ జయంతి యావత్ ప్రపంచం శ్రద్ధాభక్తులతో ఈ 2019వ సంవత్సరంలో జరుపుకుంటున్న సందర్భంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ - సాహితీకిరణం సౌజన్యంతో 'గాంధీజీ సిద్ధాంతాలు-ఆశయాలు' అనే ఇతివృత్తంమీద వచన కవితలపోటీ నిర్వహిస్తున్నది. ఆసక్తిగల ఔత్సాహిక రచయితలనుండి ఈ అంశంమీద కవితలను ఆహ్వానిస్తున్నది. ఈ పోటీలో గెలుపొందిన విజేతల కవితలను సాహితీకిరణం మాసపత్రికలో ప్రచురించడంతోపాటు, మొదటి ముగ్గురు విజేతలకు వరుసగా రూ॥3000/-, 2000/-, 1000/- చొప్పున కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఈ సంవత్సరం అక్టోబర్‌లో నిర్వహించే మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలలో అందజేయుటం జరుగుతుంది. ఎంపిక చేయబడిన కవితలను కిన్నెర పబ్లికేషన్స్ జాతిపిత మహాత్మాగాంధీపేరిట కవితాసంకలనం అచ్చువేసి, విడుదల చేస్తుంది. ఆసక్తిగల రచయితలు తమ రచనలను సెప్టెంబర్ 10వ తేదీలోగా ఈ క్రింది వివరాల ప్రకారం పంపవలసినదిగా కోరుతున్నాము. 1) రచనలు ఎ4సైజు పేపరులో 20 లైన్లకు తగ్గకుండా, 30లైన్లకు మించకుండా ఉండాలి. 2) వారు తమ రచనలను డి.టి.పి. చేసికానీ, స్పష్టమైన దస్తూరితో వ్రాసిగానీ పంపవచ్చు. 3) బహుమతుల విషయంలో, ప్రచురణ విషయంలో న్యాయనిర్ణేతలదే అంతిమ నిర్ణయం. 4) కవిత ఉన్న పుటలపై రచయిత పేరుగానీ, ఇతర వివరాలుగానీ ఉండకూడదు. హామీపత్రంపై మాత్రమే సెల్ నెంబర్‌తో సహా పూర్తి చిరునామాను వ్రాయాలి. 5) రచనలు పంపవలసిన ఆఖరుతేది. 10.09.2019. 6) రచనలు పంపవలసిన చిరునామా: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ - సాహితీకిరణం వచన కవితలపోటీ, సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం. 3, హైదరాబాద్-500102. ఫోన్‌నెం.040-29550181. Email:sahithikiranam@gmail.com

పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు
సాహితీకిరణం

మద్దాళి రఘురామ్
కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి
సెల్:9866057777

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 25-7-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

సత్యం గురువు
శాంతి విశ్వపునాది
జగతి కళ్లు

మాట మధురం
నమ్మకం నవనీతం
ప్రేమబంధం

దానధర్మాలు
పుణ్య సోపానాలు
దారి మారింది

ప్రజల డబ్బు
కంకర్లో కరిగింది
కీర్తి కోసం

మాంసపు ముద్ద
ఆత్మలేని శరీరాలు
ఉన్నా లేనట్లే.



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

ముఖ్యమంత్రి కేసీఆర్
పుట్టినూరు చింతమడక!
సిద్ధిపేట జిల్లాలో
మెరుస్తున్న ముక్కుపుడక!

అతని ఇల్లు అతని ఊరు
దేహ రక్త నరాలు!
ప్రతి ఇంటికి కురిపించెను
పది లక్షల వరాలు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



'నీటి దీపం' కవిత్వ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తండా హరీష్‌గౌడ్ 'నీటిదీపం' పుస్తకావిష్కరణ

## ఉవ్వెత్తున యువత కవిత్వం

-కె. శివారెడ్డి

ఉవ్వెత్తున కవిత్వమై వస్తున్న యువత కవిత్వమంటే జీవితమని కవి, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం అధ్యక్షులు కె. శివారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి యాకూబ్ అధ్యక్షతన యువకవి తండ హరీష్‌గౌడ్ రచించిన 'నీటిదీపం' కవిత్వ పుస్తకాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బతుకునే కవిత్వంగా మలచడంలో హరీశ్ కవిత్వంలో ప్రత్యేకత అని కొనియాడారు. సందర్భానుసారంగా స్పందించి రాయగలిగేది కవిత్వమని చెప్పారు. నీటిదీపం అని తన కవిత్వానికి పేరు పెట్టడం అంటే యువతరం యొక్క ఆలోచనకు ఒక ప్రతిభింబమని తెలిపారు. ప్రముఖ కవి తెలంగాణ బీసీ కమీషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ నీటిదీపంలో నేటిదీపం లాంటి కవిత్వం ఉందన్నారు. యువతరం అందిపుచ్చుకున్న శైలి చాలా గొప్పదని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ అసిస్టెంటు ప్రొ॥ఎస్.రఘు మాట్లాడుతు హరీష్ కవిత్వం సామాన్యుడి కేంద్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోదుగుపూలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, తిరునగరి, శరత్ చంద్ర, వెన్నెల సత్యం, అనంతోజు మోహన్‌కృష్ణ, బండారీ రాజ్‌కుమార్, తగుళ్ల గోపాల్, నర్రా ప్రవీణ్ రెడ్డి, పెద్దోజు నరేష్, తంగిరాల చక్రవర్తి, వడిచర్ల సత్యం, మాయకుంట్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దాశరథి కవిత్వం అమృతధార



-డా.గంద్ర లక్ష్మణరావు
సెల్: 9849328036

దాశరథి అనగానే అగ్నిధార, రుద్రవీణలే గుర్తుకొస్తాయి. దాశరథి సహజంగా కవి. సందర్భాన్ని బట్టి ఆయన కవిత్వం అగ్నినీ, అమృతాన్నీ కురిపిస్తుంది. పదునైన కత్తిలాగా , సవ్యసాచిలాగా కవితాస్త్రాన్ని ఉపయోగించే మహాప్రతిభ ఆయనకుంది. నైజాము రాజును ఎదిరించి నిందించి జైలుపాలయి పడిన కష్టాలకు, చూసిన దురాగతాలకు స్పందించి అగ్నిధార కురిపించాడు. అప్పటికే ఆయనకు కవిత్వం పట్ల మంచి ప్రజ్ఞ ఉంది. అందుకే ఎత్తుకున్న ఏ పద్యమైనా ఒక శిల్పంలా ఒదిగింది. ఆనాటి పరిస్థితుల ప్రభావం అట్లా ఉండి ఉండకపోతే దాశరథి ఎటువంటి కవిత్వం వెలువరించేవాడో తనమాటల్లోనే తెలుస్తుంది. ఆయన మానసికంగా మృదువైన వాడు. సుతిమెత్తని తత్త్వం వాడు. పూలను, కోకిలలను ప్రేమించేవాడు. అందమైన ప్రకృతిని వర్ణించేవాడు. దాశరథియే స్వయంగా తన పురాస్మృతులను తలచుకుంటూ 1963లో ఆంధ్రభారతిలో తెలిపిన అభిప్రాయం చూస్తే ఆయన హృదయం తెలుస్తుంది.

" నైజాం సిపాయిలను ఎదిరిస్తూ అడవిలో తిరుగుతున్నప్పుడున్నూ, జైల్లోనూ మావూళ్లో నదికి మంచినీళ్ళు తీసుకుపోవడానికి వచ్చే పచ్చని అమ్మాయి తలపులో మెదలుతుండేది. నేను జైల్లో ప్రవేశించినప్పుడు నావయస్సు సుమారు ఇరవై. ఆకాశంలోకి తలెత్తి చూస్తే మేఘాలు అందమైన అమ్మాయిల ఆకారాలను ధరించి పొంగిన వక్షస్థలాలతో నన్ను కవ్వించడానికి వచ్చేవి". (దాశరథి, ఆంధ్రభారతి, 26 జనవరి 1983).

ఇరవైయేళ్ళ యవ్వన ప్రాయంలో శృంగారభావాలు కలగడం అసహజమేం కాదు. కాని దాశరథి ఉన్న స్థితిలో అంటే అడవిలోనూ, జైల్లోను తన మౌలికమైన కవితాభావాన్ని చూపాడు. లేకపోతే అంత ఆవేశంలో దుఃఖంలో ఆ తలపు రావడం ఆశ్చర్యం. అందుకు నిప్పులు కురిపించే కవులు తీయని శృంగారాన్ని కూడా అందంగా వర్ణించగల కవులనుదాహరించారు.దాశరథి సంస్కృతం, ఉర్దూ, ఫారసీక భాషలు బాగా చదువుకున్నాడు. ఆయా భాషల కవులను ఇష్టంగా చదువుకున్నాడు. మఖ్దూం, కైఫీఆజ్మీ, సర్దార్ జాఫ్రీ వంటి కవులనుదాహరించాడు. ఇక్బాల్: రాసిన కవితాపంక్తులనుటంకించాడు.

" ఏ పొలమున నిరుపేదకు దొరకదొ తిండి/ ఆ పొలమున గల పంటను కాల్చేయండి". ఇందులోని అభ్యుదయభావానికి మురిసిపోయిన దాశరథి కొంత చల్లబడ్డాక ' ఆ పొలానికి కాపలా కాసే అమ్మాయికి ఏ అపకారం జరుగకుండా కాల్చేయాలి' అని అంటున్నది నా హృదయం . అని చెప్పుకున్నాడు. ఇక్కడ దాశరథి హృదయం , ఆయన కవితాసౌందర్యభావన తొంగి చూస్తున్నాయి.

సూర్యుడు, చంద్రుడు, చుక్కలు, పూలు , రాలు, అన్నీ ఆయనకు అందంగా కనిపించాయి. అనిపించాయి. అగ్నిధారలో అంతర్నాదము అనే కవితలో సుప్రసిద్ధమైన పద్యం ఉంది.

నా గీతావళి ఎంతదూరము ప్రయాణంబౌనొ అందాక ఈ
భూగోళమ్మునకగ్గివెట్టెదను, నిప్పుల్ వోసి,.......... ఇంతవరకు ఈ పద్యంలో అచ్చమైన అభ్యుదయమే కనిపిస్తుంది.విధ్వంసం తరువాత వినిర్మాణం అనే నినాదం ధ్వనిస్తుంది. ... ఆ తరువాత దాశరథి రాసిన పంక్తిని గమనించాలి.

" హేమంత భామా గాంధర్వవివాహమాడెదను .... ద్యోమణ్యుష్ణగోళమ్ముపై ప్రాగాకాశ నవారుణాస్ర జలధారల్ చల్లి చల్లార్చెదన్" ఈ హేమంతభామ, గాంధర్వ వివాహము వంటి ప్రయోగాలు మరో అభ్యుదయ కవి చేయకపోవచ్చును. దాశరథి ఆత్మీయమైన భావన ఎంత ఆవేశంలోనూ ముందుకు దూసుకొని వస్తుంది.

కవీ అనే ఖండికలో " నరకానన్ బడి క్రుంగుచున్న నను గాంధర్వాప్సరః కామినీ తరుణస్వాదు నవోపగూహన పథాంతర్వర్తిగా జేసి" అని తనను ఉద్ధరించడానికి ఒక గంధర్వ కాంతను ఊహిస్తున్నాడు కాని అభ్యుదయం సిద్ధాంతం చెప్పలేదు.

ఇక్కడ దాశరథిని అభ్యుదయ కవికాదనీ, ప్రజాకవి కాదనీ, ప్రజలకోసం పాటలుపాడితిన్ తెలుగు బాబులు నిద్దుర మేలుకోగ అని చెప్పలేదనీ అభిప్రాయం కాదు. దాశరథి కవిత్వం రాసేనాటికి దేశంలో స్వాతంత్ర్యోద్యమం బాగా విస్తరించింది. ఆ ప్రభావం ఉంది. అందుకే జెండా ఒక్కటి మూడువన్నెలది...అనే పద్యం రాసినాడు. రానున్నది ఏదినిజం, అది ఒకటే సోషలిజం, కలపండోయ్ భుజం భుజం, కదలండోయ్ గజం గజం.... అని సూటిగానే సోషలిజాన్ని చెప్పాడు. నిజామురాజును , తెలంగాణ రైతును గురించి చెప్పిన విషయాలు జగద్విదితాలు. ఇవన్నీ కాగా ఆయన స్వాంతంలో ఉన్న మాధుర్యం ఎట్లా కవిత్వంలో తొంగిచూసేదో కూడా మనం గమనించాలి. ఈ అంశంలో కవితా వస్తువుకన్న భావన, శిల్పం ప్రధానం.వస్తువు ఏదయినా తనభావన, తన శిల్పనైపుణ్యాన్ని తరగనీయలేదు.

మహాలేఖిని అనే ఖండికలో " నాదొక వెఱ్ఱి త్రాగుడున నాడును వీడును అమ్ముకొన్న ఉన్మాదిని వలెన్ కవిత్వమున నా సకలమ్మును కోలుపోయి రచియించితి తీయని కావ్య రసప్రపంచముల్" అన్నీ కోల్పోయినా తీయని కావ్యరసప్రపంచముల్ రాసినాననే తృప్తిని పొందిన తీరు గమనార్హం.

రైతును గురించిన రాసిన పద్యంలో
" ఎన్ని పుణ్యాలు చేసి జన్మించినావొ
ఈ ధరాభామినీ మధురాధరాన
అమృతమొలికించు నీ హలములతోన
హాలికా వేనవేలు దండాలు నీకు " ఇందులో భూమిని తల్లిగా కాక ఆమె మధురాధరాలలో అమృతమొలికించినాడు రైతు అని ప్రేమగా ముద్దుగా పలుకడం దాశరథికిమాత్రమే చెల్లింది.

జైల్లో అనే ఖండికలో ఎండలను వర్ణిస్తూ
శీతవాత క్రకచముల కోతవడిన
నానరాల కగ్గిని వెట్ట బూనినాడు
పాడుటెండకాలపు దుండగీడు, నన్ను
పాడుకోనీడు పూవుల జాడలందు..........అని తాను సహజంగా పూవులజాడలలో పాడుకుంటా నన్నాడు. యువకవులుగా దాశరథి, సినారె, బిరుదురాజు, వానమామలై మరికొందరు పూలపాటలు పేరుతో కొన్ని గేయాలను రాసి ప్రచురించారు. అది ఇప్పుడు తెలంగాణ సాహిత్య అకాడమీ పునర్ముద్రించింది. వీటిలో దాశరథి కవితాహృదయపరిమళాలు గుబాళించాయి.

ఋతుషట్కము అని ఆరుఋతువులకు ఆరు పద్యాలు రాశాడు. ఆరు పద్యాలలోను కాలాన్ని వర్ణించడంతో పాటు ఏదో విధంగా ఒక శృంగారభావన జోడించిన తీరు కనపడుతుంది.

చలినిగురించి రాసిన పద్యంలో " ప్రియాధర మారగించి ఆకలి దిగబెట్టి వత్తును " అంటాడు, శిశిరాన్ని వర్ణిస్తూ ' ఆకులు రాలిపోయె దెసలన్నిట చీరలు జారిపోయె, నగ్నీకృతయై మహాప్రకృతి నేలకు మోమువాల్చె ' అని ఒక దయనీయ దృశ్యాన్ని చూపించి వెంటనే " బాలా కటిపోకముళ్ళు విడలాగెద శైశిర కాలధర్మగాన్ " అంటాడు.

చంద్రుడు అనే శీర్షికతో ఒకే పద్యం రాశాడు. అందులో వచ్చినవాడు చంద్రముడు ... అని మొదలుపెట్టి 'లేజవరాలి బుగ్గలన్ గిచ్చి ' అంటాడు. జైల్లోని దుఃస్థితిని చూసి " వెన్నెలలు లేవు పున్నమ కన్నెలేదు/ పైడివన్నెల నెలవంక జాడలేదు, చుక్కలేలేవు ఆకాశ శోకవీధి / ధూమధామమ్ము దుఃఖ సంగ్రామభూమి" అని లేనివాటిని గురించి తలంచిన తీరులోని కవి ఆంతర్యం గమనించాలి. సంగ్రామ భూమిలోని భీభత్సాన్ని వర్ణించడానికి బదులు లేని అందాలను తలచుకున్నాడు. అవి కోల్పోవడం కూడా ఒక బాధాకరమే అయినా యుద్ధమంతభయంకరం కాదు. వసంతకుమారి, ఉష, వాసంతిక, త్రపామయీ వంటి అనేక కవితలలో దాశరథి ప్రణయం, శృంగారం, మధురభావనలు కన్పిస్తాయి. శిల్పి నిగురించి రాసిన వాటిలో కూడా అతనిని సంబోధిస్తూ, " నినుగని కొండలన్ని రమణీ కుచపాలికలై, భ్రుకుటులై, కుటిలాలకమ్ములై, కపోలమోహన ఫలకమ్ములై " అని రాళ్ళు రమణులుగా మారిన తీరును వర్ణించారు. శిల్పాలలో రమణీయ రమణులను చెక్కినమాట నిజమే అయినా మరెన్నో భావాలు పలికించవచ్చు. సినారె అవేరాళ్ళను చూసి ' మునుల వోలె కారడవుల మూలలందు పడియున్నవి' అన్నాడు. దాశరథి మనోదృక్పథాన్ననుసరించి ఆయన కవితాదృశ్యాలుంటాయి.

ఉదయాద్రి భుజమెక్కి ఒకడు నవ్వెను చూడు / భూదివమ్ములు వెల్గుపూలుపూయ
ఉవిద తామర మొగ్గ నెవడొ ముద్దిడె చూడు / మనసులో వలపు చందనము రాయ .....అని ఉదయాన్ని వర్ణించడంలో కూడా ఒక మధురభావనకు తెరతీశాడు.

అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం తరువాత ఆయన అమృతాభిషేకం , తరువాత కాలంలో కవితాపుష్పకం వంటివి రాశాడు. వాటిల్లో ఆయన స్వీయకవితాభావమాధుర్యం స్పష్టంగా కనపడుతుంది. మొట్టమొదటి గజల్ దాశరథి రాశాడు. " వలపునై నీ హృదయ సీమల నిలువ వలెనని ఉన్నది / పిలుపునై నీ అధరవీధుల పలుకవలెనని ఉన్నది"

అని ఎత్తుకొని అన్ని చరణాలలో ప్రేయసిపట్ల గల భావనలను కూర్చి, చివరికి ' కాలికూలిన మదనునికి ప్రాణాలు పోసే కోమలీ / నీదు చూపుల జమునితో తొడగొట్టవలెనని ఉన్నది" అంటాడు. మృత్యువునైనా ఎదుర్కోవడానికి ప్రేయసి కనుచూపు చాలునన్నాడు.

గాలిబ్ గీతాల అనువాదం చేయడంలో కూడా ఆయన కవితాప్రియత్వం అర్థమవుతుంది. గాలిబ్ గీతాల్లో సూఫీ తత్త్వం ఇమిడి ఉన్నప్పటికీ సాధారణ పాఠకులకు అది శృంగారభావనవలెనే ఉంటుంది. జఫర్ మధుతరంగాలు పేరుతో కొన్ని గేయాలు రాశాడు. అటు సంస్కృత కవుల, ఇటు ఉర్దూ కవుల ప్రభావం అత్యంతంగా గల దాశరథి కాలాన్ని బట్టి, తనకెదురైన సందర్భాన్ని బట్టి అగ్నిని కురిపించి కవిత్వాన్ని సామాజిక ప్రయోజనం కోసం ప్రయోగించినా దాశరథి కవిత్వంలో అమృతధార అపారంగా ఉందనడానికి నేను కొన్ని ఉదాహరణలు మాత్రమే చూపాను. ఈ కోణంలో చూస్తే దాశరథి కవిత్వంలోని మాధుర్యం మరింత ఆస్వాదించే అవకాశముంటుంది.

దాశరథి కవిత్వంలో ప్రళయం ఎంతో ప్రణయం అంత ఉంటుంది అనేది తనకాలంనాడే తన మిత్రుడు డి. రామలింగం అన్నాడని , అట్లా ఉండడంలో తప్పులేదని, ఆ రెండింటినీ రాసిన పూర్వకవులెందరో ఉన్నారని ఒక వివరణ వంటిది ఒక చోట రాశారు. ఒక అభ్యుదయ కవి, లేదా ఉద్యమ కవి కేవలం ప్రజా ఉద్యమానికే పరిమితం కాక తనదైన వైయక్తికమైన కవితాభిరుచిలో ఒకటిగా కనిపించే రసికతను అత్యద్భుతంగా ప్రకటించిన కవి దాశరథి.

పువ్వులు ముండ్లుగా మధురమోహన కౌముది నిప్పుమంటగా
నవ్వులు వాడియమ్ములుగ నాకగుపించును నీవులేనిచో
గవ్వలు మేలిరవ్వలుగ కాననముల్ నవ నందనాలుగా
గువ్వలు రాజహంసలుగ గోచరమౌగద నీవుగల్గుచో....... అనడంలో ఆయన కవితా తత్త్వం కూడా దాగి ఉందనవచ్చు. ఎక్కడ జీవన సౌందర్యం కొరవడుతుందో అక్కడ సంగ్రామం మొదలవుతుంది.

అందుకే ఆరాటమంతా కోల్పోయిన సౌందర్యాన్ని తిరిగిపొందాలని, వాటినే కలవరించడం ఎంతటి కలవరంలోనైనా కలహంలోనైనా కలతల్లోనైనా, ఏ కాలంలోనైనా అవే స్మరించడం. దాశరథి కవిత్వంలో ఆ స్మరణ అడుగడుగునా కనిపిస్తుంది. ఆయన జాతీయతావాదాన్ని, బుద్ధుని శాంతిమార్గాన్ని, గాంధీ సత్యాగ్రహాన్ని, నైజాము పోరాటాన్నీ దేన్ని వర్ణించినా ఒక మూలన ఈ సౌందర్యదృక్పథం తొంగిచూస్తుంది.

"నాకలంపు విన్నాణముతో రచింతు లలనా నును చెక్కులపైన కావ్యముల్ " అని రాసిన ఆయన కవితా విన్నాణాలను వన్నెలను మనం చూడవచ్చు. దాశరథి కవిత్వం అగ్నిధారగానే కాదు అమృత ధారగా కూడా మనల మురిపిస్తుంది.







### ఓ దాశరథీ..! ఓ సినారె..! జోహార్లు!!

ఓ దాశరథీ.. కృష్ణమాచార్య!
నిజాము నవాబుపై నిప్పులు కురిపించావు
తెలంగాణ విముక్తికై
నిరంతరం పోరాడినావు
బెయిల్ లేని జైలు జీవితంలో
సాహిత్యంతో సహవాసం చేశావు!
పద్యాలతోనే నిజాము హృదయాన్ని
బద్దలు గొట్టావు
"ఓ నిజాము పిశాచమా! కానరాడు
నిన్ను బోలిన రాజు మా కెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రత్నాల వీణ!" అంటూ
ఘన సమరం జరిపిన బ్రతుకే అమరమని
నిరూపించుకున్నావు!
మహాకవి దాశరథీ!

కవితనే చిరునామాగా
మార్చుకున్న ఓ సినారె!
ఆలోచనల గొడ్డళ్ళు శిరసులోని
నరాలను నరుకుతూంటే
నిటారుగా చిమ్మిన రక్తానివి నువ్వు!
నరికితే తెగేవి నరాలే.. రక్తం కాదు
నిలబడ్డ రక్తం నిలువెత్తు కొడవలి
పారే రక్తం హెూరెత్తే పిడికిలి అని ఘర్జించావు
అక్షరాన్ని నిధిగా అంబరాన్ని అవధిగా
సమాజాన్ని పరిధిగా చేసుకున్న ఓ సినారె!
నీ కాళ్ళేమో నేలపైన శిరసు ఉనికి శిఖరం
జ్ఞానపీఠాన్నే అధిరోహించి విశ్వంభరుడైనావు!

ఓ దాశరథీ..! ఓ సినారె...!
నీకు నా జోహార్లు!!



-జి.ఆర్ కుర్మే
సెల్: 9441040881

### ముంపు

ముంపు ఊరని ముద్రవేసి
నిర్వాసితులని పేరుబెట్టి
బయటకు నెట్టివేద్దామనా...!
ఈ నేల నాది
ఈ గాలి నాది
ఈ నీరు నాది
ఇక్కడి
కొండా కోనల చల్లగాలి
బక్కప్రాణుల వూపిరికి
భరోసా ఇస్తుంది
మట్టిని తాకినప్పుడల్లా
పేగుబంధపు ప్రేమ
పెనవేసుకుంటుంది
చెట్టూ చేమా గొడ్డూ గోదా
వుమ్మడి కుటుంబంలా
వూరడిస్తాయి

కాళ్ళ కిందకి నీళ్లొచ్చి
ముంచేది వూరినే కాదు
బతుకుల్ని కూడా...
కళ్ళ ముందే ఇళ్లు మునుగుతుంటే
మిగిలేది కన్నీళ్లే
చెట్టుకొకరు... పుట్టకొకరు
ప్రేమలూ అనుబంధాలూ
పేకమేడలే

మునక వూళ్లంటే ఎంత లోకువ...!?
కొడుకులకూ కూతుళ్ళకీ
పెళ్ళిళ్ళు కావు
అన్నీ కోల్పోయిన బతుకుకి
విదిలించే చిల్లర ప్యాకేజీ
పప్పూ బెల్లంతో సమానమే

ఈ మునక
మాకోసం కానప్పుడు
కాళ్ళు అరిగేలా తిప్పటం
ఎందుకు..
తూతూ మంత్రపు
పరిహారం ఎందుకు

ఇది పునరావాసం కానే కాదు
పూరా అరణ్యవాసం



- సోమేపల్లి వెంకట సుబ్బయ్య
+91 9000004565

### దాశరథీ! మహారథీ

అన్నా! ఓ దాశరథీ!
అభివందనమో శరధీ!
తెలంగాణ విముక్తికై
అక్షరాల అస్త్రాలను
సంధించిన మహారథీ!
సౌజన్య ప్రయోనిధీ! ॥అ॥

నిరంకుశుల నిలదీసిన
'వట్టికోట ఆళ్వారు'
నైజాము రజాకార్ల
పాలిటి ఓ తల్వారు!
అతడు అండదండకాగ
అగ్గివోలె మండావు!
పదునగు పద్యాలతోనె
రాజుబూజు దులిపావు! ॥అ॥

"తెలంగాణ" కోట్లాది
జనతంత్రుల రత్నవీణ
అంటు కంఠమెత్తావు!
జైలు పాలు అయ్యావు!
అగ్నిధార" కురిపిస్తూ
"రుద్రవీణ" మోగిస్తూ
ఆఖరుకు ఆశించిన
తెలంగాణ తెచ్చావు!
ఆ తదుపరి మనవారికి
అధిక స్ఫూర్తి నిచ్చావు!!



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి పేరిట సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు నెలకొల్పిన "విశ్వంభర" పురస్కారానికి ప్రముఖ కన్నడ కవి, జ్ఞానపీఠ విజేత, కేంద్రసాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర కంబార ఎంపికయ్యారు. ఈ నెల 29 న హైదరాబాద్‌లోని జేఆర్‌సి కన్వెన్షన్ సెంటర్ లో జరిగే సినారె 88వ జయంతి ఉత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆ అవార్డును ప్రదానం చేస్తారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ ప్రత్యేక వ్యాసం..

–సంపాదకులు

# నాగార్జున సాగరం ప్రణయామృతం

–ముదిగొండ.సంతోష్ శర్మ
8885522806



నారాయణరెడ్డి గారి కావ్యము తెలుగులో ఉత్తమ చారిత్రక కావ్యములో ఒకటి అని నిస్సందేహముగా చెప్పవచ్చు. పాశ్చాత్య దేశములందు షెక్సుపియరు మొదలగు రచయితల మహాకావ్యాలను జ్ఞప్తికి తెస్తున్నది– డా. శ్రీనివాసాచార్యులు

"నా పేరు కవి
ఇంటిపేరు చైతన్యం
ఊరు సహజీవనం
తీరు సమభావం
నా వచనం బహువచనం
నావాదం సామ్యవాదం
కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం"

అనడంలో నారాయణరెడ్డి కవిత్వం ఏమిటో స్పష్టమవుతుంది. సంప్రదాయాన్ని జీర్ణించుకున్న ప్రయోగం సినారె. ప్రయోగంలో జీవించిన సంప్రదాయం ఆయన. మనిషిలోని మమతను , బాధను, కన్నీటిని, నిప్పును,

ప్రణయాన్ని , ప్రళయాన్ని, విప్లవాన్ని, అభ్యుదయాన్ని కవితలో కీర్తించిన మానవతాకవుతా మూర్తి సి నారె.

ఊపిరాడడం లేదు
ఉక్కపోస్తుంది ఏసి గదిలో
కారణం తెలిసిపోయింది
కవిత రాయలేదు ఇవాళ.

అని కవిత్వం రాయనిదే ఉండలేనని చెప్పుకున్న సింగిరెడ్డి నారాయణ రెడ్డి సినారె గా అందరికీ పరిచితులు. ప్రాచీనాధునిక సంస్కారాలు రెండింటిని గూడా ఔచిత్యమెరిగి సమన్వయం చేసి, భావనలను భాషను

1955 కాలం అభ్యుదయకవిత్వం, వచనకవిత్వం, పద్యకవిత్వ ప్రాభవం ఉన్న రోజులు వాటన్నిటి మార్గాన్ని కాదని తనదైన ఒక కొత్తమార్గాన్ని ఏర్పరచుకిని గేయరూప కావ్యాన్ని రాయడానకి పూనుకున్నాడు. ఒక చారిత్రక విషయాన్ని కథా వస్తువుగా తీసుకొని గేయకావ్యంగా రాసారు. అప్పటి వరకు తెలుగులో చారిత్రక పద్యకావ్యాలు మాత్రమే ఉన్నట్టు తెలుస్తుంది. కానీ చారిత్రక గేయకథా కావ్యము ఎక్కడ రాయబడలేదు. సినారె ఒక విలక్షణ ప్రక్రియ ఎన్నుకొని సాహిత్యలోకంలో తనదైన ఒక విశిష్ట ముద్రవేసుకున్నారు సినారె.

నాగార్జున సాగరం మొదటి గేయకావ్యం.

కావ్యవిశేషాలు– ఇక్ష్వాకుల వంశ పరిపాలనా కాలం నుండి కావ్యం మొదలవుతుంది.

"నేను జీవించి యు
న్నానంచు భావించి
పలికింతు గేయ కా
వ్యమును హృదయమును పెంచి"

తనను తానుగా ఆ కాలం లో జీవించినట్టుగా తాను స్వయంగా ఆ కథకు సాక్షిగా ఉన్నాను అని భావించి కావ్యము రాస్తున్నాను అన్నారు. తాను ఆ కాలాకి పరకాయ ప్రవేశం పొంది రాస్తున్నాను అని అనడంలో విశాలమైనది, ప్రపంచమంతా పరుచుకున్నది అని ఒక కళఅకారుణికి ఉండవల్సిన విశాలదృక్పథాన్ని చెప్తారు.

"అతనికి ప్రాంతపు ప్రాంతపు టెల్లలు
అక్షిగోచరములు కావు
అతనికి మతవైషమ్యము
లణుమాత్రముతెలియరావు"
అతడు మానవుని రూపము
నందికొన్న గాంధర్వము"

అని ఒక కళాకారుణి హృదయాన్ని ఆవిష్కరిసారు. మున్ముందు పద్మదేవుడు గానం కూడా చేయబోతున్నాడు అనే ధ్వని విపిస్తాడు.

నాయికానాయకులను కలిపే సందర్భంలో పద్మదేవుడు యశోధరగౌతముల ప్రణయఘట్టం చిత్రిస్తూ అందులో లీనమైన సమయంలో

కదిలి వచ్చిన మల్లి
కావల్లి యనంగ
అవయవాలను దాల్చి
నట్టి అమృతమనంగ"
"అల్లనల్లనసాగె
కంకణములు లేవు
కాళ్లకందెలు లేవు
పల్కరించగ నాల్క
పై మాటలే రావు"

ఇక్కడ ఆమెకు ఎలాంటి అలంకరణ వస్తువులు లేకున్నా ఆమే సౌదర్యము మిన్న అని చెప్పడం.

ఆమె అమాయకత్వానికి గాలి దేవునికి జాలి కలిగి "గాలిదేవర లతా–గ్రముల నల్లన ద్రోసె. సన్నని గాలితో ఆమను తోసాడు. దానితో

"ఆమె చేలాంచల
మ్మలలపోలిక లేచె
పద్మదేవుని హృదిని
పరిమళమ్ములు వేచె"

ఆమె కప్పుకున్న పైట అలల మాదిరిగా లేచింది. ఆ లేవడవే పద్మదేవుని మదిలో పరిమళాలు నిండిపోయాయి.

"తలను వెన్కకు ద్రిప్పి
తిలకించె నతడు చం
చలవంటి దొరవె
న్నెలవంటి రూపమ్ము.

నేర్చుకోడానికి విద్యార్థిగా నాగార్జునవిశ్వవిద్యాలయానికి వచ్చానని మరే ఇతర విషయాలపట్ల తనకు ఆసక్తి లేదని చెబుతుంది.

"మతపాకములు దప్ప
ఇతరాంశములు మీకు
ఆస్వాదనీయమ్ము
లైనట్లు కన్పడవు."
రాతి బొమ్మలు మిమ్ము
రంజింపజేయు నెటు" మీకు మత

పాఠములు దప్ప ఇంకేదానిపై ఆసక్తి అభిరుచి లేనప్పుడు ఈ రాతి బొమ్మలు మీమ్ములను ఎలా రంజింపజేయును ఆనందింపజేయును. అని పద్మదేవుడు అనగా

నేను ఏ మాహాత్ముని బోధనలు నేర్చుకొని జన్మతరింపజేసుకోడానికి వచ్చానో ఆ మహాపురుషుని చిత్రములే కదా మీరు వేస్తున్నవి అందుకే అవి మాకు ఆస్వాదములు ఆ కళ మాకు ఆరాధనీయం.

"ఆమె మత సంరక్తి
కతడు విస్మితుడయ్యె"

కానపడుతుంది.

దిగ్గునలేచి అహో శాం
తిశ్రీ మీరలా యంచు.

పద్మదేవుడు చిత్రించిన ఆమె చిత్రమును చూసి

"నన్ను బోలు క్షుద్ర జీవ
న భాజనులను చిత్రించి
శిల్పకళకు మచ్చ కల్గ
జేసినారు మీరలయో" అంటూ

శాంతిశ్రీ కళ కూడా మతప్రచారానికే ఉపయోగపడాలి కానీ సామాన్య జన ప్రయోజనం కోసం కాదు అంటుంది. ఆమె దృష్టిలో మతమే సర్వస్వము.

"మతబోధలకే కళ లం
కితము సేయు టెందులకో?
సౌందర్యమునకు మతమున
స్థానము లేదెందులకో?"

మతములో సౌదర్యానికి ఆనందానికి స్థానం లేకపోవడం పద్మదేవుడికి

సంయమనముతో నడపగల మేటి ప్రతిభామూర్తులలో అగ్రస్థానం నారాయణరెడ్డిది.

నాగార్జున సాగరం గేయకావ్యం. ఇది ఖండ,మిశ్ర,చతురస్ర గతిలో రచించబడింది. ఎక్కువపాలు ఖండ గతిలో నడిచింది. ఒక్కొక్కవాక్యంలో ఐదైదు మాత్రాలగణములు ఎనిమిది కలిగి ఖండగతిగల ఆదితాళంలో కూర్చబడినది అని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అన్నారు.

సినారె ఎంతగా కావ్యంతో మమేకమయ్యారో తెలుస్తుంది.

నాగార్జున కొండపై బుద్ధధాతువు కలిగిన "స్వర్ణ కరండము'' పైన మహాచటత్యమందిరము నిర్మాణము సాగుతుంది. ఆ నిర్మాణానికి శిల్పాలను తయారు చేయడానకి వచ్చిన యువకుడు పద్మదేవుడు అతనే కావ్యనాయకుడు.

"అతడు సామన్య మనుజు
డైన నమరకళ నజుండు
ఆంధ్రుడతడు అంతియు కా
డనంత విశ్వాత్మజుండు"

అతడు మనిసిగా ఆధ్రుడే కానీ అతని ఆత్మ

మెల్లమెల్లనసాగె
అతనికి సరిగ నొక్క
అడుగు దూరమ్మాగె"

ఒక నాజూకైన మల్లితీగలాగ , అమృతమే శరీరమై కదలి వచ్చినట్టుగా, పరిమళాలు వెదజల్లుతూ, హంస నడకలను మించి ఒయ్యారంగా నడిచి వచ్చి పద్మదేవునికి ఒక్క అడుగు దూరంలో నిల్చుంది. ఆమె అతన్ని మాట్లాడించ లేదు. ఆమె వచ్చిన సంగతి అతనికితెలియదు. పోని ఏదైన సవ్వడి అలికిడి కలిగి గుర్తించగలడేమో అనుకుంటే

"అతని దృష్టిమరల్చ
నామె చేతికి రత్న

ఒకరిని ఒకరు చూసుకున్నారు.

"క్షణమాత్రమట్టి స్వ
ర్గస్థాయిలో దేలి
వారిర్వురు యథా ప్ర
పంచమున దిగివచ్చి"

ఒక క్షణం తమను తాము మరిచిపోయి విచ్చేరపోయి చూసుకున్నారు స్వర్గంలో ఉన్నట్టుగా తోచింది. వెంటనే తేరుకొని వాస్తవలోకంలోకి వచ్చారు.

పద్మదేవుడు ఆవే మీరు ఎవరు అని అడిగినప్పుడు "విద్యార్థిగా నేను బౌద్ధ పాఠమ్ముల భ్యాసమ్ము చేతు" అని తాను బౌద్ధపాఠాలు

ఆమె మూఢ భక్తికి, మతముపై ఉన్న అనురక్తికి పద్మదేవుడు విస్మయానికి లోనయ్యాడు. ఒక యుక్తవయస్సులో ఉండాల్సిన భావం ఆమెలో లేకపోవడం.

శాంతి శ్రీ నిద్రలేచి కృష్ణలో స్నానం చేసి పద్మదేవుని కళామందిరానికి వెళ్ళి అతని ముందు నిలబడుతుంది.

"అతడు కనులు మూసినాడు
ఆమె అతని కభిముఖియో
అతడు కనులు విప్పినాడు
ఆమె అతని కభిముఖియో" అది అతనికి కలగా తోచింది .కనులు మూసినా తెరిచిన ఆమె నే

విచారంగా ఉంటుంది. మతములో కేవలం ఆచార సంద్రాయాలేనా అందులో ప్రేమ లేదా?

కళ గురించి చెబుతు

"ప్రకృతిలోన్ప్రత్యణువున
పరమాద్భుత శోభాన్విత
సౌదర్యము నిర్లిప్త
స్థాయిలోన నిద్రించును"

ప్రకృతి అణువణువు సౌందర్యము దాగి ఉంది. చూడగలలిగే

మిగతా 5వ పేజీలో...

# బహుముఖ ప్రజ్ఞాశాలి కంబార

– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839





ఈ నెల 29న ఆచార్య సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ప్రదానం చేయనున్న "విశ్వంభర" జాతీయ స్థాయి పురస్కారాన్ని తొలిసారిగా స్వీకరిస్తోన్న ఆచార్య చంద్రశేఖర కంబార బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిగా, నాటకకర్తగా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, సంభాషణల రచయితగా, విద్యావేత్తగా, పరిశోధకుడిగా, నవలాకారుడిగా, కథకుడిగా వేర్వేరు అంశాల్లో అసమాన ప్రతిభను ప్రదర్శిస్తోన్న సాహితీవేత్త. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ఇప్పటివరకు 31 నాటకాలను, 11 కవితాసంకలనాలను, 5 నవలలను, ఒక కథాసంపుటిని, 16 పరిశోధనాగ్రంథాలను వెలువరించారు. భారతీయ జానపద సాహిత్యానికి, భారతీయ నాటకానికి అంతర్జాతీయ ప్రాభవం కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

కర్ణాటకలోని బెల్గాం జిల్లాలో ఉన్న ఘోడగెరి అనే గ్రామంలో చంద్రశేఖర కంబార 1937 జనవరి 2న జన్మించారు. పేదరికం వల్ల చిన్నతనంలోనే చదువు మానేసినా, జగద్గురు సిద్దరాం స్వామీజీ చేరదీయడంతో ఆయన ఆర్థిక సహాయంతో చదువు కొనసాగించగలిగారు. గోకక్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. అనంతరం బెలగావిలోని లింగరాజ్ కళాశాలలో చదువుకున్నారు. ధార్వాడ్‌లోని కర్ణాటక విశ్వవిద్యాలయం నుండి 'ఉత్తర కర్ణాటక జానపద రంగభూమి' అనే అంశంపై పిహెచ్.డి. చేశారు. చిన్నతనం నుండే జానపద కళలన్నా, గ్రామీణ సంస్కృతి, ఆచారవ్యవహారాల పట్ల మక్కువ పెంచుకున్నారు. కుమార వ్యాస, బసవ, కువెంపు, గోపాల కృష్ణ అడిగ మొదలైన కన్నడ సాహితీమూర్తుల రచనల పట్ల ఆసక్తి ప్రదర్శించారు.

చదువు పూర్తయిన అనంతరం కొద్ది కాలం చికాగో విశ్వవిద్యాలయంలో బోధనా వృత్తిని చేపట్టిన చంద్రశేఖర కంబార ఆ తర్వాత బెంగుళూరు విశ్వవిద్యాలయంలో రెండు దశాబ్దాలకు పైగా ఆచార్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. హంపీలో కన్నడ విశ్వవిద్యాలయానికి వ్యవస్థాపక ఉపకులపతిగా పనిచేశారు. ఆ బాధ్యతల్లో రెండు దఫాలు పనిచేసిన కంబార మిగతా విశ్వవిద్యాల యాలకు భిన్నంగా ఆ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దారు. ఆయన పదవీకాలంలో రూపొందించిన నిర్మాణాలన్నీ విజయనగర కాలంనాటి నిర్మాణ శైలిని పోలిఉండడం ఆయన అభిరుచికి నిదర్శనంగా నిలుస్తాయి. కర్ణాటక సంస్కృతిని ప్రతిబింబించే విధంగా విశ్వవిద్యాలయ నిర్మాణం చేపట్టడం విశేషం. ఆ విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలను, ప్రాజెక్టు పనులను తెలిపేందుకు ప్రత్యేకంగా ప్రచురణల విభాగాన్ని ఆయన నెలకొల్పారు. సాధారణంగా విశ్వవిద్యాలయాలు అందజేసే గౌరవ డాక్టరేట్లకు భిన్నంగా నడోజా గౌరవ పురస్కారాన్ని అందజేయడాన్ని ఆనవాయితీగా చేశారు.

తెలంగాణకు, ఉత్తర కర్ణాటకకు కొన్ని పోలికలున్నాయి. రెండూ వెనుకబడ్డ ప్రాంతాలే. భాష పరంగా ప్రత్యేక మాండలికంతో అలరారుతున్న ప్రాంతాలే. ఈ రెండు ప్రదేశాల్లోనూ జానపద సాహిత్య సొగసులెక్కువ. ఆచార్య సి.నారాయణరెడ్డి తెలంగాణకు చెందినవారు కాగా ఆచార్య చంద్రశేఖర కంబార ఉత్తర కర్ణాటకకు చెందినవారు. వీరిరువురూ జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలే. ఇరువురూ పద్మ పురస్కార స్వీకర్తలే. ఉత్తర కర్ణాటక ప్రాంత మాండలికాన్ని తన రచనల్లో ప్రతిఫలింపజేసిన దిట్ట కంబార. ఉత్తర కర్ణాటక గ్రామ సీమల్లో అడుగడుగునా కనబడే జానపద కళలను, సాహిత్యాన్ని పరివ్యాప్తం చేసేందుకు కంకణబద్ధులయ్యారు. బెర్లిన్, మాస్కో, జపాన్, చికాగో, న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గని కన్నడ జానపద కళలు, సాహిత్యంపై ప్రసంగించారు. ఉత్తర కన్నడ మాండలికాన్ని తన రచనల్లో అంతర్భాగంగా చేశారు. శివపుర అనే కల్పిత గ్రామం కంబార రచనల్లో కనబడుతుంది. శివపార్వతులు ఆ ప్రాంతాన్ని సందర్శించినట్టుగా, సీత కోసం అన్వేషణలో భాగంగా శ్రీరాముడు ఆ గ్రామానికి వెళ్ళినట్టు వివిధ రచనల్లో పేర్కొన్నారు. పౌరాణిక అంశాలకు సమకాలీన సంఘటనలను జోడించడం ఆయన రచనల్లో కనబడుతుంది.

చంద్రశేఖర కంబార రచించిన అనేక నాటకాలను కర్ణాటక రాష్ట్రంలో వేలాదిసార్లు ప్రదర్శించారు. 'సంగ్యబాల్య', 'జోకుమారస్వామి' నాటకాలు విశేషప్రాచుర్యం పొందాయి. వాటిలో 'జోకుమారస్వామి' నాట్యసంఘ్ వారి కమలాదేవి ఛటోపాధ్యాయ అవార్డు పొందింది. ఆయన రచయించిన 'శిఖర సూర్య' కన్నడనాట ప్రభవించిన ఉత్తమ నవలల్లో ఒకటిగా పేరుపొందింది. 'చకోరి' అనే పేరుతో రాసిన కావ్యం కన్నడ భాషలో ఉత్తమ కావ్యంగా ప్రఖ్యాతిగాంచింది. కన్నడ జానపద నిఘంటువును కూడా ఆయన కూర్చారు. భారతీయ ఆధునిక నాటకాల సంకలనాన్ని వెలువరించారు.

కన్నడ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేసిన కంబార 5 చలన చిత్రాలను, ఎన్నో డాక్యుమెంటరీలను రూపొందించారు. 'కరిమయి', 'కాడు కుదురె', 'ప్రణయ ప్రసంగ' మొదలైన చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. రెండు టీవీ సీరియళ్లకు కథను అందించారు. ఆరు చలనచిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. ఆయన రూపొందించిన 'కాడు కుదురె' 1987లో జాతీయ అవార్డు పొందింది. ఆయన దర్శకత్వం వహించిన 'సంగీత' అనే చలనచిత్రానికి మూడవ అత్యుత్తమ చలనచిత్రంగా 1981లో పురస్కారం లభించింది. ఉత్తమ కథారచయితగా, ఉత్తమ సంభాషణల రచయితగా, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ దర్శకుడిగా ఆయన సినీరంగంలో అవార్డులు పొందారు. కేంద్ర ప్రభుత్వం కోసం, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కోసం అనేక డాక్యుమెంటరీలను ఆయన రూపొందించారు.

కంబార కృషి కేవలం కన్నడకే పరిమితం కాలేదు. దేశవిదేశాల్లో విస్తరించింది. ఇంగ్లీషుతో సహా అనేక భాషల్లోకి ఆయన రచనలు తర్జుమా అయ్యాయి. ఆయన రాసిన 'జోకుమారస్వామి' నాటకాన్ని ఆంగ్లం, మరాఠీ, హిందీ, తెలుగు, తమిళం, పంజాబీ, మళయాళం భాషల్లోకి అనువదించారు. సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కంబార నాటకం 'సిరి సంపిగె'ను ఇంగ్లీషు, తమిళం, హిందీ, మరాఠీ, రాజస్థానీ భాషల్లోకి తర్జుమా చేశారు. 'చాళేషా', 'జైసిద్ధ నాయక', 'అలీబాబా', 'సాంబశివ ప్రహసన', 'మహామాయి' మొదలైన నాటకాలను వివిధ భాషల్లోకి అనువదించారు.

కంబార రాసిన 'సింగారెవ్వ మత్త అరమనే' నవలను మళయాళంలోకి 'కులోత్తె చింగరమ్మ' అనే పేరుతో సి.రాఘవన్ అనువదించారు. మళయాళంలో ఉత్తమ నవలల్లో ఒకటిగా ఆ నవలకు పేరు వచ్చింది. 'చకోరి' కావ్యం ఆంగ్లంలోకి తర్జుమా అయింది. ఆయన రాసిన కవితలను 'రాక్స్ ఆఫ్ హంపీ' అనే పేరుతో ఓ.ఎల్.నాగభూషణ స్వామి ఆంగ్లంలోకి అనువదించారు.

అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు కంబారను వరించాయి. దేశ అత్యుత్తమ పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీని 2001లో స్వీకరించారు. సాహిత్యంలో దేశంలోనే అత్యుత్తమమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని 2011లో పొందారు. కబీర్ సమ్మాన్ పురస్కారాన్ని 2002లో స్వీకరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 1991లో, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు 1983లో ఆయనకు లభించాయి. కాళిదాస్ సమ్మాన్, పంప ప్రశస్తి పురస్కారం, జాషువా సాహిత్య పురస్కారం, కుమరన్ ఆసన్ అవార్డు, రాజ్యోత్సవ అవార్డు మొదలైనవి ఆయన పొందారు. కర్ణాటక రాష్ట్రంలో లెక్కలేనన్ని అవార్డులను, సన్మానాలను కంబార పొందారు.

కర్ణాటక శాసనమండలి సభ్యుడిగా కూడా చంద్రశేఖర కంబార పనిచేసి, తనదైన ముద్ర వేశారు. కర్ణాటక నాటక అకాడమీ అధ్యక్షుడిగా, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సొసైటీ అధ్యక్షుడిగా, కర్ణాటక జానపద, యక్షగాన అకాడమీ సభ్యుడిగా, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా పనిచేశారు. గత ఏడాది ఫిబ్రవరి నుండి కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సమకాలీన సాహిత్యమూర్తుల్లో బహుముఖప్రజ్ఞాశాలిగా ప్రత్యేక స్థానాన్ని పొందిన చంద్రశేఖర కంబారకు "విశ్వంభర" పురస్కారాన్ని అందజేసేందుకు సుశీలానారాయణరెడ్డి ట్రస్టు నిర్ణయించడం హర్షణీయం. తెలంగాణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాలు భాషాపరంగా, భౌగోళికంగా దాదాపు ఒకేరకమైన రూపురేఖలను కలిగిఉన్నాయి. ఈ ఇరువురూ సాహిత్యంతో పాటు సాంస్కృతిక రంగంలోనూ విశేష కృషి చేసినవారే. ఇరువురూ దేశ అత్యుత్తమ పౌరపురస్కారాలను, జ్ఞానపీఠనూ పొందినవారే. నారాయణరెడ్డి పేరిట నెలకొల్పిన పురస్కారాన్ని తొట్టతొలిసారిగా చంద్రశేఖర కంబారకు అందజేస్తుండడం ముదావహం.



# మనస్సు పొరల్ని తొలిచే సినారె గీతాలు

పాటంటే హృదయ తంత్రుల్ని మీటే ఒక సుమధుర సప్తస్వరాల భావాల సమ్మేళనం. పాటంటే నిస్పృహల కల్లోలిత జీవితాల్లో చైతన్యం నింపే ఒక శక్తి స్వరం.

పాటంటే ఒక ఆలోచన... ఒక ఆవేదన... ఒక సంస్కారం... ఒక పరిష్కారం. పాటంటే దారి తప్పుతున్న జీవితాలకు వెలుగుచూపేది పాటంటే 'శ్రమజీవుల దేహంపై మొలచిన చెమట చుక్క. మానవాళికి విశ్రాంతినందించే ఒక ఆహ్లాద తరంగం. ఒక కడలి కెరటం. ఒక ఉప్పెన. సగటు మనిషి కల్లోలితమైన గుండెల సుడిగుండాల్లో చిక్కుకుని సతమతమవు తున్నప్పుడు స్వాంతన పరిచేది హాయినచ్చేది.

నేటిపాట సముద్రమై ఉప్పొంగుతుంది. ప్రవాహమై ఉరికలేస్తుంది.

డా॥సి. నారాయణరెడ్డి ఎన్నో వేల గీతాల్ని రాశారు. అవి కొన్ని టి.వి. సీరియల్స్‌లోనూ సినిమాలోనూ ఎంతోమందిని అలరించాయి. సినారె గీతాలు వేటి మీద రాసినా ఒక మనిషిని మేల్కొలిపేదే! హృదయాంతరాల్లోకి చొచ్చుకెళ్లి ఆలోచింపజేసేవే!! గుండె గుండెల్ని పిండేసేవే!! మానవ సంబంధాలు కనుమరుగై పోతున్న నేపద్యాన్ని స్వార్థంతో మనిషి దానవుడిగా మారుతున్న క్రమాన్ని నిరసిస్తూ కులం మతం పేరుతో మనిషి చేస్తున్న వికృత వైనాన్ని ఎత్తిచూపి ఇంకా మనిషి మౌలిక సత్యాన్ని తెలుసుకోలేక పోతున్నాడని ఆందోళన చెందుతాడు. అనేక సమస్యల మీద వాటికి కారణభూతుడైన మనుష్యులకు సంస్కారాలను తూర్పారబడుతాడు.

సినారె పాటల్లో జీవిత పరమార్థం పుష్కలంగా ఉంటుంది. సున్నితంగా చెప్పే విధానం ఆయన మనస్సును ప్రతిబింబిస్తుంది. ఆయన పాటలను నడిపే విధానం ఒక గొప్ప ప్రత్యేక ప్రక్రియ. సమస్యను ప్రకృతిలో విలీనం చేసి పాటకట్టడం వల్ల శ్రోత, పాఠకుడు ముగ్ధుడౌతాడు. సినారె గేయాలు దాదాపుగా అందులో పంచ భూతాలతో పెనవేసుకుపోయిన మనిషి సమస్య వుంటుంది మనిషి మనిషిని కరిగించే వేడిమి ఉంటుంది. మోడు వారిన మనిషి తిరిగి జీవంపో సుకుని చిగురిస్తాడు. శ్రోతనాడి చెల్సిన వాడే ఇలాంటి గుణం గల రచనలు చేస్తాడు. సినారే శాంతి కాముకుడు కాబట్టే పాటల్ని హృద్యంగా మలచగలిగాడు. సినారె గీతాలనగానే నేటి తరానికి ముందుగా గుర్తొచ్చే పాట ఒకటుంది.

**"అమ్మ కడుపులో ఒదిగున్నప్పుడు**
**అంటుకోదు స్వార్థం**
**పెరిగే కొద్ది మనిషికి స్వార్థం పొరలెందుకో!"**

అమ్మ కడుపులో ఉన్నప్పుడు మనిషికి స్వార్థం అనేది అంటుకోదు అప్పుడు మనిషి అనాగరికుడు, మనిషి పుట్టి పెరిగే కొద్ది నాగరికత తెలుసు కుంటాడు. అది తెల్సుకున్నప్పుడే స్వార్థం పెరుగుతుంది అనే సత్యాన్ని ఈ పాటలో చెప్పారు.

బైబిల్ ప్రకారం ఆడం, అవ్వా నాగరికత తెలిక పూర్వమే నిశిద్ధ ఫలాన్ని తిన్నారు. అది తిన్నాకే వాళ్ళకి నాగరికత తెల్సింది అప్పుడ్నుంచే వాళ్ళకి స్వార్థం అంటుకుంది. నాగరికత తెల్సుకోకుండానే మనిషి బ్రతకాలని, అప్పుడే మనిషి అనేవాడు నిస్వార్థంగా,పరిశుద్ధంగా ఉంటాడని దేవుడు భావించి వుంటాడు. అందువల్లే మనిషిని అనాగరికంగా ఉంచదలిచాడు కాబోలు. వాటిని అతిక్రమించిన మనిషి భౌతిక వాంచల్లో పడి తత్ఫలితాన్ని అనుభవించాడు. నాగరికతతో బాటు స్వార్థాన్ని కూడా మనిషి పెంచుకుంటున్నాడు.

"అమ్మ" సృష్టిలో ఇంతకంటే గొప్పపదం మరొకటి లేదు అమ్మను పోగొట్టుకున్న వాడంత అనాధ. ఈ ప్రపంచంలో మరొకడు ఉండడు. అమ్మ ప్రేమలోని అమృతాన్ని ఆస్వాదించని జీవి ఈ భూ ప్రపంచం మీ్మద ఉండదు. అమ్మ చేతి స్పర్శలోని తీయదనం ఆఖరి క్షణంలో కూడా ఆయుస్సు పెంచుతుంది. అమ్మ అనురాగం ముందు ఎన్ని సిరులున్నా దిగదుడుపే పంచభక్ష పరమాన్నాలైనా అమ్మచేతితో పిసికి ముద్దకట్టిన కారం రొట్టె సాటి రావు. ఇలా అమ్మ గురించి ఎంత రాసినా భాష కందని గొప్పభావం. అమ్మ గురించి ఎంతో మంది రాశారు. పాటైనా.. కవితైనా.. అమ్మ గురంచి రాయని వాడి జీవితం వ్యర్థం. సినారె అమ్మ గురించి రాశాడు.

**"అమ్మంటే ఎవరో తెలుసా**
**ఆ జన్మంటే ఏమో తెలుసా**
**నేల మీద ఉదయించిన దేవతరా అమ్మ**
**కన్నీళ్ళ చనుబాలూ కలబోస్తే ఆ జన్మ"**

**"అమ్మతనం తనకుందని అవని పొంగుతుంది**
**అమ్మను కాలేదే అని ఆకాశం కుములుతుంది"**

అంటూ అమ్మ గొప్పదనాన్ని చాటాడు.

తెలుగు వాళ్ళకి ఉగాది గొప్పపండుగ. ఆ రోజు కవులు స్పందిస్తూ కవితలు రాయడం ఆనాదిగా వస్తున్న ఆచారం. అయితే అది చిరకాలం నిలిచే కవిత్వం రాయాలి ఏది రాసినా చిరకాలం నిలవాలి.

ఎప్పటికీ సజీవంగా ఉండే పాటను సినారె రాశాడు ఎన్ని ఉగాదులు వచ్చినా స్త్రీ జాతికి మాత్రం స్వేచ్ఛ రాలేదని కవి మదనపడుతాడు. స్త్రీకి స్వేచ్ఛ లభించినప్పుడే అది అసలైన ఉగాది అంటాడు. అంతేకాదు.

**"కోకిల గొంతు కొనుక్కొని**
**కాకి పాడుతూ వున్నది**
**ఏది అసలు స్వరమో**
**తేల్చేసినపుడే ఉగాది"** అంటాడు.

ప్రేమ, అభిమానం, మానవత్వం మూర్తీభవించిన వాడిలా మనిషి నటిస్తున్నాడు. కృతిమమైె ప్రేమను ఒలకబోస్తున్నాడు. కోకిల గొంతు కొనుక్కుని కాకి పాడడం అనేది అభివ్యక్తి.

మనుధర్మాన్ని, తరతరాలుగా హిందుత్వంలో లోపభూయిష్టమైన ఆచారాల మీద కవి దుమ్మెత్తి పోస్తాడు. ఐక్యమత్యం సహజీవనాన్ని మించిన దానికంటే గొప్ప విషయం మరొక్కటి లేదంటాడు. సినారె సమదృష్టి గలవాడనడానికి ఈ పాటే ఉదాహరణ.

**"మతమని కులమని గిరులు గీసుకుని**
**మనుషులనే విభజిస్తారా!**
**మరుగున పడిన ఆ పురాణాలనే తిరగదోడి**
**చూపిస్తారా"!**

**"నీటికి చలనం ఉంటేనే ఏటికి వరదొస్తుందిరా**
**నిప్పుకు జ్వలనం ఉంటేనే గుప్పున మంటొస్తుదిరా**
**చైతన్యం చీలిపోతే జాతికి వెలుగు లేదురా**
**ప్రజాశక్తులు ఒకటై వుంటె ప్రగతికి తిరుగే లేదురా"** అంటూ జాగృత పరుస్తాడు. ఇలా చెప్పడంతో కవి విశ్వజనీయమైన భావాన్ని కలిగి ఉన్నాడని తెలుస్తోంది.

ప్రవహించే నీటికి, ప్రసరించే గాలికి కులమతాలు లేనప్పుడు అవి మనిషి కెందుకని ప్రశ్నిస్తాడు.

**"ఋతువు లెన్ని మారినా**
**మతులు మేర మీరినా**
**గతులెన్నడు తప్పని ఆగ్రహరాశికి ప్రణతు లు"**

ఇది ఎంతో లోతైన భావాన్ని స్ఫూరిస్తుంది.



స్పందించే మనస్సే ఉండాలి కానీ దేని మీదైనా పాట రాయొచ్చు! కవిత్వమూ రాయొచ్చు!! ఇంకా కష్టాల్లోనూ మాధుర్యాన్ని చవి చూడొచ్చు! ప్రకృతిలో తదాత్మ్యం పొంది ఆనందాన్ని ఆస్వాతించొచ్చు.

"కొంగవాగు మెలికలల్లో
కులుకులెన్ని మెరిసేనో
హరిణలలన పరుగులలో
మెరుపులెన్ని ఎగిసేనో
స్పందించే మనస్సుంటే
ప్రతి అందం గతిరమ్యం" అంటాడు సినారె.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నాడు శ్రీనాథుడు. సినారెకి తెలుగుభాష పట్ల అపారమైన ప్రేమ వుంది తెలుగు తేజాన్ని మెరిపిస్తూ ఎన్నో పాటలు రాశాడు.

"ఏ భాష చెణుకైనా ఏ యాస చినుకైనా
తనలోన కలుపుకుని తరలింది తెలుగు
ఒదిగొదిగి పోతున్న ఒరవళ్ళలో సాగి
హుమ్మంటు వేమనగ ఉరిమింది తెలుగు"

అంటూ తెలుగు గుణగణాల్ని సహనాన్ని గుర్తు చేస్తారు.

"స్వాతంత్ర్య సమరాన స్వచ్ఛంద గతులీన
ఉగ్రనేత్రం తెరచి ఉరికింది తెలుగు
శాంతికపోతమై క్రాంతి జలపాతమై
నిత్య వర్ధిష్ణువై నిలిచింది తెలుగు"

తెలుగు వాడికి శాంతి సహనమే కాదు. అవసరమైతే ప్రచండమైన ఉగ్రనేత్రాన్ని తెరచి తెలుగుతేజం సత్తా ఏపాటిదో తెలిపే పాట.

"పలుకు పలుకులోన తెలుగు
పలికెను పర్జన్యంలా
పదం పదంలోన తెలుగు
ఎదిగెను చైతన్యంలా" అంటాడు.

మాటల కోసం వెతుక్కోని కవి, భావాల కోసం తడుముకోని కవి. భౌతిక, తాత్విక దృక్పదాలతో ప్రతికాత్మకంగా కూడా పాటలను మలచ గల అనుభవజ్ఞుడు సృజనశీలి.

– కారం శంకర్

## తెలుగు సాహితీ జగత్తులో సినారె

చిన్ననాడే కష్ట సాగరాలు జూసి
మట్టి పరిమళాలను మనములో దాచుకుని
ఉర్దూ మాధ్యమంలో ఉన్నతులుగా నిలిచి
అమ్మ భాష నందు అమృతము పంచుతూ
పద్య కవిత గద్య మందు కీర్తి గాంచిరిసినారె
పుస్తకాలు చదివి రచనలు చేయుచు
తెలుగు భాష సొగబు జగతికి తెలుపుతూ
సినీ గేయ రచయితై పరిమళత్వం పంచి
ప్రక్రియ ఏదైనా పసిడి వన్నెల రాసి సినారె
అవార్డులెన్ని పొందిన ఒదిగి ఉంటూ
విశ్వంభర కావ్యంతో విశ్వమంత నిలిచి
తెలుగు సాహితీ జగత్తులో మేలుకొలుపు సినారే



–ఉండ్రాల రాజేశం
9966946084



## సినారె భళారే







– డా॥ బుర్ర మదుసూదన్‌రెడ్డి
9949700037

(4వ పేజీ తరువాయి..)

మనస్సు ఉంటే ప్రకృతి సుందర దృశ్యం.

"హృదయకంపనలోనే
ఉదయించును చిత్రములు
మధురకల్పనలోనే
మలచబడును శిల్పములు"

మనసు చలించినప్పుడే చిత్రము గీయడం జారుగుతుంది. ఊహ లేనిదే శిల్పాన్ని చెక్కలేము. శిల్పాన్ని తాను ముందు ఊహించుకొని మనసులో దాని రూపాన్ని చెక్కుకోవాలి.

శాంతిశ్రీ మనసులో అనేక సంఘర్షణలు చుట్టుముడుతాయి. మతవిద్య, జ్ఞానము, ప్రేమ , మానవత్వము మధ్య సంఘర్షణకు గురవు తుంది. మతానికి ప్రేమకి మధ్య నలిగిపోతుంది. ఏ మార్గాన్ని ఎన్నుకోవాలో తెలియాని అయోమయ స్థితలో పడిపోతుంది. మనసు పద్మదేవున్ని కోరుకుంటే, శరీరం మతా నికి లోబడుతుంది. నిస్పహా య స్థితిలో శాంతిశ్రీ తనలో తాను ఎంతో ఆవేదనకు గురౌతుంది.

మతాచారుడు గురుపీంమున కూర్చుండి మతబోధ చేస్తూన్నాడు. గురువు ముందర శాంతిశ్రీ కూర్చుంది. బుద్ధం శరణం ,సంఘం శరణం, ధర్మం శరణం అంటూ విద్యార్థులు శరణాలు పఠిస్తున్నారు.

"అఖిల విద్యార్థుల హృ
దంతరమ్ములు బౌద్ధ
ధర్మపీయూష విమ
లోర్మికా డోలికల
లో నోలలాడంగ
వినిపించె సన్నగా
వేణు నిక్వాణమ్ము"

అందరు విద్యార్థులు బౌద్ధ ధర్మామృతాన్ని గ్రోలుతుంటే శాంతిశ్రీ సన్నగా వేణు నాదం వినిపించసాగింది.

"ఆ వేణు నాదం
విశ్వవిద్యాలయ
వీధికక వడబోసి
నిలకుడ్యములెక్కి
నలువైపులను చూసి
కడకు శాంతిశ్రీని
కనిపెట్టి తలయూచి
మెల్లమెల్లగ గుండె
తలుపురెక్కలు ద్రోసి
చొరబారెనామెలో
మురళీ మృదుస్వరము".

అలా ఆ వేణు నాదం ఆమె గుండెలో చోచ్చుకుపోయింది. పద్మదేవుని ప్రేమతరంగాలను మోసుకొచ్చిన ఆ

వేణు గానం ఆమే హృదయాన్ని పద్మదేవునిలో లీనం చేస్తుంది.

"ఒకవైపు గురుదేవు
దుత్తుంగ గంగా త
రంగ స్వరమ్మెత్తి
ప్రవచించుచుండగా"

కోటి వేణువులు తనని రమ్మని పిలుస్తున్నట్టుగా ఆ నాదం తన మనసును తొలిచేస్తుంది. ఒకవైపు మతాచార్యుడు ఆజ్ఞాపిస్తున్నట్టుగా బోధనలు మరోవైపు తన జీవితం తనను పిలుస్తున్న పిలుపులు ఎంతో సంవేధన సంఘర్షణ . ఎటువైపు మనసు పెట్టాలో తెలియని స్థితి.

చివరకి శాంతిశ్రీ ప్రేమకు వశమైపోతుంది.

శాంతిశ్రీ కనులుమూసె
శాంతిశ్రీ తనువులేచె
నియమ్మును గడచి పద
మ్ములు కృష్ణమ్మకు దారితీసె.
"అతడు పంచమమమెత్తి
ఆలాపనము సేయ
ఆమె కోకిల యగుచు
అమరగానముచేసె"
అతడు పాడుచునుండె
అమె ఆడుచునుండె
అతడు విశ్వము మరిచె
ఆమె సర్వము మరిచె

ఆమె అతన్ని చేరింది అతని వేణుగాన సమ్మోహనంలో ఆమె మయూరమై విచ్చుకుంది . పురివిప్పిన నెమలిలా నాట్యం చెస్తుంది. అతను లోకాన్ని మరిచిపోయి ప్రేమలో తాదత్మ్యం చెందాడు.ఆమె తనను సర్వము మరిచి అతనలో లీనమైంది. ఒకిలో ఒకరు ఒదిగిపోయారు కాలాన్ని మారిచిపోయారు.

ప్రేమ ఆమెను జయించింది.అనురాగం ఆమెలో నిండిపోయింది.

"ఆమె విద్యాలయము
నందు కలత చెందు
ఆమె పద్మాలయము
నందు శాంతిని పొందు"

ఆమెకు ఇతరములు గడ్డిపోచగా మారాయి. పద్మదేవుని సన్నిధి సర్వస్వమైనది.

పద్మదేవుడు శాంతిశ్రీలు ప్రేమ లోకంలో తేలిపోతారు. ఒకరిపైఒకరికి ఎనలేని అనురాగం హెచ్చుతుంది.

వీరి ప్రణయం సంగతి అందరికి తెలుస్తుంది. తన స్నేహితురాలుసుజాత శాంతిశ్రీని వారిస్తుంది.

పద్మదేవుడు శాంతి
పతితులైరని సంఘ
మంతయు కోడి
యై కూసెనోసఖీ
మతశత్రువైన మ
న్మథ పూజసేతు రని
గుసగుసలు

సంఘంలో చెలరేగిన అలజడిని తనపై మోపబడిన వదంతులకు శాంతిశ్రీ చలించిపోయి వికలిత మనస్కురాలై విలపిస్తుంది. తనకు మతాచారుడు చెప్పిన మతబోధలు పదేపదే గుర్తుకు వచ్చి ఎన్నో కల్లోలాలకు లోనై, గురుదేవుని హితబోధలు, సంఘంలో చెలరేగిన వదంతుల కారణంగా శాంతిశ్రీ తనలో తానే కుమిలిపోయి అనేక విధాల తర్కించుకుంటుంది. అటు తననే సర్వస్వము గా ప్రేమించిన పద్మదేవుడు, ఇటు ప్రేమకు స్థానమివ్వని మతము. రెండిటి మధ్య తన మనసు నలిగిపోతుంది.

"తాను పద్మాహ్వయుని
తో నిల్చిపోవ లో
కులు తన్ను క్రిందు చూ
పులతోడ చూచెదరు
తాను మతమందిరము
త్యజించిపోవ సం
ఘము తన్ను పతితయని
గర్హణ మ్మొనరించు" అని తనలో తానే ఘర్షణ వాదోపవాదాల పిదప ఒక నిర్ణయానికి వచ్చి

గురుదేవ గురుదేవ
క్షుద్రజీవిని నేను
పరిపూర్ణ మతదీక్ష
బడయుగ దలచినాను'' అని మళ్ళి తన మనస్సును మతం వైపు మళ్ళించి పూర్తి మత దీక్ష తీసుకుంటుంది.

దానితో పద్మదేవుడు చలించిపోయి మనసు విరిగి అక్కడినుండి వెళ్ళిపోతాడు. ఆమె పద్మదేవుని కొరకు విలపించి విలపించి బాధపడుతుంది. చివరకు స్వప్నములో ఆమె పద్మదేవుణ్ణి చేరుకుంటుంది అని కావ్యాన్ని ముగించారు.

కావ్యంలో మతము గురించి చెప్పిన విశేషాలు: పద్మదేవుడికి శాంతిశ్రీకి జరిగిన సంభాషణలో

" మతము దృష్టిలో స్నేహ
మ్మతి దూష్యమ్మైన గాని
మనవతను వెలిగించెడు
మహిత సాధనమ్మదియే" అని మతను యొక్క పరమార్థాన్ని పద్మనాయకుని చేత పలికిస్తాడు కవి.

"మతములేక పవిత్రముగ
బ్రతుకు మార్గమే లేదా
మతము విశ్వకళ్యాణ
మార్గ సూచకమ్మగునా? అని మతము జివితాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో శాంతిశ్రీ ద్వారా పలికిస్తారు.

పద్మనాయకునికి గురుదేవునికి జరిగిన సంభాషణలో

"మతమనియెడు పచ్చి మచ్చు
మందు నామెపైన చల్లి
ఆమె కళాత్మక జీవన
మవనిపాలు చేసినారు." అని మతము ఒక మత్తుమందు అని సూచిస్తారు.

"మానవత్వ సంరక్షణ
మహాప్రయోజనము కొరకు
మతము గాని మీరేమో
మతము కొరకు మతమందురు " అని అసలైన మతం పరమార్థాన్ని కావ్యనాయకుని తో పలికిస్తారు.

కావ్యం లోని వర్ణణా విశేషాలు:–

"అదిగో కృష్ణమ్మ న
వ్యాప్సరోగన భంగి
నడయాడె నాంధ్రభూ
నందనోద్యానమున"

అంటూ కృష్ణమ్మ అప్సరస్త్రీలాగా ఆంధ్రదేశమున నడయాడింది అని చెపుతూ అన్యాపదేశంగా కావ్యనాయికను పరిచయంచేస్తారు.

"ఆమె ఒకమారు నో
రారపల్కినచాలు
పదివేల కిన్నరులు
పదివేల కిన్నరల
హృదయతంత్రికలు మ్రో
యించినటులనిపించు"

అలలు అలలుగా ప్రవహించే నది హొరు పదివేల వీణలు మ్రోగినట్టుగా ఉంది అంటారు. ఇక్కడ కావ్యనాయిక ను సంకేతంగా చెప్పడం కనబడుతుంది. ఆమె కెరటాలు కావితలుగా పయనిస్తున్నాయి.

"ఆమె యొడిలోన ని
ద్రావస్థలో నున్న
శిశువుల విధాన ప
చ్చిక బయళ్ళప్పారు."

అక్కడి పచ్చికబయళ్ళు ఆమె ఒడిలో నిద్రిస్తున్న శిశువుల్లాగా ఉన్నాయి.

కృష్ణవేణి ఒకవైపున
కెరలి నిండుగా పారగ
మరియొక వైపున ప్రజాళి
కరువు బరువులను క్రుంగెను.
సూర్యోదయవర్ణణ÷
ఒకమహాజ్ఞాని మౌ
ఖిక వికాసము చూపు
వేళ రేకులు విప్పు
విమలభావన భంగి

ఒక మహా జ్ఞాని తపస్సు ఫలించి ముఖము వికసించే విధంగా

"ప్రాచీదిగంగనా
ఫాలరంగముపైన
కుసుమించె స్వచ్ఛ కుం
కుమ కాంతి గుచ్ఛమ్ము"

తూరుపు దిశలో కుంకుమ గుచ్ఛంలాగా ఎర్రగా సూర్యుడు ఉదయించాడు.

"నల్దెసల పక్షి సం
తానమ్ము లెవియొ వ్యా
ఖ్యల కందలేని శ్లో
కమ్ములను విన్పించె.

పక్షులు చేసే ధ్వనులు కిలకిలారావాలు సుప్రభాత శ్లోకాల్లా అవి కూడా వ్యాఖ్యానం చేప్పనలవి కాని శ్లోకాల్లా ఉన్నాయంటారు. ఈ ఉషోదయమే వసంతఋతు ఆగమనం కూడా అందువల్ల ఇంకా శోభాయమానంగా ఉంది.

# డా॥ కేతవరపు రాజ్యశ్రీ కవితాక్షరం అస్తిత్వమైన వేళ




డా॥ కేతవరపు రాజశ్రీ "అక్షరం అస్తిత్వమైన వేళ' పుస్తక సంపుటిలో ఉత్తమ సాహితీవేత్తగా రచయిత్రి సాధించిన ప్రతిభావంతమైన జీవన ఔన్నత్య విలువలు, కవిత్వ తత్త్వ సృజనాత్మక రమణీయత, అక్షర విలక్షణంగా సాక్షాత్కరిస్తున్నాయి. ఆరు ప్రధాన అధ్యాయ అంశాలుగా వెలుగుచూసిన రచయిత్రి సాహితీ సర్వస్వం, ఆమె జీవన కాలంతో ప్రవహిస్తూ అద్భుత భావనా వైచిత్రి ప్రదర్శింపచేస్తుంది" 'సమాధానాలై పలికిన ప్రశ్నలు' తొలి అధ్యాయంలో వైవిధ్యభరితమైన వివిధ సాహితీ ప్రక్రియలలో ఉన్నత ఉద్యోగ బాధ్యతలను, కుటుంబ నేపధ్య తాదాత్మ్యతతో సామాజిక మానవతా మహిళగా, కవితలలో ప్రస్ఫుటింపచేసి సమకాలీన మేధావంతులైన లబ్ధ ప్రతిష్టుల ప్రశంసలు పొందిన విశ్లేషణాపరమైన విశేషాలు ఆమె వ్యక్తిత్వ ప్రతిభకు అద్దం పడుతున్నాయి. "సత్యం.. శివం.. ఆధ్యాత్మికం"లో రచయిత్రిగా ఆమె ఆధ్యాత్మిక భావజాలంవైపు మళ్ళి, తన కవిత్వానికి అర్థవంతమైన ఆధ్యాత్మిక పరిమళం ప్రసరింపచేసారు. 'బహుముఖీన' వ్యక్తిత్వంలో కవయిత్రి, తాను జీవిస్తున్న సమకాలీన సమాజాన్ని కవితా హృదయంతో స్పృశిస్తూ, మాతృమూర్తిగా స్నేహశీలిగా, మానవిగా, చైతన్యశీలిగా, ఉదాత్త మహిళగా తనను ఆవిష్కరింపచేసుకొని ప్రశంసనీయ కవితా సార్థక్యం సాధిస్తారు. 'మినీ.. మెగాకాదు అంతా కవిత్వమే' నాల్గవ అధ్యాయంలో, కవయిత్రి మినీ కవితలలో సామాజికతను ప్రధానంగా స్వీకరించి, ప్రజాస్వామ్య ప్రక్షాళన మహిల వేదన, మద్యం మాఫియాపై ధర్మాగ్రహం వంటి ఎన్నో విషయాలపై ధిక్కారం వ్యక్తం చేసిన కవితాత్మ ప్రతిబింబిస్తుంది. 'గీతను జాజ్వల్యం చేసిన గీతామృతం'లో 108 శ్లోకాలను ఎంపిక చేసుకొని లెక్కల్లో భగవద్గీతను అవతరింపచేసిన ఆధ్యాత్మిక తత్త్వ చైతన్యశీలిగా తననను తాను ఆవిష్కరించు కొంటారు. ఆరవ అధ్యాయం 'డాక్టర్' రాజశ్రీ కవిత్వంలో ద్వీపాలు-దీపాలు ఆమె కవిత్వ, సాహిత్య సమగ్ర రూపాన్ని అందిస్తోంది. ఈ సంపుటిలో ఎన్నో చిరుసవ్వడులు, గుండె చప్పుళ్ళు, అనిర్వచనీయ అనుభూతుల ప్రశంసలు, ఊహల వసంతాలు, వెన్నెల మెట్లు, బొమ్మ బొరుసు, ప్రముఖులతో ఛాయాచిత్రాలు కవయిత్రి ప్రతిభను దర్పణంగా వున్నాయి.

ప్రతులకు: డా॥ కె. రాజశ్రీ
ప్లాట్ నెం. 301,
గోకుల్ అపార్ట్‌మెంట్స్
స్ట్రీట్ నెం. 4, అశోకనగర్,
హైదరాబాద్-500 020
సెల్: 8500121990



-జయసూర్య
సెల్: 9440664610

# డా॥ పోతుకూచి సాహితీ సమాలోచనం- ఉపన్యాస వ్యాస సంకలనం




సాహిత్య భీష్మాచార్య "కృష్ణానంద", "కళాప్రపూర్ణ" "సంస్కృతీ భూషణ్" "సరస్వతీ సమ్మాన్" మరియు "భారత్ భాషాభూషణ్" డా॥ పోతుకూచి సాంబశివరావు (27-1-1927 నుండి 6-8-2018)గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీవేత్త, న్యాయవాది. జ్యోతిశ్శాస్త్రవేత్త. ప్రకృతి వైద్యుడు. సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవ ఎనలేనిది. కర్మయోగి, కృష్ణోపాసకుడు నటుడు, సంగీతోపాసకులైన వీరు రాజకీయ రంగంలో కూడా ఆసక్తి కనబరిచారు.

చివరకు సాహిత్య రంగంలో స్థిరపడి ఎన్నో సాహితీ సమావేశాల్ని నిర్వహించేవారు. సాహితీవేత్తలను ప్రోత్సహించటం, సన్మానాలు చేయటం వారికి ఎంతో ఇష్టంగా ఉండేది. చివరి వరకు అంటే 3 ఆగష్టు 2017 వరకూ సాహితీ సమావేశాలను నిర్వహించారంటే వారి సాహిత్యాభిలాషను అర్థం చేసుకోవచ్చును. "విశ్వసాహితి" వారు స్థాపించిన అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సంస్థ. విశ్వసాహితివారు పోతుకూచి నిర్మాణానంతరం నెలనెలా "పోతుకూచి సాహితీ సమాలోచనం" పేరిట సాహితీవేత్తల ప్రసంగాలు శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించారు. 'సమాలోచనం'లో వచ్చిన ఉపన్యాసవ్యాసాలు, వారి అభిమానులు రాసిన మరికొన్ని వ్యాసాలు మరియు ఆయనపై రాయబడ్డ కొన్ని కవితలు ప్రస్తుత సంకలనం. "డా॥ పోతుకూచి సాహితీ సమాలోచనం- ఉపన్యాస సంకలనం" పేరిట డా॥బి .జయరాములు సంపాదకత్వంలో వెలువడింది. సంకలన కర్తలుగా "భారత్ భాషాభూషణ్" అవార్డు గ్రహీతలు శ్రీ తంగిరాల చక్రవర్తిగారు మరియు శ్రీమతి గోళ్ళమూడి పద్మావతిగారు వ్యవహరించారు. శ్రీ పి.వి. మనోహరరావు అధ్యక్షులు సర్వార్థ సంక్షేమ సమితి. దంపతులకు పోతుకూచి వారి ప్రథమ వర్ధంతి పురస్కారంగా తేదీ: 27-8-2018న అంకితమీయబడింది సంకలనం. నెలనెలా "సాహితీ సమాలోచనం"లో ప్రసంగకర్తల ఉపన్యాసవ్యాసాలు (10)తో బాటు పోతుకూచి వారిని ఆత్మీయంగా ఎరిగిన ఆయన సన్నిహితుల వ్యాసాలు, కవితలు ఇవ్వబడ్డాయి.

పోతుకూచి వారి వీరాద్రూపాన్ని ఆచార్య టీ. గౌరీశంకర్‌గారు కవిత్వాన్ని సుధామగారు విపులంగా వివరించారు. పోతుకూచిగారు రచించిన జీవన నాదం (నవల)పై డా॥ బి. జయరాములుగారు, 'చుక్కలు' అనబడిన కవితా ప్రక్రియపై టి. చక్రవర్తి, అన్వేషణ (నవల)పై శిష్టా మాధవి, ఉదయ కిరణాలు (నవల) గోళ్ళమూడి పద్మావతి, ఎదురు ప్రశ్నలు (కథా సంకలనం)పై కూర చిదంబరం, రాలిన పూలు, అలల జడలు (కవితా సంపుటాలు)పై ఎస్. విజయలక్ష్మి, చీకటి వలయాలు (నవల), కె. లలిత, వారి వైద్యంపై ఆచార్య కడారి సత్యమూర్తి, న్యాయవాద వృత్తిపై ఆర్. దుర్గాప్రసన్నగారలు తమ అమూల్యాభిప్రాయాలు వెలిబుచ్చారు. సంకలనం చివరన విశ్వ సాహితీ వారు నిర్వహించిన నెలనెలా నిర్వహించిన సాహితీ సమాలోచన సభల వివరాలు ఇవ్వబడ్డాయి. అన్యాయాన్ని సహించవద్దని, ఎదిరించమని ఎందరో కళాకా రులను, సాహితీవేత్తలను ప్రోత్సహించే, శ్రీ పోతు కూచి వారి జీవితం, విశిష్ట వ్యక్తిత్వం, బహుముఖ ప్రజ్ఞ చిరస్మరణీయం. సకల మానవాళికి ఆదర్శనీయం మరియు అనుసరనీ యం. విశ్వ సాహితీ వారి ఈ సంకలనం ప్రశంసనీయం. డా॥బి. జయరాములు గారు తన ముందు మంటలో చెప్పినట్లు పోతుకూచి వారిపై రెండవ సంకలనం కూడా త్వరలో వెలుగు చూస్తుందని ఆశిద్దాం.

ప్రతులకు: డా॥బి. జయరాములు
1-3-92/6/1, బి. భాగ్యలక్ష్మినగర్,
కవాడిగూడ, హైదరాబాద్-80.



-కూర చిదంబరం
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

# రమణీయ భావాల సమాహారం!



'వెన్నెల' కలం పేరుతో వెలుగొందుతున్న డా॥ వి.స్వర్ణకుమారిగారు

**'సిగ్గులను జారవిడిచి**
**నిగ్గులతో కౌగిలికి చేరిన**
**నవ జంటలకు ఎక్కడిదే..?**
**నీవు లేని సోయగం"** అంటూ రమణీయ భావాల సమాహారంగా "వెన్నెల కౌగిళ్ళు" కవితా సంపుటిని ప్రకటించిన కవయిత్రి గ్రంథాన్ని అందాల చందమామకే అంకితమివ్వడం అభినందనీయం! సుందరమైన భావ చిత్రాలతో అత్యంత మనోహరంగా రూపుదిద్దిన ఈ గ్రంథంలో భావ కవిత్వానికి పెద్దపీట వేసి. కవయిత్రి వెన్నెలగారు అందరినీ అలరింపజేశారు. మధుర భావనలతో.. భావోద్వేగాలను జోడించి.. చక్కని భావుకతతో చిక్కని కవిత్వాన్ని పండించిన కవయిత్రి తన మనసు కలం నుండి జారవిడిచిన అక్షరాలు మసకేసిన మబ్బు తెరలను తొలగించేలా కొలువు దీరాయి. ఈ ప్రేమ కావ్యంలో రెండు వందల కవితలకు చోటు కల్పించారు. ఇందులోని కవితా పంక్తులు వలపుల దిగులను పంచుతాయి. పారిజాత పరిమళాల సుగంధాలను వెదజల్లుతాయి! పాఠకులకు గిలిగింతలు పెడుతూ ఊహల ఊయలలో ఊరేగిస్తాయి! అక్షరాల మాటున దాగిన కొంటె చూపుల వంటి అక్షరాలు.. మదిలో గుబులు లేపుతాయి! ఊపిరాడని వెచ్చని కౌగిట్లో బంధించేలా. పదబంధాలు అడుగడుగునా తారసపడతాయి! ముద్దుల హద్దులను తెలపడమే గాక.. తనువుల పోరాటంలో ముద్దుల ఉబలాటాన్ని తెలుపుతూ ఊహా లోకాల్లోకి లాక్కొని వెళతాయి! చిరుముద్దుల్లోని మధురత్వం, పెదవుల దాహంతో మనసు పడే ఆరాటం.. ఎదురు చూపుల కోలాటం.. గుస గుసల సయ్యాటలను కవయిత్రి వెన్నెల గారు తమ కవిత్వంలో అందంగా ఆవిష్కరించారు.

**ఓ మనస్సు కొలనులో.. నన్ను**
**జలకమాడించి.. నీ మమతల ఒడిలో**
**నన్ను అలరించి.. నా మనస్సుకు భాష్యం**
**చెప్పిన నువ్వే.. 'నా హృదయ స్పందన'** అంటూ వెండి వెన్నెలనుద్దేశించి వెన్నెలగారు రాసిన కవితా పంక్తులు అందరినీ ఇట్టే అలరిస్తాయి!

**కొంగుచాటున.. దాగినది!**
**కనుసైగకు దొరకనిది.. సన్నజాజిలా సన్ననిది!**
**మల్లె పూవులా మెత్తనిది!**
**తమలపాకులా సున్నితమై..**
**బిగి కౌగిట.. నలిగేదే**
**ఈ "నడుము" అని "నడుము"ను** ఓ కవితలో కవితాత్మకంగా చిత్రించారు.

"నేను.." కవితను సిగ్గులొలుకు చిన్నదాన్ని.. నిగ్గులను దాచుకొన్న లేత బుగ్గల దాన్ని అంటూ ప్రారంభించిన తీరు బాగుంది. హొయలొలుకు వలపుల దాన్ని... జాజుల-మోజులు కురిపించు దాన్ని ప్రియా... నీ జవరాలిని..!! అంటూ మంచి ముగింపునిచ్చారు. మరో కవితలో తలపుల మెరుపులే.. నా తెల్ల చీర అని అది తాకిన నాజుకు.. నామేనిదే ఈ వలపుల సోయగం అని తెల్చి చెప్పారు. 'తొలిరేయి' కవితలో తాళలేని తాపాన్ని రమణీయంగా ఆవిష్కరించారు. 'వలపుల తొందర' కవితలో నీ తలపుల వలయంలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను. సేద తీర్చవా.. నీ ముద్దుల తాపంతో అని వేడుకో వడం బాగుంది. సిగ్గు దొంతరల నడుమ.. నా తలపులతో జలకమాడి.. నా చిలిపి ఆశలను.. కుర చగా మేనికి చుట్టుకుని.. సౌందర్యమా అడుగువిడవా" అంటూ అభ్యర్థించింది!

"వలపు ఊరట" కవితలో కవయిత్రి ప్రయోగించిన పదబంధాలు మనకు చెక్కిలి గింతలు పెడతాయి. కవులను కైవసం చేసుకునే కులుకుల తీగకు నాకు సుమాంజలి అంటూ మదిని అల్లిన మల్లె తీగను విభిన్న రీతుల్లో ఆవిష్కరించారు.

ఎదురొచ్చే అందాలతో.. కవ్వించే వసంతమా.. తొందర చేసే నీ కౌగిలికై నే.. వెన్నెల పరిచానని చెప్పడం కవయిత్రి యొక్క కలం బలాన్ని సూచి స్తోంది. ఉప్పొంగు ఊసులేవో.. నాలో! అలజడి రేపు తూ.. తొందర చేసెనోయి,, నీ ఒడి చేర! అంటూ చక్కని భావాలతో 'పలకరించు మల్లెలు' కవితకు జీం పోశారు. నీ ఊహలతో.. నా తనువు తేలికై.. నా చిలిపి ఊసులను నా మేనికి సింగారించిం దంటూ 'తేలికైన తనువు' కవితను తీర్చి దిద్దారు.

వెన్నెల కాంతిలో పయ్యెద సిగ్గులను మరో కవితలో ఆరబోశారు.

**అందని.. నా అందమా!**
**అలసిన నా నేస్తమా!**
**మమతెరిగిన మమకారమా!**
**మరువ లేని కావ్యమా!**
**మనసైన ప్రియ బంధమా! ఈ ఒంటరి తనం న్యాయమా?** అంటూ ఇంకో కవితలో ప్రశ్నించింది.

నా నడుము వంపు చూసి తాళలేక ఏ వంక దాగెనో ఆ నెలవంక అంటూ 'వలపుల నెలవంక' కవితలో చమత్కరించారు.

'కడతేరనా పరవశించి" కవితలో నీ భావాల **కెరటాలలో తడిచి**
**నీ కలల అలలలో తేలియాడి**
**నీ ప్రేమలో ఉప్పొంగి.. నీ పాల కడలిలో పరవశించి.. కడతేరనా ప్రియ బంధమా! నీలో నన్ను దాచుకుని** అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి! మరో కవితలో

**అలసిన నా మనస్సు..ఎడారిలో**
**అగుపించిన ఒయాసిస్సు నువ్వు**
**నా జీవితాన ఎండమావి కాకూడదు నేస్తమా"**
**అంటూ వేడుకుంది.**

**సాగర తీరం"** కవితలో.. కవయిత్రి ప్రయోగించిన పదబంధాలు అందంగా ఒదిగిపోయాయి! లతలా అల్లుకుపోయిన ప్రేయసీ ప్రియుల తనువుల కోలహాలంలో,. మధువులకై పెదవులు పడే ఆరాటాన్ని.. బిగి కౌగిలిలో ఇరు మేనుల కోలాటాన్ని కవయిత్రి రమణీయంగా చిత్రించారు.

'పొదరిల్లు' కవితలో అక్షరాల మాటున దాగిన భావాలు.. కవ్వింతల పొదరింటిలోకి లాక్కొని వెళ్ళి.. గిలిగింతలు పానుపుపై.. పులకింతల పక్కను వేసి.. చెక్కిలి గింతల ఊసులతో చక్కగా ఒక్కటై పోదామంటూ కవ్విస్తాయి!

ఇలా దాదాపు అన్ని కవితల్లో అడుగడుగునా ఆగని వయసుల కలవరింతలను.. అందని మనసు ఆరాటాలను.. చెలికాడి చెంతలో పడే చెలగాటాలను.. ముద్దులకై హద్దులు దాటే ఉబలాటాలను.. కౌగిళ్ళ ఇరకాటాల్లో.. తనువుల పోరాటాలను.. అక్షరాల్లో అత్యంత మనోహరంగా ఆవిష్కరించ డంలో కవయిత్రి సఫలీకృతులైనారు. అల్లరి అల్లికలతో ఇందలి అక్షరాలు చేసే విన్యాసాలు.. పాఠకులకు సాంత్వననిస్తాయి!

ఇందలి కవితా పంక్తులు..

ముద్దుల గంధం పూసి.. వలపుల ఊయలలూగిస్తాయి! కసిగా ఉసిగొలిపే కబుర్లను చెబుతాయి! మసక చీకటిలో మరులు గొలిపేలా.. వెచ్చని వలపులను రెచ్చ గొడతాయి! పెదలపై తీపి రాగమై.. ప్రేమ రాగాలను ఆలపిస్తాయి!

ఇందలి కవితా పంక్తుల్లో కొలువుదీరిన అరుదైన.. పరువాలు.. అవి విరిసే అరవిందాలు.. మల్లెల గుబాళింపులతో.. సంపెంగల పరిమళాలను వెదజల్లుతాయి! అందలమంటే ఆనందాన్ని పంచే ఇందలి భావాలు అడుగడుగునా పాఠకులకు చెక్కిలి గింతలు పెడతాయి! వెన్నెల పేరుతో భాసిల్లుతున్న డా॥ స్వర్ణ కుమారిగారి రచనా వైచిత్రిని చూసి అందరం ముగ్ధులవుతాం..

కవయిత్రి గీసిన ముఖచిత్రం గ్రంథానికి నిండు శోభను కూర్చింది. ఆయా కవితలకు గీసిన రేఖాచిత్రాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి.

కవయిత్రి ప్రకటించిన మధుర భావనలు.. పాఠకులకు చక్కని అనుభూతులను పంచుతాయి!

ప్రతులకు: డా॥ స్వర్ణకుమారి
సీనియర్ మెడికల్ ఆఫీసర్
సిబిఎస్. డిస్పెన్సరీ.ఎపిఎస్‌ఆర్‌టీసీ
బస్‌స్టాండ్ విజయవాడ



-దాస్యం సేనాధిపతి
94405 25544

## గుండె మండుతుంది

గుండె ఉప్పెనలా మండుతుంది
యువరక్తం సలసలమని మరుగుతుంది

అధికారం కోసమని అక్రమార్కులు
ఊసరవెల్లులై అటు ఇటుమని దూకుతుంటే
బిరబిర మని వాహానాలు
బుర్రున పరుగెడుతుంటే
రంగురంగుల పతాకాలు
రెపరెపలు కొడుతుంటే
అమాయకపు ఈ పిచ్చిజనం
సారా మత్తులో ఊగుతుంటే
కులగజ్జి కుక్కలకు కొమ్ములు మొలుస్తుంటే
మతపిచ్చి మతోన్మాదులు మీసాలు మెలేస్తుంటే
అక్రమార్కుడు గద్దెనెక్కి గలగల మాట్లాడుతుంటే
రామన్న రాజ్యమంటు వలలే విసురుతుంటే
మతానికో పార్టీ,కులానికో జెండాలతో
ఎన్నికలలో రణరంగం సృష్టిస్తుంటే

గుండె ఉప్పెనలా మండుతుంది...
యువరక్తం సలసలమని మరుగుతుంది
ఈ కులగజ్జి రాజకీయాలను కూల్చేయమని
మతోన్మాధ రాజకీయాలను పెకిలించేయమని
కుటుంబ పాలనలను తరిమితరిమి కొట్టమని
అవినీతి,అక్రమణలు లేని నిష్కల్మషమయిన
స్వతంత్ర్య భారతాన్ని కనులారా చూడాలని
ఆ పవిత్ర భారతావనిలో
తనువు చాలించాలని



-కుర్రపోతు నవీన్
7995916924

## గూడు

చూరు కింది
గూడు
చెట్టుమీది గూడు
పుల్లపుల్ల
ఏరి కూరి
నిర్మించుకునే గూడు
చదువు లేదు
నాగరికత మచ్చుకైనా తెలీదు
సివిల్ ఇంజినీరింగ్ ప్రావీణ్యత ఎఱుకలే

నాకో గూడు
తలదాచుకోవటానికి
నా వారసులకో నెలవు
వాటి రెక్కలపై అవి ఎగిరేదాకా
సృష్టి ప్రక్రియలో నేనూ ఒకరిని

సూర్యుడుండగానే
నా అన్వేషణ
నా ప్రయత్నం
నా సృజనాత్మకత
నేనల్లిన గూటిలో
నా శ్రమ శిల్పం ప్రతిబింబం

నా గూడు
నా జీవన సంకల్పం
సంచరిస్తూ
స్వేచ్ఛగా సాగే నా జీవన యాత్రలో
గూడు నా కలల సోపానం
నాలో దాగిన కళకి సాక్ష్యం



-గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## నెలరాజా....వెన్నెలరాజా..

సిరివెన్నెల కురిపించే
నింగిలోని చందమామతో
అందెను నేడే అందని జాబిల్లి..
అనిపాడుకుందామా..?
తనపై పాదమోపిన నీల్ ఆమ్ స్ట్రాంగ్ ని
మరెన్నో మూగజీవాలను గుర్తుచేసుకుందామా?
చందమామ బాగుందిచూడు...
చౌథవీ కా చాంద్ హో...
వెన్నెలరేయి ఎంతో హాయి..
అంటూ పల్లవులెన్నో గుర్తుచేసుకుందామా?
చంద్రలోకమైనా,దేవేంద్రలోకమైనా
గగనాంతర రోదసికి చేరుకొనే
మానవుడే మహనీయుడని
మరోసారి కీర్తించుకుందామా?
మింటిలోన నీవు ఒంటిగాడివై..
అని దిగులుచెందనీక తోడవుదామా?
పగలేవెన్నెలగా జగాన ఊయలలూగుదామా?
చంద్రయాన్..ఆగినా..సాగినా
ఎన్ని కలవరింతలో ఎన్నిపులకరింతలో
పాలపుంత చేరువలో నిన్నుచేరువేళలో
నెలరాజా..వెన్నెలరాజా...!



-డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి

## పరువులేని బ్రతుకు

అనివార్యమైన వెలుగునుఅడ్డుకోవటానికి
హత్యలు మొదలయ్యాయి
చీకటి నుండి చీకట్లోకి ఇంకా చీకట్లోకి
కులం నేడు బలం కాదు
అమావాస్యను ప్రతిష్టించుకోవటానికి
ఇంటిపెద్ద
కత్తులతో కటార్లతో
ఇంటిదీపాన్ని ఆర్పేస్తున్నాడు
ఎటుపోతున్నాం మనం!
దుఃఖంతో వ్రాస్తున్న కవిత్వమిది
వెక్కివెక్కి ఏడుస్తున్న అక్షరమిది
రేపటి తరాన్ని చంపే హక్కు
నీకూ నాకూ ఎవరికుంది?
ఎవరు ఆపుతారు సూర్యోదయాన్ని
ఎవరు ఆపగలరు వెన్నెల ప్రపంచాన్ని
మనకంటి వెలుగును మనం ఆరిపేసుకొంటు
చీకట్లోకి వెలుతున్నామని
దుఃఖపడుతున్న రోజులివి
కులాంతర పెళ్లి- మతాంతర మనుగడ-
రేపటి నందనవన సృష్టికి
పునాది రాయి తప్ప-
కార్చిచ్చు కాదు, ముళ్లకంప కాదు
ఎడారి బ్రతుకు కాదు
కన్నప్రేమ వెర్రితలలు వేస్తున్న
అగ్రకులాధిపత్య రోజులివి.



- సి.హెచ్. మధు
9949486122

## పని ముద్దు

కం॥ నేర్వుము విద్యా బుద్ధులు
నేర్వుము నౌకవృత్తినైన నేర్వగవలయున్
నేర్వని మనిషియు నెపుడును
నుర్విన బ్రతుకంగ లేదు వుండును దృఢగున్.

కం॥ స్వంతము బ్రతుకే గొప్పది
పొంతన పరవారి పనికి పోవనునెపుడున్
నింతయు స్వేచ్ఛయునుండదు
యెంతయొ శ్రమజేయవలయు నిలలో నీవున్.

కం॥ తనకాళ్ళపైన బ్రతికన
ఘనముగ యీలోకమందు కాసులు కురియున్
పనికూలి జేయువారిల
యనుదినమును హాయిగుండు నాకలిలేకన్

కం॥ విద్యను నేర్చిన పిమ్మట
వుద్యోగము దొరుకదేని వుత్తది బ్రతుకున్
మధ్యన నేవిధిదో చక
మధ్య వయసులోనె జచ్చు మహిలో నరులున్

కం॥ పనిజేయు వారునెప్పుడు
మనమున చింతేమిలేక మనుగడసాగన్
పనికొంగ నివాయిలనను
ధనమగు నొకదున్నపోతుగాదే జూడన్.



- సామలేటి లింగమూర్తి
9422912155

## కందిలి

నా గతం గగనంలో
ప్రతి శ్రమ నిశినీ పంచుకొన్న
సాక్ష్యపు నక్షత్రం "మా ఇంటి లాంతరు!"

చీకటి చెక్కిలిని తను ముద్దాడగానే
మా పేద వాకిట్లో కాంతిపొద్దు పొడిచేది!

గాజుమేడ పొత్తిళ్లల్లో తనునవ్వగానే
మా పూరింటి చూరుకి
వెలుగు మల్లెలు పూసేవి!

కష్టం బాటలో తను ప్రసవించగానే
అమ్మానాన్నా జోడెడ్లపాదాలకు
వేకువ సత్తువ మొలిచేది!

దిగులుకళ్ళ గుమ్మంలో
తను వెలుగు కళ్ళాపీ చల్లగానే
అమ్మ రెప్పల సందుల్లో
కన్నీళ్లు ఆవిరిపాట పాడేవి!

నా దేహ మన్నులో
గెలుపు పోరు సలుపుతున్న
చదువు విత్తులో
రేయంతా ప్రేరణ ఉత్తేజాన్ని
అనువదించేది!

విద్యా తరువై నేను వృద్ధి చెందాక
బీదరికం కొమ్మల్లో నే ముట్టించిన
విద్యుత్ దీపాలు
నా పట్టుదల ప్రతిబింబాలేమో కానీ....
నా వెతల కాలం మసిచేస్తూ
నా స్వేదంతో పాటూ
తరిగిన తన చమురుస్పర్శ
నా ఎదుగుదల జ్వాలకు
ప్రథమ ప్రమిదె!

కన్నవారి రెక్కలతో పాటూ
నాకై కరిగిన
తనకూ విశ్రాంతినిచ్చినప్పటికీ.....
నా గుండె గూటిలో ఇప్పటికీ
తనని వెలిగించుకుంటున్నా
సజీవ జ్యోతిగా!

-డి.నాగజ్యోతిశేఖర్
9492164193

## ఎవరు గొప్ప

బంగారు చంచతో పుట్టడం గొప్పదా! కృష్ణ ప్రేమకు పాత్రుడు సుదాముడు గొప్పోడా!
సాహిత్య వేదికలో నడవడం గొప్పనా!
హిమాలయాల్లో తపోనిష్టత చేయడం గొప్పనా! ఎవరెస్ట్ పైన జెండాను పాతడం గొప్పనా!
రామచరిత రాసిన వాల్మీకి గొప్పోడా! వేదాల-ఉపనిషత్తుల వ్యాసుడు గొప్పోడా!
దేశరక్షణలోన అమర సైనికుడు గొప్పోడా! ఐశ్వర్య సిరులు గల అంబానీ గొప్పోడా!
కంప్యూటర్ కనుగొన్న బాబు గొప్పోడా! గోడ నురుకించిన ముక్తబాయి గొప్పదా!

భక్తితో మోక్షము పొందడం గొప్పనా
నోబుల్ బహుమతి పొందినది గొప్పనా! చంద్రమండలం మీద నివసించడం గొప్పనా!
హిందుసామ్రాజ్య సంస్థాపనము శివాజి గొప్పోడా! భూమాత పుత్రిక సీతమ్మ గొప్పనా!
రామబాణం రావరావణుడిని చంపింది గొప్పనా!
ఐదుగురు భర్తలతో అడవిపాలైన ద్రౌపది గొప్పనా!
అర్జునుడు భీష్మున్ని చంపడం గొప్పనా!
పాతకాలపు పురాణ పురుషులే గొప్ప,
ఇంకెందరో వున్నారు సృజనాత్మక ఆదర్శాలకి గొప్ప.



-దేవనపల్లి ఓగన్న
సెల్: 07972289784

## సంచార కైతికాలు

గంప నెత్తిన ఎత్తెనిక
బతుకున దారిలేక
పేరు గొప్ప తెలియక
పథకాల దరిచేరక
వారెవ్వా జీవుడా!
సంచారి సమరుడా.

పల్లె ఊసుల గమనంన
నెత్తిన గంపే మాకు
ఆధారమై వర్ధిల్లె
గొంతుతో సాగు మాకు
వ్యాపారం చతికిలపడి
ఉత్సాహమే కరువాయె!

ఆదివాసి బిడ్డలమే
మనుగడకై సమరమే
అవని ఎదపై అల్లిన
బంధాల తీగలమే
వారెవ్వా !ఆదిమ చరితం
నిత్యం ఆడవి బిడ్డలమే

మట్టి గాజు ఆధారం
మట్టే మాకానందం
పుడమి గర్భం నుండి
పుట్టిన ప్రేమానందం
వారెవ్వా !మట్టి బంధం
అడగడుగున అమితానందం.

-పగిడిపల్లి సురేందర్ పూసల
8074846063

## నిజాయి!!

అందరాని చందమామలాయె
ఉల్లి ఆలూ టమాటలు ధర ధరణి దాటి
మాటలక్షరాలైంది నీ వల్లే
సావాసమూ సాహితీ సోపానమంటే నమ్మర్లే
అల్లునోట్లో శని
ట్రాఫిక్ చిక్కుల్లో రోడ్లు సిగ్నళ్ళు సిబ్బంది
నరకం?
నగర రాదారుల్లో?
తనదాకా వస్తేనే తెల్సేది
వేగానికి చెల్లించే మూల్యం జీవితమని
కరువులో రైతు సేద్యం
కన్నీటి కాల్వలే కడు దయనీయం
కల్తీ,కాలుష్యం...
మానవాళికి ఆత్మహత్యా సదృశం
మనసాక శిథిలసౌధం
అంతర్జాలంలో.,వింతపోకడలతో

ఎగిరే పక్షెరుగదు స్వేచ్ఛ
పంజరంలో బంధీఅయ్యేవరకూ
బంధువులూ బందూకులే
వావి వయసు ఎంచక కామాంధులై పందులై
చుట్టూ బ్రహ్మజెముళ్ళూ.,యముళ్ళూ
పసిబాలికల మానప్రాణాలు హరిస్తూ
అత్యాచారం ఆచారమైంది
నిత్య కామపైత్య ప్రకోపకులకు
వెనిజులా డబ్బు నీళ్ళప్రాయం
చెన్నైలో నీళ్ళూ డబ్బుకన్న ప్రియం
బహిర్భూమి బాలికల కలే..!
వసతీయలేని ప్రభుతలు మరీచికలే.



-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

# ప్రభుత్వ శాఖల నిర్మాణం- పునర్నిర్మాణం



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
ఛైర్మన్, బీసీ కమిషన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

ఇటీవల రెవిన్యూ శాఖ గురించి అనేక కథనాలు వెలువడుతున్నాయి. ప్రజలకు ఇవి కొత్త కాదు కానీ, ఇంత పెద్ద ఎత్తున అనేక కోణాల్లో చర్చనీయాంశం కావడం ద్వారా అనేక ఆలోచనలకు దారి తీస్తున్నది. స్వయంగా ముఖ్యమంత్రి కేసిఆర్ జిల్లా స్థాయి పరిపాలనా శాఖలను సమూలంగా మార్చాలని పలుమార్లు ప్రకటించారు. నిజానికి ఈ ఆలోచన కొత్తది కాదు. కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగానే ఈ ఆలోచన చేశారు. పరిపాలనా వ్యవస్థను, అన్ని శాఖలను ప్రజలకు మరింత దగ్గరగా, మరింత సమీపంగా సేవలు అందించడానికి విస్తృతంగా పెరిగిపోయిన శాఖలను వీలైనమేరకు కలిపేయాలనుకున్నారు. అందువల్ల 1885 మొదటి సాలార్‌జంగ్ సంస్కరణలు, 1919, మింటేమార్లే సంస్కరణలు 1935 నాటి బ్రిటీష్, నైజాం రాజ్యాల పరిపాలనా సంస్కరణలు ఎలా ఉండేవో అవి కాలక్రమంలో ఎలా విస్తరించాయో అధ్యయనం చేశారు. స్వాతంత్ర్యానంతరం ఆయా శాఖల విస్తరణ పెరిగింది. ఎన్నికల కమిషన్, శాంతిభద్రతల పరిరక్షణ, జనాభా లెక్కల కమిషన్, ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి, సంక్షేమం గురించిన శాఖలు అభివృద్ధి చెందాయి. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) ప్రజా పనుల శాఖ కింద నేటి అనేక రోడ్లు, భవనాలు, మంచినీటి సరఫరా శాఖలు, రోడ్లవెంట బావుల తొవ్వకం, చెట్ల పెంపకం వంటి ఎన్నో కొనసాగుతూ వచ్చాయి. విద్యాశాఖ ఈనాడు అనేక శాఖలుగా విస్తరించింది. గతంలో డిపిఐ (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్) అనే శాఖ కింద అనేక శాఖలు ఉండేవి. రెవిన్యూ శాఖ కిందే ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, పోలీసు డిపార్ట్‌మెంట్, ప్రమాదాల నుండి రక్షణ, వరదలు, కరువుల నివారణ, భూముల రికార్డులు, వివిధ పంటల విస్తీర్ణం, వ్యవసాయ శాఖ, వైద్య శాఖ మొదలైనవి ఉండేవి.

కాలక్రమంలో ప్రభుత్వ ఆదాయం పెరిగిన కొద్దీ, జనాభా పెరిగిన కొద్దీ, ప్రభుత్వ సేవలు విస్తరిస్తున్నకొద్దీ, అనేక శాఖలు ప్రత్యేక శాఖలుగా ఎదిగాయి. అయినప్పటికీ జిల్లాస్థాయిలో అంతిమంగా జిల్లా పరిపాలనా అధికారి, మెజిస్ట్రేటు అదుపు అధికారం కలిగి ఉంటూ రావడం జరిగింది. 1956లో రాష్ట్రాల పునర్విభజనతో దేశంలో 565 సంస్థానాలు, నిజాం వంటి రాజ్యాలు కలిపి పునర్విభజించి 14 రాష్ట్రాలుగా, కొన్ని ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ స్వరాజ్యం, గ్రామీణ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు, పంచవర్ష ప్రణాళికలు ముందుకు వచ్చాయి. పంచవర్ష ప్రణాళికల రూపకల్పనకు కేంద్ర ప్రణాళికా సంఘం ఏర్పడింది. పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించి అమలులోకి వచ్చినవాటిని ప్లాన్ బడ్జెట్ అని పిలిచేవారు. ఐదేళ్ళు గడిచాక మరో పంచవర్ష ప్రణాళిక అమల్లోకి వచ్చినప్పుడు అంతకుముందటి పంచవర్ష ప్రణాళిక కింద అమలవుతున్న పథకాన్ని, సిబ్బందిని, వ్యయాన్ని ప్లాన్ అనే పద్దునుంచి శాశ్వతంగా కొనసాగించడానికి నాన్‌ప్లాన్‌గా మార్చేవారు.

నాన్‌ప్లాన్ బడ్జెట్ అంటే ఇక దాన్ని రద్దు చేయడానికి వీలులేని నిరంతరం కొనసాగించే అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా సిబ్బంది, పరిపాలనా శాఖలు అని అర్థం. ఇలా కొన్ని నాన్ ప్లాన్‌గా మార్చడం వీలుకానివాటిని, అలాంటి సిబ్బందిని వర్క్ ఛార్జ్‌డ్ సిబ్బంది అని పిలిచేవారు. సాధారణంగా నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వంటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో పనిచేసే సిబ్బందిలో చాలామందిని వర్క్ చార్జ్‌డ్ సిబ్బందిగా పిలిచేవారు. కాలక్రమంలో వారు ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వ సిబ్బందిగా పరిగణించబడ్డారు. 010 అనే పద్దుకింద వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగులు. వారికి ప్రభుత్వ ఖజానా నుండి జీతాలు ప్రభుత్వం చెల్లిస్తుంది. 020 మరియు 057 అనే పద్దుకింద జీతభత్యాలు పొందేవారు, బిల్లుల ద్వారా కాకుండా, చెక్కుల ద్వారా జీతభత్యాలు పొందుతూ పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా, విభిన్న స్థాయిల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించబడేవారు.

1959లో జిల్లా బోర్డులు ఏర్పడ్డాయి. ఆ వెంటనే వాటిని జిల్లా పరిషత్‌లుగా కింది స్థాయిలో పంచాయితీ సమితులుగా, గ్రామ పంచాయితీలుగా పునర్నిర్మాణం చేయడం జరిగింది. ఇది 1885 నాటి మొదటి సాలార్‌జంగ్ సంస్కరణలు, 1919, 1935 బ్రిటిష్ పరిపాలనా సంస్కరణలు, రాజ్యాంగ రూపకల్పనల కన్నా భిన్నమైనవి. లేదా వాటికి సమాంతరంగా ముందుకు వచ్చిన వ్యవస్థలు. అలా జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, పంచాయితీ సమితులు మొదలైనవాటికి ప్రభుత్వం ప్రణాళికా సంఘం ద్వారా, బడ్జెట్ల ద్వారా నిధులను సమకూర్చుకుంది. అనేక అభివృద్ధి పథకాలను, సంక్షేమ పథకాలను, జిల్లా పరిషత్ కింద విస్తరించడం జరిగింది. జిల్లా శాఖా గ్రంథాలయాలు, తాలూకా శాఖా గ్రంథాలయాలు, మంచినీటి సరఫరా, గ్రామీణ రోడ్ల అభివృద్ధి, గ్రామీణ ప్రాథమిక వైద్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, పశు వైద్యశాలలు, అంగన్‌వాడీలు మొదలైనవి అనేకం జిల్లా పరిషత్, పంచాయితీ సమితి, గ్రామ పంచాయితీ పరిధిలో విస్తరించబడ్డాయి. అలా జిల్లా పరిషత్, గ్రామీణ అభివృద్ధి సంక్షేమ శాఖలకు షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి సంబంధించిన కాంపోనెంట్ ఫండ్స్ కూడా తోడయ్యాయి. ఇలా స్థానిక సంస్థల ఏర్పాటుతో దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. సర్పంచ్, పంచాయితీ సమితి ప్రెసిడెంట్, జిల్లా పరిషత్ ఛైర్మన్ వంటి రాజకీయ నాయకత్వం సృష్టించబడుతూ వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ప్రాథమిక విద్య, ఉన్నత విద్య ప్రజలకు విస్తృతంగా ఉచిత విద్యగా అందుబాటులోకి వచ్చింది. అలా జిల్లా పరిషత్ ఏర్పడ్డ తర్వాత, పురపాలక, నగరపాలక వ్యవస్థల్లోను, గిరిజన ప్రాంతాల్లోను, విద్య తదితర శాఖలు విస్తరించాయి.

1959 నుండి విద్యారంగం విస్తరించి కులవృత్తుల ప్రాభవం తగ్గడం, పారిశ్రామిక ఉత్పత్తులు గ్రామ గ్రామానికి చేరడం మరోవైపు తొలితరం విద్యావంతులు ఎదగడం వేగం పుంజుకుంది. 1967 నాటికే ఈ నూతన తరాలు, నూతన మార్కెట్ వ్యవస్థ, కులవృత్తుల పతనం, నూతన విద్యావంతుల బృందాలు పెరిగి, పెరిగి దేశంలో అశాంతికి అల్లకల్లోలానికి దారి తీశాయి. అవి 1967 పార్లమెంటు, అసెంబ్లీల ఎన్నికల్లో ప్రతిఫలించి సగానికి పైగా రాష్ట్రాల్లో కాంగ్రెసు ఓడించబడింది ఇతర పార్టీలను ప్రజలు అధికారంలోకి తెచ్చుకున్నారు. తెలంగాణలోను దీని ప్రతిఫలాలు మొదలై, 1968-69 నుండి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంగా విస్తరించింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక పోవడంతో యువతరంలో కొంతభాగం నక్సలైట్ ఉద్యమం నిర్మించడానికి పూనుకున్నారు.

మరోవైపు ప్రభుత్వ శాఖలు విస్తరిస్తూ వచ్చాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పర్యవసానంగా దేశ వ్యాప్తంగా, అశాంతి పర్యవసానంగా 1973లో హాఫ్ ఎ మిలియన్ జాబ్ (ఐదు లక్షల ఉద్యోగాల కల్పన) అనే పథకం ముందుకు వచ్చింది. డిగ్రీలోపు చదివిన వారికి 125 రూపాయలు, డిగ్రీ చదివినవారికి 150 రూపాయలు జీతం తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోవడం జరిగింది. ఐదేళ్ళ తర్వాత ఉద్యమాల ఫలితంగా వీరుకూడా పూర్తిస్థాయి ఉద్యోగులుగా పరిగణించబడ్డారు. అలా ప్రభుత్వ ఉద్యోగులు, జిల్లా పరిషత్, పంచాయితీ సమితి శాఖల ఉద్యోగులకంటే పెరుగుతూ పోయింది. రాజకీయాలలో అందరిని సర్దుబాటు చేయడానికి అవసరం ఉన్నా, లేకపోయినా అనేక కొత్త శాఖలను సృష్టించి మంత్రి పదవులు కట్టబెట్టడం జరిగింది. అవి చాలక, ప్రభుత్వం పెట్టుబడులతో అవసరమున్నవి కొన్ని, అవసరం లేనివి కొన్ని, ప్రభుత్వ కార్పొరేషన్లు వంటివి ఏర్పాటు చేసి, వాటికి ఛైర్మన్‌లను నామినేట్ చేయడం జరిగింది. ఛైర్మన్‌లు, మంత్రి పదవి రానివారు, ఎన్నికల్లో ఓడిపోయినవారు మొదలైన అస్మదీయులకు పీట వేయడానికి ఉపయోగపడ్డాయి. తెలంగాణ ఉద్యమంతో 371డి రాజ్యాంగ సవరణతో రాష్ట్రంలో ఆరు జోన్లు ఏర్పడ్డాయి. ఐదో జోను, ఆరో జోను తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడింది. కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అనేక భారీ ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించడం జరిగింది. హౌజింగ్ బోర్డు వేలాది ఇండ్లను నిర్మించి ఇవ్వడం జరిగింది. మార్క్‌ఫెడ్, డిసిఎమ్ఎస్ వంటి సంస్థలు గిట్టుబాటు ధరల కోసం ఆహారాన్ని సేకరించి రైతులను ఆదుకోవడం కోసం ఏర్పడి కొనసాగాయి.

కొందరు కాంట్రాక్టుల కోసం కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్‌ను రద్దు చేయడం జరిగింది. అలాగే ఆయా ప్రాజెక్టుల కింద పనిచేసే సిబ్బంది, ఇంజనీర్లు, వర్క్ చార్జ్ ఇంజనీర్లు, ఇతర శాఖల్లోకి బదిలీ చేసి సర్దుబాటు చేయడం జరిగింది. టిడిపి ప్రయివేటీకరణ ప్రారంభించి ప్రతిష్ఠాత్మకమైన అల్విన్ సంస్థలనుండి ఆసియాలో పేరెన్నికగన్న బోధన్ నిజాం షుగర్స్ దాకా 70కి పైగా పరిశ్రమలను, సంస్థలను ప్రయివేటీకరించడం జరిగింది. ఉద్యోగులను తగ్గించారు. కార్పొరేషన్లు, సంస్థలు, రాజకీయ నియామకాల కారణంగా చాలామేరకు నష్టాల పాలు కావడం, అవినీతి కేంద్రాలుగా మారడంవల్ల అప్పుడప్పుడు కొన్నిటిని రద్దు చేస్తూ రావడం జరిగింది.

రెవెన్యు శాఖల అధికార దాహం: ఇలా 1885 సాలార్‌జంగ్ సంస్కరణలు, 1919, 1935, బ్రిటీష్ పరిపాలనా సంస్కరణలు, నూతన చట్టాలు క్రమక్రమంగా ప్రభుత్వ శాఖలు, అధికారాలు విస్తరిస్తూ పోయాయి. ఒకప్పుడు ఊర్లోకి వస్తే ఎడ్లబండికి పన్నులు చేసేవారు. తార్నాక, గోల్నాక, కాన్‌చీటి వంటి పేర్లు ఈ పన్ను వసూలు చేసే ఔట్ పోస్ట్‌లు. ఒకప్పుడు మున్సిపాలిటీలు సైకిల్‌కు ఏడాదికి రెండు రూపాయలు పన్ను వసూలు చేసేది. రేడియోకు కేంద్ర ప్రభుత్వం యేడాదికి 15 రూపాయలు లైసెన్స్ ఫీజు వసూలు చేసేది. వ్యవసాయం పై ప్రభుత్వం ఎకరానికి రూపాయి, రెండు రూపాయలు పన్ను వసూలు చేసేది. చెరువుల పారకం, కాల్వల పారకం కింద ఉన్న భూములకు పన్ను కొంత ఎక్కువగా ఉండేది. ఈ పన్నును కాలక్రమంలో రద్దు చేయడం జరిగింది. ప్రభుత్వం మాకు కూడా పొలాలకు ఉచితంగా నీరందించాలి. అందుకని వ్యవసాయ భావులకు ఉచిత కరెంటు ఇవ్వాలి అనే ఉద్యమంతో సాధించుకున్నారు. ఇలా ఉచిత వైద్యం, ఉచిత విద్య, ఉచిత కరెంటు, ఆసరా పథకం, ఉచిత హాస్టల్, భోజన వసతి మొదలైనవి విస్తరించాయి. కేవలం వ్యవసాయంపై వచ్చే ఆదాయంతో బతికిన కాలం పోయి, భూమి శిస్తు రద్దు చేయబడింది. వ్యవసాయానికే ఎకరాకు 5వేలు ఆసరా ఇవ్వడం మొదలైంది. పరిపాలన శాఖగా మారుతూ వచ్చింది. వ్యవసాయ శాఖ విస్తరించింది. రిజిస్ట్రేషన్ల శాఖ విస్తరించింది. ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రమాదాల నుండి రక్షణ, శాంతి భద్రతలు, స్టాంపులు, పొదుపు మొదలైనవి రెవిన్యూ శాఖకు మిగిలిపోయాయి. ఒక మొత్తంమీద జిల్లా కలెక్టర్ అధికారం, తాహసిల్‌దారు అధికారం సాంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. అలా మున్సిపాలిటీల పరిధిలోకి వచ్చిన భూములపై కూడా తమకు హక్కు ఉందని సుప్రీంకోర్టుకు పోయి సాధించుకున్నారు. రెవిన్యూ వారికి అధికారం, రుచి బాగా తెలిసి వచ్చింది. అధికార దాహం పెరిగిపోయింది.

**ఇటీవల రెవిన్యూ శాఖ గురించి అనేక కథనాలు వెలువడుతున్నాయి. ప్రజలకు ఇవి కొత్త కాదు కానీ, ఇంత పెద్ద ఎత్తున అనేక కోణాల్లో చర్చనీయాంశం కావడం ద్వారా అనేక ఆలోచనలకు దారి తీస్తున్నది.**

రాష్ట్రంలో సచివాలయంలో సమస్త అధికారులు ఉంటారు. జి.ఎ.డి, ఛీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీ వంటి పేర్లు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయాలు కూడా నేడు జిల్లా సెక్రటేరియేట్, జిల్లా సచివాలయమే. ఆయా జిల్లా అధికారులను, కలెక్టర్లను, జిల్లా గవర్నర్/జిల్లా పరిపాలనా అధికారి/ జిల్లా మెజిస్ట్రేటు ఇతర రాష్ట్రాల వలె జిల్లా కమిషనర్, లేదా సెక్రటేరియేట్‌లవలె ముఖ్య కార్యదర్శి వంటి పేర్లతో కింది స్థాయి సిబ్బంది దాకా మార్చుకొంటూ రావచ్చు. అనేక శాఖలను ఆయా శాఖల నుండి ప్రధాన శాఖకు, ప్రధాన శాఖ నుండి ఇతర శాఖకు ఎప్పటికప్పుడు బదిలీ చేసే విధానం అవసరం. రాష్ట్ర ప్రభుత్వానికి జిఏడి వలె జిల్లా జిఏడిగా పునర్నిర్మాణం చేయడం ద్వారా రెవిన్యూ శాఖ, కలెక్టరేట్, నూతన స్వరూప స్వభావాలు సంతరించుకోవాల్సి ఉంది. ఇందుకు అనేక అధ్యయనాలు చేస్తున్న కేసిఆర్ కాలానుగుణంగా ఒక కొత్త వ్యవస్థను రూపొందించి దేశానికి మార్గదర్శకంగా నిలుస్తారు అనడంలో సందేహం లేదు.

# శనీచరి వ్యధ

## మహాశ్వేతాదేవి

మహాశ్వేతాదేవి 14.01.1926లో ఎగువ మధ్యతరగతి కుటుంబంలో ఢాకాలో జన్మించారు. 28 జూలై 2016 న మరణించారు. తండ్రి మనీష్ ఘటక్ రచయిత, తల్లి ధరిత్రిదేవి రచయిత్రి. అనువాదకురాలు, సామాజిక కార్యకర్త. వీరికి మహాశ్వేతతో కలిపి తొమ్మిది మంది సంతానం.

గిరిజనుల జీవితాను, పోరాటాలను వారిపై కొనసాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా వారు చేసే ఆందోళనలను తన సాహిత్యం ద్వారా తెలిపిన విలక్షణమైన రచయిత్రి మహాశ్వేతాదేవి. స్వయంగా చూసిన, జరిగిన సంఘటనలన్నింటిని ఆమె కథలుగా మలిచారు.

శనివారం పుట్టినందుకు శని, ఆదివారం పుట్టినందుకు ఎతోవా, మంగళవారం పుట్టిన మూంగ్రీ, బుధవారం పుట్టిన బుధువా, గురువారం పుట్టిన బిశ్రి, ఇలా ఆదివాసులు పిల్లలు పుట్టిన 'రోజు'ను బట్టి పేర్లు పెడుతారు. ఈ కథలోని శనీచరి శనివారం పుట్టింది కనుక శనీచరి అయింది.

పన్నెండు సంవత్సరాల శనీచరి ఎంగ్ ఆజ్జీతో తోహరీ సంతకు వెళ్తుంది. పెద్దమ్మ చెప్పే కథలు వింటూ కంపార్టుమెంటు కిటికి దగ్గర కూచుని బయటకు చూస్తు ఇవ్వాళ ఎంత బాగుందో మేకల్ని కాయనవసరం లేదు, కట్టెపుల్లల్ని చిదుకుల్ని ఏరుకు తేవాల్సిన అవసరం లేదు. ఇంటి దగ్గర వంట చేయనక్కర లేదనకుంటున్న చిన్ని మనసులో పనుల ఆలోచనలకు కళ్ళలో బొగ్గు పడుతుందంటు హీరాలాల్ చేసిన హెచ్చరికతో సర్దుకొని కూర్చుంటుంది.

హీరాలాల్ రైలు బండ్లలో మెడలో హార్మోనియం పెట్టెను వేలాడేసుకొని పాటలు పాడుతూ అడుగుతుంటాడు. 'నువ్వు మోతిలిండా కూతురివి కదా అని, నేను మంగ్రూకి శిక్ష పడింది విడుదలయ్యాడా' అని అడుగు తాడు.

జైలుకెళ్ళి వచ్చినవారు ఊరిఊరికి సహపంక్తి భోజనాలు పెట్టాలికదా పెట్టాడా? సంపా దనకై కలకత్తా లోని 'ఇటికావ ముల్లో' పనిచేయడానికి వెళ్ళాడం టుంది. ఇది విన్న గోహుమన్, మంచిపని చేశాడు, ఇక్కడుంటే కాల్చుకోవడం తప్ప ఏమీ లేదంటుంది.

ఆమె విషయం తెలిసిన హీరాలాల్ వల విసిరావుగా నందిని ముందుగా పంపావు వాకబు చేసి ఏ వూళ్ళో ఎందరు ఆడపిల్లలున్నారో తెలుసుకొని కలకత్తా వెళ్ళి డబ్బులు తీసుకొని వచ్చి, గ్రామల్లోకి వెళ్ళి ఆడపిల్లల్ని కొట్టకండంటూ ఇటుక వాములున్న కలకత్తాకు తీసుకువెళ్తూ మీకు డబ్బులు, బట్టలు దొరుకుతాయని ఆశచూపుతూవుంటు, నువ్వు గోధుమ తాచువని, అది విషం కక్కుతుందని, నిన్ను అంటుకుంటేనే విషమంటు, నీకు ఒక్కో అమ్మా యికి ఇరవై రూపాయలి స్తాడంటాడు.

గ్రామల్లో ఆడకూతుర్లకి తిండిలేక నానా అవస్థలు పడుతుంటే వారికి నేను పని ఇప్పిస్తున్నానంటు సమర్థించు కుంటుంది. మొదట్లో యజమానికి ఉంపుడగత్తెవి. ఇప్పుడాపని కొత్తవాళ్ళకి పురమాయిస్తున్నా వంటూ పాపం చేయిస్తున్నావంటూ విరుచుకు పడతాడు.

వీరి సంభాషణ వింటున్న శనీచరితో హీరాలాల్ ఈవిడ మీ పెద్దమ్మా, నాయనమ్మో గాని తోహరి చేరుకున్నాక ఈ గోహుమన్ గ్రామంలో అడుగుపెట్టగానే ఆడపిల్లల్ని తరిమేయమనడంతో ఇలాంటి మాటలు ఎన్నోసార్లు విన్నామంటుంది గోహుమన్.

ఈవిడ నీడలో గోధుమతాచు విషం ఉంది. జాగ్రత్తని శనీచరికి చెప్పడంతో, మూడు పైసల



వాయిద్య గానివి నువ్వు నాకు కబుర్లు చెబుతవా అంటుంది గోహుమన్.

తోహరిలో దిగగానే గోహుమన్ బీబీ
ఏయ్ పిల్లా! పద పద పద
కలకత్తా వెళ్దామా పద పద
రైలెక్కి వెళ్దామా పద పద మంటు పాడుతూ ఎవర్నో వెతుకుతున్నట్టు కనిపిస్తుంది. పెద్దమ్మ చేయి పట్టుకొని దిగిన శనీచరిని ఏయ్ పిల్లా! ఇలారా! మిఠాయి ఇస్తానంటు పిలుస్తుంటే నాకొద్దంటు వెళ్తుంది. అలా ఆ గ్రామం నుండి ఎందరో ఆడపిల్లల్ని కలకత్తాకు తీసుకువెళ్తుంది.

మండుటెండలతో తీవ్ర కరువు కాటకాలతో పండని ధాన్యం, అడవిలో పుట్టి ఎండిపోయి, తినేందుకు కందమూలాలు కూడా దొరకని సమయంలో సరిగ్గా సంతనాడు దిగిన గోహుమన్ చప్పట్లు చరుస్తు ఆడపిల్లల్ని పిలిచి, వచ్చిన వాళ్ళందరికి కడుపునిండ తినిపించి, కూలిపని కావలసినవాళ్ళు కలకత్తా రమ్మంటు, మా యజమాని దేవుడు, తీసుకెళ్ళిన కూలీలకు పట్నం చూపించి ఇటికవాముల్లో పని ఇస్తారని, పని నాలుగ్గంటలే ఉంటుంది. రోజు కూలి పది రూపాయలు, తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్టలు యజమానే ఇస్తాడంటుంటె, వస్తామన్న ఆడపిల్లలను యిక్కడే లాల్‌పూర్‌లో రైలు పట్టాల పక్కనే మా యిల్లు అక్కడే వుంటానంటు, నేను చేసే పని పక్కాగ చేస్తానంటు మీ అమ్మా నాన్నలకు చెప్పి రమ్మంటు వాళ్ళ అమాయకతతో ఒక 50 రూపాయలు అడ్వాన్సంటు ఇచ్చి తెల్ల కాగితాల మీద వేలిముద్రలు పెట్టించుకొని ఆడపిల్లల్ని తీసుకొని గోహుమన్ బీబీ వెళ్ళిపోయింది. అలా వెళ్ళిన పిల్లలు మళ్ళీ తిరిగి రాలేదు. అలా శనీచరి గోహుమన్ చూడకుండా బయటప డింది. అయినా తల్లులు

“కలకత్తా యిటికాము - పిలుస్తోంది బిడ్డను
ఎల్లెల్లి పోతుంది - రైలుబండి ఎక్కి” అంటూ పాడుకుంటూనే ఉంటారు. అక్కలు వెళ్ళినప్పుడు చిన్నపిల్లలుగా ఉన్న తమ్ముళ్ళు ఎదిగి రాక్షసబొగ్గు కొట్టే బెల్బాల్లా ఎదిగారు. అప్పటి మొక్కలు మహావృక్షాలై ఫలాలిస్తున్నాయంటే ఆ విధంగా వెళ్ళిన పిల్లలను అందరు మరచిపో యారు. కలకత్తా ఇటికాముల కెళ్ళిన మంగ్రూ, ఓంలాల్ కూడా మళ్ళీ గ్రామానికి తిరిగి రాలేదు. అసలు వారిని గురించి పట్టించుకొని ఆరా తీసేవాళ్ళే ఉండరు.

శనీచరికి పదహారేళ్ళు ఎక్కడి సంతలకైనా ఒంటరిగా వెళ్ళి పనులు చక్కబెట్టుకొచ్చి తల్లిదండ్రులకు తోడ్పడుతోంది. అలా 'రాతా' సంతకు వెళ్ళిన శనీచరికి తల నెరసి, కళ్ళకి కళ్ళజోడు, హార్మోనియం వాయిస్తు పాటపాడుతున్న హీరాలాల్‌ను చూసి ఆగిపోతుంది. ఆమెను గుర్తుపట్టిన హీరాలాల్ ఆమె వివరాలడిగి గోహుమన్ నిన్ను కాటేయలేదనగానే, మళ్ళీ రాలేదంటున్న శనీచరితో తప్పక వస్తుంది. అందరు అన్నీ మరచిపోయాక వస్తుందంటే వెళ్ళిన ఆడపిల్లల్ని ఏం చేస్తుందంటున్న శనీచరితో రాంచీ, పలామూ, సింగ్ భూమి నుండి తీసుకెళ్ళిన పిల్లలను కొందరిని సానులుగా మారుస్తుంది. కొందరిని అమ్మివేస్తుందంటాడు.

ఆ తరువాత రెండు సంవత్సరా లకు చాంద్ తరకాలో “ఆదిజాతి రక్షా మోర్చా” నాయకత్వంలో జరిగిన అల్లర్లలో గిరిజనులను అనేక మందిని పోలీసులు కాల్చిచంపి, పదకొండు శవాలను మాత్రమే ఆసుపత్రిలో వుంచి మిగతావారిని ఫర్నేస్‌లోకి విసిరేసి పత్రికలలో వార్తలు రాకుండా చేసి 'రాతా' చుట్టూ సెక్యూరిటీ పెడతాడు.

పోలీసులు రాతా గ్రామాన్ని సర్వనాశనం చేసి ఇండ్లను తగలబెట్టడంతో ఎదిగీ ఎదగని ఆడపిల్లలందరు కట్టుబట్టల్లేక అల్లాడుతుంటే దొరికిన ఆడపిల్ల లందరిని మానభంగాలు చేశారు.

అలాంటి సమయంలో వచ్చిన గోహుమన్ ఎంగిలి తినడానికి సిద్ధపడినవారిలో శనీచరి కూడా చేరిపోయింది.

ఇటుకాములోకి మళ్ళీ తెచ్చిన పిల్లలతో ఎదురుపడ్డ గోహుమన్‌ను అసహ్యించుకుంటుంది శనీచరి.

అలా వెళ్ళిన శనీచరి రహమత్ (ఇటికాముల యజమాని) స్వంతమ వుతుంది. హోళీ రోజున ఆడపిల్ల లకు బాగా తాగించి ఇష్టమైనట్లు అందరు వాడుకుంటారు.

వాంతి చేసుకుంటున్న శనీచరి తో రహమత్ పనికి వెళ్ళిపొమ్మని జోషిన అనే ఆడకూలిని పిలుచుకు ంటాడు. రహమత్ అంకురాన్ని మోస్తున్న శనీచరి పరిపరివిధాల ఆలోచించినా దుర్మార్గుని కొడుకుని తీసుకొని ఇంటి మొహం ఎలా చూడాలనుకుంటుంది. శనీచరి ఒక్కతే గర్భవతి. మిగతా అందరికి గోహుమన్ మందులు తాగించి గర్భాలు రాకుండా చేస్తుంది.

ఇటికాము మూతపడటంతో వాళ్ళకు వచ్చే డబ్బులు ఇవ్వకుం డానే ట్రక్కుల్లో ఇళ్ళకు పంపాడు రహమత్.

ఇంటికి వెళ్ళిన శనీచరిని ఆదివాసీ సమాజం స్వీకరించక, ప్రాయశ్చిత్తం జరిపింది. కాని భవిష్యత్తు ఆలోచించిన శనీచరి వేరే ఇంట్లో వుంటు, రైలు పట్టాల మీద నుంచి రాక్షసబొగ్గులు ఏరి అమ్ముకుంటు గడుపుతూవుంటుంది.

అలా గోహుమన్ వస్తు వెళ్తూనే వున్నా సమాజం ఆలోచిస్తునే వుంది. ఆడపిల్లలను ఇటికాములకు పంపుతూనే వుంది.

అలా ఒకరోజు కనిపించిన హీరాలాల్‌తో గోహుమన్ బీబీ కూడా నిజానికి గోధుమత్రాచు కాదు. ఆమెను అర్థం చేసుకున్నా నంటుంది శనీచరి.

ఎవరు కారణమన్న ప్రశ్నకు సమాజాన్ని చూపుతుంది. నిరాట ంకంగా అందరి అండలతో సాగే ఈ విధానం అంతమయ్యే వరకు గిరిజనుల జీవితాలలో వెలుగు రాదంటు తాను స్వయంగా చూస్తు గిరిజనులతో మమేకమై వారిని బాగుచేయాలన్న ఆలోచనలున్నా అది జరిగే పని కాదనుకుంటూ ఏదో ఒకరోజు మంచి రోజు వస్తుందని ఎదురు చూస్తుంటుంది శనీచరి.

(28 జూలై 2019 మహాశ్వేతాదేవి 3వ వర్ధంతి సందర్భంగా)



-డా॥ బండారి సుజాత
9959771228



# “దండమయా విశ్వంభర”

డా॥ సినారెగారి 88వ జయంతి సందర్భంగా అక్షరాంజలి. శ్రీలువిలసిల్లు మన పవిత్ర భారతావనిలో తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్లా జిల్లా హనుమాజీపేటలో శ్రీమతి సింగిరెడ్డి బుచ్చమ్మ, శ్రీ సింగిరెడ్డి మల్లారెడ్డి పుణ్య దంపతులకు పురాకృత పుణ్యఫలంగా 1931 జులై 29 గురుపూర్ణిమ రోజున జగత్ గురువువలె ప్రాదుర్భవించి దిన దిన ప్రవర్ధమానమై “సినారె”గా జగత్ ప్రసిద్ధమై దేదీప్యమానముగా వెలుగొందుచు మహోన్నత శిఖరాల నదిరోహించిన మానవతామూర్తి డా॥సి. నారాయణరెడ్డిగారు. సాహితీ నందనోద్యానవనంలో వికసించిన పారిజాతం. యవ్వన దశనుండే సాహితీరంగంలో తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రజ్ఞాశాలి. సాహిత్యాన్ని, పద్యం, గద్యం, గేయం, వచనం, కథలు, అనువాదాలు, బుర్రకథలు, విమర్శలు, నాటకాలు, గజల్లు, ముక్తకాలు, పాటలు, సినీగీతాలు మున్నగు అనేకానేక ప్రక్రియల్లో కవిత్వాన్ని ఉరకలు వేయించి ఉర్రూతలూగించిన మహాకావ్యాలు. చిరస్మరణీయాలు. సహజమైభాషిల్లు మంజుల భాషణము “సినారె”గారి భూషణము. భావబంధురమైన భాషా పటిమతో రమణీయ భావాలతో కమనీయ కావ్యాలు రచించి తెలుగుభాషకు వెలుగులు నింపిన కవి వరుండు, సకల శాస్త్ర కోవిదుండు. అనవద్య హృద్య కమనీయ కవితా ధారలను వర్షింజేసి, సురుచిర, సుమధుర పదబంధములతో సముచిత పదగుంఫనములతో శబ్దార్థ వైచిత్య విన్యాసాలతో, అర్థగాంభీర్యం, భావోద్వేగం ఔచిత్యభరిత, శబ్ద ప్రయోగాలతో సాహితీ ప్రపంచాన్ని ఓలలాడించిన మహాకవి. సంప్రదాయ కవితా వాహినికి, ధారాశుద్ధి శోభితమైన నవజీవన గమ్యం సమకూర్చిన కవి వరేణ్యులు, సంస్కారవంతమైన కవితలతో ఎందరో శిష్యకోటికి మార్గదర్శకులైన “సాహితీ సమరాంగన సార్వభౌములు” అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కృతులు డా॥ సి. నారాయణరెడ్డిగారి 88వ జయంతి సందర్భంగా “దండమయా విశ్వంభర”యని ప్రణతులిడుచు తెలుగు సాహిత్య కళాపీఠం పక్షాన అక్షరాంజలులు.



- చిక్కా రామదాసు
అధ్యక్షులు తెలుగు సాహిత్య కళాపీఠం
9963770587

## నేటి నిజాలు





డా॥ దాశరథి 95వ జయంతిని సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కూరెళ్ల విఠలాచార్యకు డా॥ దాశరథి అవార్డుతోపాటు రూ.1,00,116 చెక్కు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్న మంత్రులు మహబూబ్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, బి.యస్. రాములు, బాద్మి శివకుమార్, మామిడి హరికృష్ణ తదితరులు.



పిల్లుట్ల కృష్ణయ్య బృందంచే మాన్‌దాత చిందు యక్షగానంను దీక్షితులు వేదికపై మంగళవారం ప్రదర్శించారు. మహాకవులు దాశరథి–సినారె జయంతులను పురస్కరించుకుని రెండోరోజు ఈ కార్యక్రమాన్ని గానసభ అధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ బి. శివకుమార్, కళావీఎస్. జనార్ధనమూర్తి, వంశీరామరాజు, సీహెచ్‌వీ ప్రసాద్‌లు అతిథులుగా పాల్గొని యక్షగాన బృందాన్ని ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'దాశరథి–సినారె' జయంతి వేడుకల్లో ప్రముఖ గాయని పి.సుశీలకు మంగళవారం రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో 'దాశరథి–సినారె' పురస్కార ప్రదానం చేస్తున్న తెలంగాణ శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి. వేదికపై బండారు సుబ్బారావు, యువకళా వాహిని అధ్యక్షుడు వై.కె. నాగేశ్వరరావు, కళా పత్రిక సంపాదకుడు మహ్మద్ రఫీ, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ ఆర్.ఎన్. సింగ్.

# కశ్మీర్‌పై అమెరికా ట్రెంపరితనం!

హైదరాబాద్, జులై 24:కశ్మీర్ విషయంలో ట్రంప్ వ్యాఖ్యల కారణంగా మరోమారు రచ్చ చోటు చేసుకోవడం మంచిదే. ఎందు కంటే ఎప్పటికప్పుడు కాశ్మీర్ విషయంలో మనం అప్రమత్తంగా ఉండాల్సిందే. అలాగే ఈ సమస్య ఎలా వచ్చిందో..దీనికి కారణమెవరో కూడా నేటి ప్రజాప్రతినిధులు సవివరంగా తెలుసుకోవాల్సిందే. పార్లమెంట్ ఉభయసభల్లో ట్రంప్ వ్యాఖ్యలపై దుమారం లేపి రాజకీయ పబ్బం గడుపుకునే పద్దతిలో నేతలు మాట్లాడారే తప్ప కాశ్మీర్‌పై చిత్తశుద్ధితో కాదన్నది ప్రపంచానికి తెలుసు. కాశ్మీర్ సమస్య కావచ్చు...దేశ విభజన కావచ్చు... ఆక్రమిత కాశ్మీర్ వ్యవహారం కావచ్చు.. అన్నింటికీ కారణం స్వాతంత్ర్యం తెచ్చానని గొప్పలకు పోతున్న కాంగ్రెస్ పార్టీదే అని మరోమారు మనం చర్చించుకోవాలి. కాంగ్రెస్ దూరదృష్టి లోపం, భవిష్యత్ దర్శనం లేకపోవడం కారణంగా దేశాన్ని ముక్కలు చేసేందుకు ఆనాడు ఒప్పుకుంది. కాశ్మీర్ విషయంలో పరిష్కారనికి అందివచ్చిన అన్ని అవకాశాలను తుంగలో తొక్కింది. అధికారవే పరమావధిగా నెహ్రూ నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేయని పాపం లేదు. ఈ దేశాన్ని సకల దరిద్రాల్లోకి నెట్టేసిన కాంగ్రెస్‌ను ఎంతగా దునుమాడినా తప్పులేదు.

ఇకపోతే తాజా వివాదంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల పై చర్చించాల్సిందే. ఎందుకంటే ట్రంప్ అదేపనిగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడానికి ఎక్కువగా ఇష్ట పడతారు. ఇతర దేశాల్లో వేలు పెట్టడం ఆయనకు సరదా. వివిధదేశాలతో ట్రంప్ ఎలా వ్యవహరిస్తున్నారో అంతర్జాతీయ పరిస్థితులు అధ్యయనం చేస్తే తెలుస్తుంది. ఇరాన్, చైనా, జపాన్, రష్యా,కొరియాలతో ఇటీవల ఆయన వ్యవహారశైలి ప్రపంచ ప్రజలు అసహ్యించుకునేలా ఉంది. ఆయన ట్రెంపరితనాన్ని పార్లమెంట్ గట్టిగా ఖండించేలా విపక్షాలు చర్చించి ఉంటే బాగుండేది. ట్రంప్ మన అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకున్నందుకు గట్టిగా చివాట్లు పెట్టి ఉంటే ప్రజలు హర్షించే వారు. కానీ విపక్షాలకు కావాల్సింది అదికాదు. ట్రంప్ వ్యాఖ్యల ఆధారంగా మోడీని దునుమాడాలి. అందుకే ఈ వ్యవహారంపై పార్లమెంటు ఉభయ సభల్లో హంగామా సృష్టించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి వాషింగ్టన్‌లో అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహించాల్సింది పోయి ఆయన వ్యాఖ్యల ద్వారా మోడీ సభకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. నిజంగానే అసలు సమస్య ఏంటన్నది చర్చించి ఉంటే బాగుండేది. ఇటీవల జపాన్‌లో జీ–20 సదస్సు సందర్భంగా మోదీ నన్ను కలిశారు. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహించాలని అడిగారని, ఉభయ దేశాలు కోరితే నేను అందుకు సిద్ధం అని, నేను ఏదైనా సాయం చేయగలనంటే చేస్తానని ట్రంప్ వ్యాఖ్యానించినట్లుగా వార్తలు వచ్చాయి. విషయం తెలియగానే భారత్‌లో రగడ మొదలైంది. ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని ప్రధాని కోరడం అనుచితమని, దీనికి మోదీ సమాధానం చెప్పాల్సిందేనని పార్లమెంట్ ఉభయసభల్లో విపక్షాలు పట్టు బట్టాయి. దీంతో విపక్షాల ఆరోపణలను ఖండిస్తూ విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. పాకిస్థాన్ తో ఉన్న వివాదాలన్నింటిని ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న దృఢమైన వైఖరినే తమ ప్రభుత్వమూ కొనసాగిస్తుందని అందులో స్పష్టం చేసింది. అయితే దీనికి విపక్షాలు సంతృప్తి చెందలేదు.

ట్రంప్‌తో ఏం మాట్లాడారన్నది ప్రధాని మోదీయే జాతికి స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. నిజానికి ఈ వ్యవహారంపై రగడ జరుగుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలపై స్వయంగా అమెరికా దిద్దుబాటు చర్యలకు దిగింది.

ఇది ద్వైపాక్షిక అంశమని, దీనిలో తాము తలదూర్చమని తేల్చింది. మధ్యవర్తిత్వం వహించాలని ట్రంప్‌ను మోదీ అసలు అడగనే లేదని,కశ్మీర్ విషయంలో మూడో పక్షం జోక్యానికి తావులేద ని విదేశాంగ మంత్రి స్పష్టం చేశాక కూడా విపక్షాలు గొడవ చేయడం ద్వారా సమస్యను పక్కదారి పట్టించి

రాజకీయ ఎజెండాతో ముందుకు సాగాయి. కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని మోదీ అసలు ట్రంప్‌ను అడగనే లేదని విదేశాంగ మంత్రి జయ్‌శంకర్ సమాధానమిచ్చినా విపక్షాలు శాంతించలేదు సరికదా ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని అనడం ద్వారా సమస్యను చర్చించే అవకాశం కోల్పోయారు. నిజానికి కాశ్మీర్ సమస్యపై చర్చిస్తే కాంగ్రెస్ బండారం బయట పడుతుంది. దేశస్వాతంత్ర్యం మొదలు, దేశ విభజన, కాశ్మీర్ దురాక్రమణ వరకు అనేక విషయాలు బయటకు వస్తాయి. ఇక ఇక్కడ మరో విషయం గమనించాలి. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రతిపాదనను హురియత్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ స్వాగతించారు. కశ్మీర్ సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలన్నదే తమ చిరకాల అభిమతమన్నారు.

కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పేందుకు ఉభయ దేశాలు ఈ మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి అన్నారు. కశ్మీర్ వివాద పరిష్కారం కోసం ప్రధాని మోదీ మధ్యవర్తిత్వం కోరడం స్వాగతించదగిన విషయమని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు.

దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యను పరిష్కరించేందుకు మోదీ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు ఇది నిదర్శనమంటూ ఆయన్ను అభినందించేల మాట్లాడారు.

భారత్, పాక్ శత్రుత్వాన్ని పక్కనపెట్టాల్సిన సమయం వచ్చేసిందన్నారు. నిజానికి ఇది కూడా పూర్తిగా రాజకీయ స్వలాభంతో కూడిన ప్రకటనగానే చూడాలి. వీరికి భారతదేశం కన్నా పాక్ హితమే ముఖ్యం. కాశ్మీర్‌లో నిత్యం నరమేధం సాగుతున్నా పట్టింపులేని ఏలికలు వీరు. ఈ సమస్యపై రాజీలేని కఠిన వైకరి అవలంబించడం మినహా భారత్‌కు మరో మార్గం లేదు. అక్కడ శాంతికి విఘాతం కలిగిస్తున్న విదేశీ ఉగ్రమూకలను ఏరిపారేయడం మినహా మారో మార్గం లేదు. కాశ్మీర్‌ను నిత్యం రావణకాస్టంగా మారుస్తున్న ఉగ్రమూకలకు గట్టిగా బుద్ది చెప్పడం ద్వారా శాంతికి పునాది వేయాలి. అక్కడి ప్రజలు ప్రశాంత జీవనం గడిపేలా చేయాలి

## అక్షయం. ఆ అక్షరం



మట్టి మనిషి మహోన్నతుడు కావాలి
అల్పాత్ముడు చీకటికి నేస్తమంటూ
సమత పంట కోసేందుకే కవీ, సినారే
మానవతా విత్తనాలు
అన్ని పొలాల్లో (ప్రక్రియలు) చల్లావు

మా మాతృభాష తీయనైనదని
తూర్పు భాషల్లో ఇటాలియనని
అక్షరాల్లో చదివాము
నీ గొంతులో విన్నాక.. కవిగాయకా
ఆ తేనెల రుచి ఎంత.. జుర్రుకున్నాము.
భాష మీద మమకారమంతా
నీ కళ్ళల్లో వెలుగులై ప్రవహించేది
నీ గళం ఎలుగెత్తితే
శ్రోతల గుండెలు, చేసే ఆనంద నాట్యంలో
ఎగసిన అశ్రువులు
ప్రేక్షకుల చెక్కిళ్ళపై
జలపాతాలై తకథిమిలాడేవి.
ఆహావభావాలు
ఓ సమ్మోహన మేజిక్ రియలిజమ్!
నువ్వులేని సాహితీ సాయంత్రాలు
మూగబోయిన ఒంటరి సన్నాయిలు!
సినారే, నీ పాట ఓ వన్నెల దొరసాని
తెలుగు హృదయాలనే కాదు
అఖిలభారత పాట ప్రియుల్ని దోచుకుంది.
తెలుగు సాహితీ వనంలో

లక్షల అక్షర వృక్షాలు
కవితా సుమ పరిమళాలు
గేయ నాటికల రసరమ్య చిత్రాలు
గజళ్ళు.. బుర్రకథలు.. ప్రపంచపదులు
అక్షర పంటలే.. బస్తాల నిండా!
'రా.. వెన్నెల దొరా..! అంటూ
వరించింది ద్వితీయ జ్ఞానపీఠం!

ఇప్పుడు మేము..అక్షరాన్ని కోల్పోయిన వాళ్ళం
అమ్మ చేయి విడిచిన చంటి పిల్లలం
మా గుండెల్లో ఆవరించిన శూన్యం
దుఃఖ సాగరం..
కన్నీటి జలపాతం..



– ఝాన్సీ కె.వి. కుమారి
90108 23014

## "అక్షర స్వరాలు నిరంతరాలు"

కన్న తల్లి, మాతృ బాష, పుట్టిన నేల గురించి మమకారం లేని వారు మానవుడే కాదు.. కవి అసలే కాదు.. తెలుగు వెలుగై వెలిగే బ్రతుకై తెలుగు సాహితీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారు. తెలుగు సినిమాకు, పాటలు వ్రాసి, సినీ రంగానికే వన్నె తెచ్చారు. మాట్లాడుతుంటే సాహిత్యం పరవళ్ళు తొక్కుతుంది. ఉర్దూలో వ్రాసిన గజళ్ళు చదువుతుంటే మనస్సు ఉర్రూతలూగుతుంది.

అసలు పేరు సింగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి. స్కూలు రిజిస్టర్‌లో మాత్రం సి.నారాయణరెడ్డిగా పరిగణించబడ్డారు. డాక్టర్ సి నారాయణరెడ్డి గారు జూలై 29, 1931వ సంవత్సరమున కరీంనగర్ జిల్లాలోని మారుమూల గ్రామం హనుమాజీపేట (ప్రస్తుతం సిరిసిల్లా)లో తండ్రి మల్లారెడ్డి, తల్లి బుచ్చమ్మ గార్లకు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం వీధి బడిలోనే సాగింది. ఉర్దూ మాధ్యమంలో, సిరిసిల్లలో మాధ్యమిక విద్య, కరీంనగర్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. ఉస్మానియా యూనివర్శిటీలో బి.ఎ కూడా ఉర్దూ మాధ్యమంలో చదివారు. అదే యూనివర్శిటీ నుండి తెలుగు సాహిత్యంలో పి.జి, పి. హెచ్‌డి చేశారు. చదువు పూర్తికాగానే సికింద్రాబాద్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజిలో అధ్యాపకుడిగా చేరి, తరువాత నిజాం కాలేజిలో అధ్యాపకుడిగా పని చేశారు. ఉస్మానియా ఆచార్యుడిగా పనిచేస్తూ అనేక ఉన్నత పదవులు, పురష్కారాలు పొందారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు, బహుభాషా వేత్తగా సినీ రచయితగా, ఎంపీగా పనిచేశారు. తెలుగు యూనివర్శిటీ అంబేద్కర్ సారస్వతిక విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సులర్‌గా పనిచేశారు. ఏ పదవి చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చే రీతిలో వ్యవహరించారు. 1962లో గులేబ కావళి కథాచిత్రంలో సినీ జీవితం ప్రారంభించి దాదాపు 3600 పాటలు వ్రాశారు. ఆయన గ్రంధాలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ, మళయాళం, ఉర్దూ, కన్నడ తదితర బాషల్లోకి అనువాదమయ్యాయి. 1977లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. విద్యాత్మకంగా, పాలనాపరంగా ఎన్నో పదవులు నిర్వహించారు. 1981లో అధికార బాష సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. 1988లో ఆయన వ్రాసిన విశ్వంభర కావ్యానికి గానూ ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ పురష్కారం లభించింది. 1990లో యుగోస్లోవ యాలోని స్రూగాలో జరిగిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో భారతీయ భాషల ప్రతినిధిగా పాల్గొన్నారు. 1992లో సాంస్కృతిక వ్యవహారాల సలహాదారునిగా పనిచేశారు. ఆంధ్ర సారస్వత సభ్యుడిగా కొనసాగారు. సినీ రంగంలో ఆయన పాటలు ఎంతో ప్రసిద్ధి గాంచాయి.

మనుషులకు సంతృప్తి, సంస్థలకు సంతోషాన్ని కలిగించిన సారస్వతమూర్తి సి.నా.రె. ఆయన ప్రపంచమంతా పర్యటించారు. ప్రపంచమంతా ఆయనకు సాహితీమూర్తిగా నీరాజనమెత్తింది. జూన్ 12, 2017న కనుమూశారు. తెలుగు సాహిత్య చరిత్రలో స్థిరస్మరణీయుడు.. చిరస్మరణీయుడు ..

మనుషులు ఉంటారు, పోతారు !
అక్షర స్వరాలు నిరంతరాలు !!



–తాడినాడ భాస్కరరావు
9441831544

## అణురూపాలు



చెక్కేతీరును బట్టి శిల్పం
పాలుబోసి పెంచితే
పులి పిల్లా సాధుజంతువే.
పుట్టగానే ఏ శిశువు
ప్రతిభావల్లభుడు కానేరదు.
పుట్టు ప్రతిభ పుక్కిడి పురాణం
పోషణను బట్టి ఎదుగుదల.
అణువులో అణిగి ఉన్న శక్తిని
ఐన్‌స్టీన్ బట్టబయలు చేసినట్లు
పొందికైన ప్రణాళికతో
పసిప్రాణులను
పరమహంసల్లా తీర్చిదిద్దొచ్చు
అణురూపాల్లో ఇమిడి ఉన్న
బ్రహ్మాండాన్ని
వెలికి తీయొచ్చు!

– ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## నాటిన మొక్కలను సంరక్షించాలి

కరీంనగర్,జూలై24(నేటినిజం ప్రతినిధి): తెలంగానాకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. హరితహారంలో మండలం గ్రామాల వారిగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను వాటరింగ్ చేయాలన్నారు. వర్షాభావ పరిస్తితుల నేపథ్యంలో మొక్కలను నీటిని సరఫరా చేయాలని నాటిన మొక్కలు చనిపోకుండా చూడాలన్నారు. ఆయా శాఖల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలను గమనించాలన్నారు. చెరువుగట్లు, పొలంగట్లపైన టేకు యూకలిప్టస్ వంటి మొక్కలను నాటించాలని ఇందుకు రైతులను ప్రజలను చైతన్య పరచాలన్నారు. మొక్కలను నాటి వాటి సంరక్షణ భాద్యతలను నిర్వహించాలన్నారు.గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్మాణాలు పూర్తి చేసిన వాటికి డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. అప్‌లోడ్ చేసిన వాటికి వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. మంజూరు చూసిన మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని లబ్దిదారులు కంకణం కట్టుకోవాలన్నారు.



రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రాగరమ్య కల్చరల్ అండ్ సోషల్, యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'తొలకరి రుతురాగాలు' శీర్షికన నిర్వహించిన కార్యక్రమం లో బీసీ కమీషన్ ఛైర్మన్ బీయస్.రాములు, బీసీ కమీషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, నటుడు, దర్శకుడు మాదాల రవి, రచయిత్రి శశిబాల, సామాజికవేత్తలు ఎర్రం పూర్ణ శాంతి, కొత్తకృష్ణ వేణి, సీనియర్ పాత్రికేయులు రత్నాకర్‌శర్మ, లయన్ కె.వి.రమణారావు, యువనర్తకి లాస్యభారతి., రమ్య తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కొత్త కథ 2019 పుస్తకావిష్కరణలో పి. సత్యవతి, అల్లం రాజయ్య, వివినమూర్తి, ఎన్.వేణుగోపాల్ కాత్యాయని తదితరులు.

**నేటినిజం** చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.
'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–500 020.

## ఈనెల 27న ఇందూరు భారతి స్వర్ణోత్సవాలు

ఇందూరు భారతి రచయితల సమాఖ్య నిజామాబాద్ స్వర్ణోత్సవాలు (1969–2019) సందర్భంగా మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నాయి.

ఈ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా పాలనాధికారి యం. రామోహన్‌రావు, మాజీ పార్లమెంటు సభ్యులు డా॥ఎం. నారాయణరెడ్డి, ఆత్మీయ అతిథులుగా డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ అమృతలత విశిష్ట అతిథులుగా డా॥ వసుందరదేవి, నెల్లుట్ల రమాదేవి, డా॥ నాగభూషణం గుప్త, పొత్తూరి సుబ్బారావు. సభకు ఎ. సూర్యప్రకాశ్ అధ్యక్షత వహిస్తారు.

**అందరూ ఆహ్వానితులే**

సమయం: 27–7–2019
ఉ॥ 11–30 ని॥లకు
స్థలం: మహిళా కళాశాల
కంఠేశ్వర్, నిజామాబాద్

–మేక రామస్వామి
ప్రధాన కార్యదర్శి: ఇందూరు భారతీ
సెల్: 8179538153

## ఇస్రో శాస్త్రజ్ఞులకు సలాం...

బలే విచిత్రంబలే ఆనందం
ప్రయత్నమంత మనదే మనదే
అమ్మా! ఈ బొమ్మ చూడమ్మ
ఇది నేను గీచానమ్మ..
ఈ పలుకులతో అమ్మ
ముసిముసి నవ్వుల ఆనందంలా
భారతమాత
బిడ్డల,స్వయంకృషికి
భారతమాత ఆనందం
ఓ నెలరాజా వెన్నెలరాజా.
మా వెన్నుతట్టి పిలిచింది నీవేనోయి
అందుకేనోయి
శ్రీహరికోట ఇస్రో శాస్త్రజ్ఞులు
అంతరిక్షంలో కి
ఆనందంగా పంపారోయి
దేశ గౌరవం నిలిపి, చరిత్రలోనే నిలిచారోయి
పరిశోధన పరికారాలన్ని మనయేనోయి

రానున్నరోజులలో మంచిఫలితాలు
మనకేనోయ్.



–యెల్ది సుదర్శన్ పద్మశాలి
9892411067



సోమవారం ఖమ్మం జిల్లా కాచిరాజుగుడెం శ్రీ సీతారామలింగేశ్వర దేవస్థానం సందర్శించిన సినీ గేయకవి మౌనశ్రీ మల్లిక్ దంపతులను పుష్పాభిషేకంతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో బ్రహ్మర్షి ప్రభాకర స్వామి గారు ఆలయ ధర్మకర్త మంచికంటి తిరుమలరావు గారు ఆలయ పూజారులు నళిన్ శర్మ గారు, చారి గా తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం ఆధ్వర్యంలో 'భారత విప్లవోద్యమ రథసారదులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర్లు, తరిమెల నాగిరెడ్డిల సంస్మరణ సభలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న విప్లవ కవి నిఖిలేశ్వర్, డా॥ జతిన్‌కుమార్, డా॥సిహెచ్ఎన్. మూర్తి, డా॥ విజయేందర్ రావు, సీహెచ్ఎన్ మూర్తి, జి. వెంకటాద్రి.

ఆహ్వానం
తెలంగాణ సాహితి, అపూర్వ క్రియేషన్స్ ఆధ్వర్యంలో
తిరునగరి శ్రీనివాసస్వామి "వెన్నెలవాన"
తిరునగరి శరత్ చంద్ర "అక్షరశిఖరం"
ఆవిష్కరణోత్సవం




ముఖ్యఅతిథి ఆవిష్కర్త : డా॥ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ సినీగేయ రచయిత, జాతీయ పురస్కార గ్రహీత
సభాధ్యక్షులు : డా॥ పత్తిపాక మోహన్, సహాయ సంపాదకులు, నేషనల్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్
గౌరవ అతిథి : ఆచార్య సూర్యాధనంజయ్, అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ప్రత్యేక అతిథి : శ్రీ బైసా దేవదాసు, సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథులు : శ్రీ భూపతి వేంకటేశ్వర్లు, సంపాదకులు, మోదుగు పూలు మాస పత్రిక
శ్రీ తంగిరాల చక్రవర్తి, ఉపాధ్యక్షులు, తెలంగాణ సాహితి
వెన్నెలవాన కృతిస్వీకర్త : డా॥ టి. శ్రీరంగస్వామి, ప్రముఖకవి, విమర్శకులు, వరంగల్
వెన్నెలవాన పుస్తకపరిచయం : డా॥సి.హెచ్.లక్ష్మణచక్రవర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్,తెలుగుశాఖ,తెలంగాణ విశ్వవిద్యాలయం
అక్షరశిఖరం పుస్తకపరిచయం : శ్రీ ఆనంతోజు మోహనకృష్ణ, తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటి కోశాధికారి
తేది : 27, జూలై, 2019. సా॥ 5:00 గం.కు
వేదిక : సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు
స్వాగతం: సలీమ
వందనసమర్పణం : సయ్యద్ ముజాహిద్ అలీ

ఆహ్వానము
తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం &
తెలంగాణ కళావేదిక
సంయుక్త ఆధ్వర్యంలో...
సినారె జయంతి వేడుకలు



వేదిక: వాగేశ్వరి డిగ్రీ కళాశాల, కరీంనగర్ తేది: 29-07-2019 సా॥ 6.00 గం॥లకు
రాష్ట్రస్థాయి సినారె వాగ్భూషణ పురస్కారం - 2019 &
రాష్ట్రస్థాయి సినారె కవితాపోటీ బహుమతుల ప్రదానోత్సవం
ముఖ్య అతిథి :
శ్రీ ఈటల రాజేందర్ గారు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు
విశిష్ట అతిథి :
శ్రీమతి కనుమల్ల విజయ గారు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, కరీంనగర్
సభాధ్యక్షులు :
డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి గారు, అధ్యక్షులు, తె.తె.భా.స. సంఘం
స్వాగతోపన్యాసం :
శ్రీ అనుముల దయాకర్ గారు, అధ్యక్షులు, తె.క.వే.
వాగ్భూషణ పురస్కార గ్రహీత :
శ్రీ జి. గిరిజామనోహరబాబు గారు, ప్రముఖ సాహితీవేత్త
వాగ్భూషణ పురస్కార దాత :
శ్రీ దాస్యం సేనాధిపతి గారు, రాష్ట్ర కార్యదర్శి, తె.తె.భా.స. సంఘం
ఆత్మీయ అతిథులు :
శ్రీ యం.వి. నర్సింహారెడ్డి గారు, రాష్ట్ర అధ్యక్షులు, తె.తె.భా.స. సంఘం
శ్రీ గాజుల రవీందర్ గారు, కార్యదర్శి, సాహితి గౌతమి
అందరూ ఆహ్వానితులే..!
బొమ్మకంటి కిషన్, కార్యదర్శి నీలగిరి అనిత, మహిళా కార్యదర్శి
తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ కార్యవర్గం

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.